
'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 184

సోమవారం 20-3-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | DELHI | VIJAYAWADA | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆసీస్ పేస్‌కు భారత్ బోల్తా

రెండో వన్డేలో 10 వికెట్ల తేడాతో ఓడిన టీమిండియా - 12లో



అమ్మ ఆకాంక్షలకు చట్టరూపం

ఎస్టేట్ ప్లానింగ్‌తో కుటుంబానికి పూర్తి రక్షణ.. విల్లు కంటే విస్తృతం - 13లో



పరారీలో అమృత్‌పాల్ సింగ్

పంజాబ్‌లో వివాదాస్పద ఖలిస్తానీ నేత అమృత్‌పాల్‌సింగ్ పరారీలో ఉన్నాడని.. 78 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు 6లో ▸



రాహుల్ ఇంటికి పోలీసులు

మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని కాంగ్రెస్ నేత రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ఢిల్లీ పోలీసులు స్పందించారు.

వివరాలు 6లో ▸



ఆక్రమిత మేరియుపోల్‌లో పుతిన్

ఉక్రెయిన్‌లోని ఆక్రమిత తీర ప్రాంత నగరమైన మేరియుపోల్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదివారం పర్యటించారు.

వివరాలు 6లో ▸



ఈక్వెడార్, పెరూలో భూకంపం

ఈక్వెడార్-పెరూలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.8గా నమోదవ్వగా.. 14 మంది చనిపోయారు.

వివరాలు 6లో ▸

తేడా మీరే చూడండి

అది దోపిడీ ప్రభుత్వం.. ఇది మనసున్న ప్రభుత్వం: సీఎం జగన్

- జగనన్న విద్యా దీవెన పథకం నిధులు విడుదల చేసిన సీఎం
- 9.86 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.698.68 కోట్లు జమ
- గత ప్రభుత్వంలో అరకొర ఫీజులు చెల్లింపు
- దీంతో అర్ధంతరంగా ఉన్నత చదువులు మానేయాల్సిన దుస్థితి
- ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేసిన మనందరి ప్రభుత్వం
- ఎంత పెద్ద చదువు అయినా ఫీజు భారం ప్రభుత్వానిదే
- నేడు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల పట్ల నిండు మనస్సుతో స్పందించే గుణం.. సామాజిక న్యాయం, మహిళా న్యాయం, రైతన్నలకు న్యాయమే లక్ష్యం
- గడప గడపలో సంతోషం చూడాలని తపించే తత్వం
- రెండేళ్లలో ప్రభుత్వ బడులతో కార్పొరేట్ స్కూళ్ల పోటీ పడాలి



జగనన్న విద్యాదీవెన చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో మంత్రి బొత్స, ప్రజా ప్రతినిధులు, అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'గత ప్రభుత్వంలో అరకొర ఫీజులతో పేద పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించలేని దుస్థితి.. నేడు ఫీజు ఎంతైనా సరే.. మేమే చెల్లిస్తామంటూ పూర్తి భారం భుజాన వేసుకున్న ప్రభుత్వం ఇది.. గతంలో ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్.. అప్పుల పెరుగుదల శాతం చూస్తే అప్పటికన్నా ఇప్పుడే తక్కువ.. మరి మీ బిడ్డ ఎందుకు చేయగలుగుతున్నాడు.. గతంలో వాళ్లు ఎందుకు చేయలేకపోయారో ఆలోచించండి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) విధానాన్ని నడిపిన


మిగతా 2వ పేజీలో ▶

> దుష్ట చతుష్టయం ఎన్ని కుతంత్రాలు పన్నుతున్నా, ఎల్లో మీడియా ఎన్ని తప్పుడు రాతలు రాస్తున్నా, ప్యాకేజీ పార్టీలు ఎంతగా చేతులు కలిపినా, నీచ రాజకీయం నిత్యం ఎంత జరుగుతున్నా మీ బిడ్డకు ధైర్యం మీరే. నా నమ్మకం మీరే. నన్ను నడిపించేది మీరే. నా ప్రయాణంలో నేను నిరంతరం ఆధారపడే పరిస్థితి ఉందంటే అది ఆ దేవుడి మీద, మీ మీద మాత్రమే. అందువల్లే వీళ్ల మాదిరిగా నేను పొత్తులు పెట్టుకోవడానికి వెంపర్లాడను.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'స్కిల్' సూత్రధారి బాబే

అసెంబ్లీలో చర్చలో ఆర్థిక మంత్రి బుగ్గన

- డీపీఆర్, టెండర్లు లేకుండా సీమెన్స్ పేరిట నిధుల దోపిడీ
- పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలన్న సూచనలు బేఖాతర్
- ఒప్పంద పత్రంలో పేరు ఒకరిది.. సంతకాలు మరొకరివి
- ఈ ప్రాజెక్టుతో తమకు సంబంధం లేదని కోర్టులో సీమెన్స్ చెప్పింది
- లెటర్ నెంబర్, డేటా లేకుండానే రూ.371 కోట్లు విడుదల





సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ అంతా చంద్రబాబేనని, ఆయన ఆదేశాల మేరకే డీపీఆర్, టెండర్లు లేకుండా నిధుల దోపిడీ జరిగిందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పష్టం చేశారు. గుజరాత్ మోడల్ అంటూ అబద్ధాలు వల్లించి కుంభకోణానికి పాల్పడ్డారని చెప్పారు. ఈ స్కామ్‌లో

మిగతా 14వ పేజీలో ▶

వదలని వర్షాలు

బెంబేలెత్తిస్తున్న వడగళ్లు, ఈదురుగాలులు

- పిడుగుపాట్లకు రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు మృత్యువాత
- రేపట్నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం
- పంట నష్టంపై వివరాలు సేకరిస్తున్న అధికారులు
- వర్షాలపట్ల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రైతుల హర్షం



పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం దింతెనపాడులో పడిన వడగళ్లు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/నెట్‌వర్క్: రాష్ట్రంలో ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో అనేకచోట్ల శనివారం అర్ధరాత్రి, ఆదివారం కూడా వానలు దంచికొట్టాయి. వర్షాలకు తోడు వడగళ్లు, ఈదురుగాలులు, పిడుగులు బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి పశ్చిమ విదర్భ వరకు మరఠ్వాడా మీదుగా సముద్ర మట్టానికి 0.9 కి.మీల ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. దీని ఫలితంగా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో వర్షాలు కురిశాయి. ఇక మూడ్రోజుల వర్షాల ప్రభావం నంద్యాల, కర్నూలు, అన్నమయ్య, విజయనగరం, వైఎస్సార్, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి, గుంటూరు, చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని 53 మండలాల్లోని 188 గ్రామాలపై ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పిడుగుపాటుకు రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు వ్యక్తులు మరణించినట్లు నిర్ధారించారు. పల్నాడులో ఇద్దరు, నంద్యాల, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లో ఒకొక్కరు చొప్పున మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. వర్షాలకు కొన్నిచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. ఎక్కడెక్కడ పంట నష్టం జరిగిందనే దానిపై

మిగతా 5వ పేజీలో ▶

ఈడీ విచారణకు కవిత హాజరుపై ఉత్కంఠ



ఢిల్లీ లిక్కర్ స్కామ్ అంశంలో ఈడీ విచారణకు తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరుపై ఉత్కంఠ కొనసాగుతోంది. మరోవైపు కవిత ఆదివారం సాయంత్రమే హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లారు. ఆమె వెంట ఆమె భర్త అనిల్‌తోపాటు మంత్రి కేటీఆర్, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, కొందరు సన్నిహిత అనుచరులు ఉన్నట్టు సమాచారం.

- వివరాలు 14లో

'మండలి'లో టీడీపీ మళ్లీ రచ్చ

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిక్లరేషన్లు ఇచ్చే అంశంపై వాయిదా తీర్మానం
- ఈసీ పరిధిలోని అంశం ఇక్కడ చర్చిస్తే ఏం ప్రయోజనమన్న చైర్మన్.. పోడియంలోకి వెళ్లి ఆందోళనకు దిగిన టీడీపీ

10లో

నాడు రైతులపై కాల్పులు..

నేడు నాణ్యమైన కరెంట్

- అసెంబ్లీలో విద్యుత్తు శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- నయాపైసా భారం పడకుండా నేరుగా డీబీటీతో ఖాతాలకు జమ

10లో

పంట నష్ట పరిహారంపై వెంటనే ఎన్యూమరేషన్

- రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి
- కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి
- అకాల వర్షాలపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం


- వివరాలు 2లో

అవిగవిగో నీటి జాడలు

చంద్రుడితో పాటు అంగారక గ్రహం పైన కూడా నీటి జాడలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. చంద్రుడిపై నీటి ఆనవాళ్లకు సంబంధించిన సవివరమైన మ్యాప్‌ను తాజాగా రూపొందించగా.. అంగారక గ్రహం మధ్యరేఖ వద్ద పురాతన గ్లేసియర్ అవశేషాలను గుర్తించామని అమెరికా శాస్త్రవేత్తలు ప్రకటించారు.

6లో





ఉచితంగా ఆధార్ అప్‌డేట్

ఆన్‌లైన్‌లో సొంతగా అప్‌డేట్ చేసుకునే వారికే చాన్స్

నూతన జిల్లాల వారీగా ఆధార్ అప్‌డేట్‌కు చర్యలు తీసుకోవాలి

ఏపీ సీఎస్‌కు యూఐడీఏఐ లేఖ..

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లు

3లో



రైతు క్షేత్రం నుంచే అంతర్జాతీయ విపణికి..

- త్వరలో ఏపీకి గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (గ్యాప్) సర్టిఫికేషన్.. రాష్ట్రంలో పర్యటించి సంతృప్తి వ్యక్తం చేసిన క్యూసీఐ బృందం
- ఏపీ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీకి సర్టిఫికేషన్ అక్రిడిటేషన్ ఇచ్చేందుకు సంసిద్ధత.. సర్టిఫికేషన్ పొందే తొలి రాష్ట్రంగా రికార్డులకెక్కుతున్న ఏపీ
- దీంతో మన పంటలను ప్రీమియం ధరకు విక్రయించుకునే అవకాశం.. అమెరికా సహా 100 దేశాలకు నేరుగా రైతులే ఎగుమతి చేసుకునే వెసులుబాటు

- వివరాలు 5లో

తేడా మీరే చూడండి




తిరువూరులో జరిగిన సభలో అశేష జనవాహినిని ఉద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌, సభకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

▶ మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వానికి.. డైరెక్ట్‌ బెనిఫిట్‌ ట్రాన్స్‌ఫర్‌ (డీబీటీ) విధానాన్ని ఆచరిస్తున్న మీ బిడ్డ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడా ఏమిటో మీరే గమనించాలని అన్నారు. విప్లవాత్మక కార్యక్రమాలు, సంస్కరణలతో విద్యా రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్న మనందరి ప్రభుత్వంలో ఉన్నత చదువులకు పేదరికం అడ్డు కానేకాదని పునరుద్ఘాటించారు. ఎన్టీఆర్‌ జిల్లా తిరువూరులో ఆదివారం ఆయన జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా 2022 అక్టోబర్‌– డిసెంబర్‌ త్రైమాసికానికి సంబంధించిన నిధులు విడుదల చేశారు. 9.86 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ కంప్యూటర్‌లో బటన్‌ నొక్కి రూ.698.68 కోట్లను నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంక్‌ ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

చదువుతోనే వెలుగు

- మన పిల్లలకు మనం చెరగని ఆస్తి ఏదైనా ఇస్తున్నామంటే అది చదువు మాత్రమే. ఈ రోజు 17–20 ఏళ్ల మధ్య ఉన్న నేటి తరం మరో 80 ఏళ్ల పాటు వాళ్ల జీవితాలు సాఫీగా సాగాలంటే నిర్దేశించేది ఒక్క చదువు మాత్రమే.
- అందుకే మన రాష్ట్రంలో ఇవాళ ఎల్‌కేజీ లేదా పీపీ1 నుంచి చదువులు ప్రారంభిస్తున్న బిడ్డ దగ్గర నుంచి, ఆ బిడ్డ ఎదిగి మంచి డాక్టరో, ఇంజినీరో కావాలి. ఢిల్లీరావు శ్రీకాకుళం జిల్లాలో అత్యంత సాధారణమైన కుటుంబం నుంచి వచ్చారు. ఇవాళ కలెక్టర్‌గా మీ కళ్లముందు కనిపిస్తున్నారు. ఇలా అందరి బతుకులు మారాలి.

తోడేళ్లు ఏకమవుతున్నాయి..

- మనందరి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయలేదంటున్న దుష్ట చతుష్టయం ఎందుకు పొత్తుల కోసం వెంపర్లాడుతోంది? ఎందుకు ఈ తోడేళ్లు ఏకమవుతున్నాయి? ఏ విషయంలోనూ మనతో పోల్చుకునేందుకు అర్హత లేని వారంతా ఎందుకు దుష్ప్రచారం చేస్తున్నారు? మనందరి ప్రభుత్వంపై ఎందుకు రాళ్లు వేస్తున్నారు? వారు చెబుతున్నదే నిజమైతే ఒంటరిగా 175 నియోజక వర్గాల్లో పోటీ చేయాలని నేను సవాల్‌ చేస్తున్నా. ఈ సవాల్‌ స్వీకరించే దమ్ము, ధైర్యం మీకుందా?
- దోచుకో, పంచుకో, తినుకో బ్యాచ్‌ ఎవరో తెలుసా? ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబు. వీళ్లందరికీ తోడు వీరి దత్తపుత్రుడు. కుటుంబ, మానవత, రాజకీయ విలువలు లేని ఈ దుష్ట చతుష్టయంతో ఇవాళ మనం యుద్ధం చేస్తున్నాం. వారు ఎన్ని కుతంత్రాలు పన్నినా చివరకు మంచే గెలుస్తుంది.
- రామాయణం చూసినా, భారతం చూసినా, బైబిల్‌ చదివినా, ఖురాన్‌ చదివినా.. ఏ సినిమాకు వెళ్లినా అదే కనిపిస్తుంది. నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, నా నిరుపేద అవ్వా తాతలు, అక్కచెల్లెమ్మలు, రైతన్నలు నిండు మనసుతో ఆశీర్వదిస్తుండగా, ఆ దేవుడు దీవిస్తుండగా అడుగులు ముందుకు వేస్తున్నాను.

- గత ప్రభుత్వ హయాంలో కాలేజీల ఫీజులు రూ.70 వేలు, రూ.80 వేలు, రూ.1 లక్ష నుంచి కొన్ని కాలేజీల్లో రూ.1.20 లక్షలు ఉంటే.. ఇచ్చేదేమో రూ.35 వేలు మాత్రమే. అది కూడా ఎప్పుడిస్తారో తెలియదు.
- మనందరి ప్రభుత్వం రాగానే ఆ పరిస్థితి పూర్తిగా మారుస్తూ 100% ఫీజు రీయింబర్స్‌మెంట్‌ చేస్తున్నాం. 27 లక్షల మంది పిల్లలకు రూ.9,947 కోట్లు ఇచ్చాం. గత ప్రభుత్వంలో చివరి రెండేళ్లు ఎగ్గొట్టిన రూ.1,777 కోట్లు కూడా చిరునవ్వుతో చెల్లించాం.
- వసతి దీవెన కింద ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్‌ విద్యార్థులకు రూ.15 వేలు, మెడిసిన్, ఇంజినీరింగ్, ఇతర డిగ్రీ చదువుతున్న పిల్లలకు ఏటా రూ.20 వేలు చొప్పున రెండు దఫాలుగా తల్లుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నాం. ఈ సంవత్సరానికి ఏప్రిల్‌ 11న ఇవ్వాలని నిర్ణయించాం.

ప్రపంచంతో పోటీ పడాలి

- మన పిల్లలు బాగా చదవాలని, ప్రపంచంతో పోటీ పడాలని ఇవన్నీ చేస్తున్నాం. అందుకే విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు 45 నెలల్లో రూ.13,311 కోట్లు ఖర్చు చేశాం. అందువల్లే 2018–19లో 87,439 మంది పిల్లలు ఇంజినీరింగ్‌ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో చేరితే, 2022–23లో ఆ సంఖ్య 1.20 లక్షలకు చేరింది.
- ఇంటర్‌ పాసై చదువుకు దూరమైన విద్యార్థుల సంఖ్య 2018–19లో 81,813 ఉంటే, 2022–23లో ఆ సంఖ్య 22,387కు తగ్గిపోయింది. 2018–19లో 37 వేలు ఉన్న క్యాంపస్‌ ప్లేస్‌మెంట్లు 2021–22లో 85 వేలకు చేరాయి.

తిరువూరుకు వరాలు

- తిరువూరు నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే కొక్కిలగడ్డ రక్షణనిధి కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు అడిగారు. కట్టలూరు వాగు మీదుగా హైలెవల్‌ బ్రిడ్జి కోసం రూ.26 కోట్లు మంజూరు చేస్తున్నాం.
- ఎ.కొండూరులో కిడ్నీ బాధితులను దృష్టిలో ఉంచుకుని కృష్ణా జలాల సరఫరా కోసం రూ.50 కోట్లు కేటాయిస్తున్నాం.
- దాదాపుగా 8వేల పై చిలుకు ఇంటి స్థలాలు ఇచ్చాం. 4 వేల ఇళ్లు మంజూరై వేగంగా కడుతున్నారు. మరో 6 వేల ఇళ్లు కావాలన్నారు. అవి కూడా మంజూరు చేస్తున్నాం. పది వేల ఇళ్లు అంచనాగా తీసుకుంటే వీటి ఖరీదు దాదాపు రూ.250 కోట్లు.
- రోడ్ల మరమ్మతుకు రూ.10 కోట్లు, డ్రైనేజీ కోసం రూ.4 కోట్లు మంజూరు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఇక్కడ స్కిల్‌ సెంటర్‌ (ఐటీఐ, పాలిటెక్నిక్‌ తరహాలో) వస్తుంది.

- ఇంటర్‌ తర్వాత చదువు ఆపేసిన విద్యార్థుల సంఖ్య దేశంలో సగటున 27%ఉంటే మన రాష్ట్రంలో అది 6.62% మాత్రమే. గ్రాస్‌ ఎన్‌రోల్‌మెంట్‌ రేషియో (జీఈఆర్‌ – అంటే 17–23 ఏళ్ల పిల్లలు కాలేజీల్లో చదవడం) 2018–19లో దేశం సగటు 32.4 శాతం ఉంటే మన రాష్ట్రంలో 70%లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నాం.
- అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక, నాడు–నేడు, బైలింగ్యువల్‌ టెక్ట్స్‌ బుక్స్, ఇంగ్లిష్‌ మీడియం తదితర కార్యక్రమాలతో విద్యార్థులకు అండగా నిలిచాం. నాడు–నేడు పూర్తి చేసుకున్న 15,270 స్కూళ్లలో 6వ తరగతి, ఆపై ఉన్న స్కూళ్లు దాదాపు 5,800 ఉన్నాయి. వీటిలో 30,230 క్లాస్‌ రూమ్‌లలో ఇంటరాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానెల్స్‌ పెట్టి తరగతి గదులను డిజిటలైజ్‌ చేయబోతున్నాం. 8వ తరగతిలో అడుగు పెట్టిన ప్రతి పిల్లాడికి ట్యాబ్స్‌ ఇస్తున్నాం. పదో తరగతి బోర్డు పరీక్షలు సీబీఎస్‌ఈ సిలబస్‌లో రాసేలా తర్ఫీదు ఇస్తున్నాం.

ఉన్నత విద్యలోనూ మార్పులు

- హయ్యర్‌ ఎడ్యుకేషన్‌లో కూడా మార్పులు తీసుకొచ్చాం. నాలుగేళ్ల ఆనర్స్‌ డిగ్రీ, ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశాం. జాబ్‌ ఓరియెంటెడ్‌గా కరిక్యులమ్‌లో మార్పులు తెచ్చాం. మైక్రోసాఫ్ట్, ఏడబ్ల్యూఎస్, నాస్కామ్, సేల్స్‌ఫోర్స్, ఆల్టో వంటి పెద్ద పెద్ద సంస్థలన్నీ సెల్ఫ్‌ సర్టిఫికేషన్‌ ఇచ్చేట్టుగా ఉచితంగా పిల్లలకు అందుబాటులోకి తీసుకువచ్చాం. రెండేళ్ల తర్వాత కార్పొరేట్‌ బడులే ప్రభుత్వ బడులతో పోటీ పడలేకపోతున్నాయనేలా చేస్తాం.
- మనబడి నాడు–నేడుతో 46,447 స్కూళ్లు, కాలేజీలలో 12 రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తూ మార్పు చేస్తున్నాం. కొత్తగా 14 డిగ్రీ కళాశాలలను తీసుకొచ్చాం. జేఎన్‌టీయూ గురజాడ యూనివర్సిటీని విజయనగరంలో, ఆంధ్రకేసరి యూనివర్సిటీని ఒంగోలులో, వైఎస్సార్‌ అగ్రికల్చర్, ఆర్కిటెక్చర్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ యూనివర్సిటీని కడపలో ఏర్పాటు చేశాం. కర్నూలులో క్లస్టర్‌ యూనివర్సిటీని పెట్టాం. ఈ ఏడాది పులివెందులలో అగ్రికల్చర్‌ కాలేజీ తీసుకొచ్చే కార్యక్రమం చేస్తున్నాం.
- 17 కొత్త మెడికల్‌ కాలేజీలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్నాయి. 11 గవర్నమెంట్‌ మెడికల్‌ కాలేజీలను నాడు–నేడుతో రూపురేఖలు మారుస్తున్నాం.

ఇంటింటా ఆనందమే లక్ష్యం

- అవ్వతాతలు, అక్కచెల్లెమ్మలు, పిల్లలు, రైతుల పట్ల కానీ, సమాజంలో అణిచివేతను ఎదుర్కొన్న నా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల పట్ల కానీ, నిరుపేదల పట్ల కానీ నిండు మనస్సుతో స్పందించే హృదయం నాది. అందువల్లే ఈ రోజు సామాజిక న్యాయం, మహిళా న్యాయం, రైతన్నలకు న్యాయం.. తదితర వాటిని కర్తవ్యంగా, దైవకార్యాలుగా భావించి ముందుకు తీసుకువెళ్తున్నాం. గడప గడపలో సంతోషం చూడాలని, ఇంటింటా ఆనందం ఉండాలని తపించే మనస్సు మన ప్రభుత్వానిది. గత 45 నెలల్లో ఎలాంటి వివక్ష, లంచాలకు చోటు లేకుండా నేరుగా రూ.1.98 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశాం.

జన జాతర

తిరువూరులో ఆదివారం సీఎం జగన్‌ సభ జన జాతరను తలపించింది. మూడు రోజులుగా ఆ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం ఏడు గంటల వరకు సైతం వర్షం పడింది. అయినప్పటికీ ప్రజలు భారీగా తరలివచ్చారు. సభ వేదిక పైకి సీఎం విచ్చేస్తున్నప్పుడు ప్రజలు పెద్ద ఎత్తున సీఎం.. సీఎం.. అంటూ నినదించారు. సీఎం అభివాదం చేసినప్పుడు విద్యార్థులు కేరింతలు కొట్టారు. సీఎం ప్రసంగిస్తున్నంత సేపూ ప్ల కార్డులు ప్రదర్శిస్తూ, జై జగన్‌ అంటూ నినాదాలు చేశారు.

రూ.27 లక్షలతో నాకు జాబ్‌



నాలాంటి ఎంతో మంది పేద విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు గొప్ప వరాలు. మా అమ్మ సింగిల్‌ పేరెంట్‌. నన్ను ఉన్నత చదువులు చదవించాలనుకున్నా ఆమె ఆర్థిక పరిస్థితి సహకరించదు. నేను బీటెక్‌ ఫైనలియర్‌లోనే క్యాంపస్‌ ప్లేస్‌మెంట్స్‌లో నాలుగు జాబ్‌ ఆఫర్స్‌ పొందానంటే అది మీ (సీఎం జగన్‌) వల్లే. ఈ రోజు రూ.27 లక్షల కాంబో ఆఫర్‌లో ఇంజినీరింగ్‌ ప్లేస్‌మెంట్‌లో సెలక్ట్‌ అయ్యానంటే అది మీ చలవే. దిశ యాప్‌లో మీ ఫొటో చూస్తే చాలు మాకు ధైర్యం వస్తుంది.

– మహిజ చెర్రి బ్లాసమ్, లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్‌ కాలేజ్, మైలవరం

మీ సంకల్పానికి సెల్యూట్‌



వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి వచ్చిన నేను ఈ రోజు నర్సింగ్‌ చదువుతున్నాను అంటే అది జగనన్న విద్యా దీవెన వల్లే. ఈ రోజు మీ పథకాల వల్లే నా లాంటి పేద పిల్లలు పెద్ద పెద్ద చదువులు చదవగలుగుతున్నారు. అంగన్‌వాడీలు మొదలు యూనివర్సిటీల వరకు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. విద్యా రంగాన్ని బలోపేతం చేశారు. విదేశీ విద్యా దీవెనలో ఎవరూ ఊహించని విధంగా లక్షలాది రూపాయలు ఫీజుగా చెల్లిస్తుండటం విద్యపై, విద్యార్థులపై మీకు ఉన్న అభిమానానికి నిదర్శనం. మీరు ఏదైనా సరే చేతల్లో చూపించే నాయకుడు. విశాఖలో జీఐఎస్‌ ఇందుకు చక్కటి ఉదాహరణ. మీ సంకల్పానికి సెల్యూట్‌ చేస్తున్నా.

– కొమ్ముకూరి పావ, విజయవాడ

సంక్షేమాభివృద్ధి ఆగదు

సంక్షేమ పథకాలు అమలు కాకూడదన్నది ప్రతిపక్షాలు, ఓ వర్గం మీడియా లక్ష్యం. అందుకే పనిగట్టుకుని ఎప్పటికప్పుడు అడ్డంకులు సృష్టిస్తున్నారు. రాష్ట్రంలో పేదరికం కారణంగా ఏ విద్యార్థీ చదువు మానేయకూడదనే ధ్యేయంతో ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తోంది. విదేశాల్లో చదువుకోవాలనే పేద విద్యార్థుల కల నెరవేరుస్తూ విదేశీ విద్యా దీవెన పథకాన్ని కూడా అమలు చేస్తోంది. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి ఆగదు.

– బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి

అంతు చిక్కని వ్యాధిగ్రస్తులకు సీఎం భరోసా



అంతుచిక్కని వ్యాధితో బాధ పడుతున్న చిన్నారుల తండ్రితో మాట్లాడుతున్న సీఎం జగన్‌

గాంధీనగర్‌ (విజయవాడసెంట్రల్‌): ఎన్టీఆర్‌ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం షేర్‌ మహమ్మద్‌ పేట గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారుల వైద్యానికి సీఎం వైఎస్‌ జగన్‌ భరోసా ఇచ్చారు. గాదే సురేష్, గాయత్రి దంపతుల పెద్ద కుమార్తె వేదశ్రీ దుర్గ(12), చిన్న కుమార్తె సాహితీ శ్రీ ప్రియ(8) పుట్టుకతోనే అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నారు. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించగా కంజెనిటల్‌ మేస్టెనిక్‌ సింగ్రోమ్‌–4సీగా వైద్యులు తేల్చారు. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయలేమని, మందుల ద్వారా కంట్రోల్‌ చేయవచ్చని చెప్పారు. పెయింటర్‌గా పనిచేస్తున్న సురేష్‌కు వైద్య ఖర్చులు భరించే పరిస్థితి లేదు. ఈ విషయాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ద్వారా వారు తిరువూరులో సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, ఆర్థిక సాయం చేయాలని ఆదేశించారు. తక్షణ సాయంగా కలెక్టర్‌ వారికి రూ.లక్ష చెక్కును అందజేశారు.

చిన్నారి కోలుకునే వరకు అండగా..

బ్లడ్‌ క్యాన్సర్‌తో బాధ పడుతున్న తమ కుమారుడు మారిపోగు రంజిత్‌(13)ను ఆదుకోవాలని తిరువూరు మండలం కొమ్మారెడ్డి పల్లెకు చెందిన మారిపోగు శ్రీను, వెంకట్రావమ్మ దంపతులు తిరువూరులో సీఎం వైఎస్‌ జగన్‌కు మొరపెట్టుకున్నారు. రంజిత్‌ కోలుకునే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. బాలుడి వైద్య ఖర్చులకు తక్షణ సాయంగా జిల్లా కలెక్టర్‌ ఢిల్లీరావు రూ.లక్ష చెక్కు తల్లిదండ్రులకు అందజేశారు.

పంట నష్ట పరిహారంపై వెంటనే ఎన్యుమరేషన్‌

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల దెబ్బ తిన్న పంటలకు సంబంధించి నష్టపరిహారంపై వెంటనే ఎన్యుమరేషన్‌ మొదలు పెట్టాలని సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో ఎన్యుమరేషన్‌ పూర్తి చేయాలని చెప్పారు. అకాల వర్షాలపై ఆదివారం ఆయన సీఎంఓ అధికారులతో సమీక్షించారు. వివిధ ప్రాంతాల్లో పంటలకు జరిగిన నష్టం గురించి అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఎన్యుమరేషన్‌ పూర్తయ్యాక రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఎప్పటికప్పుడు కలెక్టర్లు పరిస్థితిని అంచనా వేసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

విత్తన భాండాగారం

- నూతన వరి వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి
- కొత్త రకం వంగడాల ఉత్పత్తికి 2 నుంచి 3 ఏళ్లకు పైగా సమయం
- విత్తన ఉత్పత్తిలో కీలకంగా పనిచేస్తున్న శాస్త్రవేత్తలు
- ఆచార్య ఎన్‌జీ రంగా పరిశోధనా స్థానం కేంద్రంగా పరిశోధనలు

అన్నం మనం తినే గిన్నెలోకి రావాలంటే ఎందరెందరో ఎంతో కష్టపడి ధాన్యాన్ని పండిస్తారు. రైతన్న మూడు నుంచి నాలుగు నెలలపాటు తాను సాగు చేసిన వరి పంటను కంటికి రెప్పలా కాపాడి ధాన్యాన్ని పండించి మన కడుపునింపుతాడు. అయితే ఈ ధాన్యం పండాలంటే విత్తన సృష్టి ఎంతో కీలకం. అందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రధాన భూమిక పోషిస్తారు. విత్తనం ఉత్పత్తి చేయడానికి నెలలు, సంవత్సరాల తరబడి పరిశోధనలు చేస్తారు. ప్రతి గింజనూ రకరకాలుగా పరీక్షలు చేసి నూతన వరి వంగడాలను రైతులకు అందిస్తారు. అప్పుడే ఆ రకం విత్తనం ప్రాముర్యంలోకి వస్తుంది. జిల్లాలో అనేక మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ విత్తనాల ఉత్పత్తి కోసం కృషి చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు.



నెల్లూరు(సెంట్రల్‌): సాగునీరు సమృద్ధిగా ఉండే నెల్లూరు జిల్లాల్లో అధిక శాతం మంది రైతులు వరి పంటను సాగు చేస్తుంటారు. జిల్లాలో ప్రతి ఏటా 6 లక్షల నుంచి 7 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. రైతులకు రకరకాల వరి వంగడాలను ఉత్పత్తి చేసి అందించడంలో జిల్లా కేంద్రం నెల్లూరులోని 'ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం' శాస్త్రవేత్తలు ఎంతగానో కృషి చేస్తున్నారు. ఈ పరిశోధనా స్థానంలో ఇప్పటివరకు పనిచేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న అనేక మంది శాస్త్రవేత్తలు కొత్తకొత్త వరి వంగడాల సృష్టికి ఎంతగానో కృషి చేశారు. వరి విత్తనాలపై సంవత్సరాల తరబడి పరిశోధనలు జరిపి నూతన వరి వంగడాలను ఉత్పత్తి చేసి రైతులకు అందించారు.

1948 నుంచి నేటి వరకు..

నెల్లూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా పరిశోధనా స్థానానికి సంబంధించి 1948 సంవత్సరం నుంచి వివిధ వరి వంగడాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. అయితే 1961వ సంవత్సరం నుంచి పరిశోధనల్లో కొంత మార్పులు వచ్చి నూతన వరి వంగడాలు వినియోగంలోకి వచ్చాయి. 1948వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు అనేక మంది శాస్త్రవేత్తలు దాదాపుగా 28 కొత్త వరి వంగడాలను రైతులకు అందించడంలో విశేషంగా కృషి చేశారు. నెల్లూరులో ఉత్పత్తి చేసిన వివిధ రకాల నూతన వరి వంగడాలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రాముర్యంలో ఉన్నాయి.

నూతన వంగడాల ఉత్పత్తి

జిల్లాలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి బీసీపీ–1, బీసీపీ–2 అనే రెండు రకాల కొత్త వరి వంగడాలను 1948లో శాస్త్రవేత్తలు కనుగొన్నారు. బీసీపీ–3, బీసీపీ–4 అనే వరి వంగడాలను 1950లో, బీసీపీ–5ని 1951లో, బీసీపీ–6ను 1965లో, బల్క్‌హెచ్‌–9ను 1965లో శాస్త్రవేత్తలు ఉత్పత్తి చేశారు. తర్వాత కొత్త మొలగొలుకులు–72 అనే రకాన్ని 1977లో మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. కొత్త మొలగొలుకులు–74 పేరుతో మరో రకాన్ని 1977లో వినియోగంలోకి తెచ్చారు. అనంతరం పినాకిని ఎన్‌ఎల్‌ఆర్‌9672–96ను 1987లో, తిక్కన ఎన్‌ఎల్‌ఆర్‌–27999ను 1988లో, సింహపురి ఎన్‌ఎల్‌ఆర్‌ 28600, శ్రీరంగ ఎన్‌ఎల్‌ఆర్‌–28523, స్వర్ణముఖి ఎన్‌ఎల్‌ఆర్‌–145 రకాలను 1991లో ఉత్పత్తి చేశారు. భరణి ఎన్‌ఎల్‌ఆర్‌–30491, శ్రావణి ఎన్‌ఎల్‌ఆర్‌–33359, స్వాతి ఎన్‌ఎల్‌ఆర్‌–33057, పెన్నా ఎన్‌ఎల్‌ఆర్‌–33365 రకాల వరి వంగడాలను 1996లో, సోమశిల ఎన్‌ఎల్‌ఆర్‌–33358, వేదగిరి ఎన్‌ఎల్‌ఆర్‌–33641లను 1999లో, అపూర్వ ఎన్‌ఎల్‌ఆర్‌–33654 రకాన్ని 2002లో, పార్థివ ఎన్‌ఎల్‌ఆర్‌–33892ను 2006లో, నెల్లూరు మసూరి ఎన్‌ఎల్‌ఆర్‌–34449ను 2009లో, శ్వేత ఎన్‌ఎల్‌ఆర్‌–40024 రకాన్ని 2012లో, నెల్లూరు ధాన్యరాశి ఎన్‌ఎల్‌ఆర్‌–3354, నెల్లూరు సిరి ఎన్‌ఎల్‌ఆర్‌–4001, నెల్లూరు సుగంధ ఎన్‌ఎల్‌ఆర్‌–40054 రకాలను 2020లో ఉత్పత్తి చేసి రైతులకు అందించారు. ఈ విధంగా 28 రకాల కొత్త వరి వంగడాలను జిల్లా శాస్త్రవేత్తలు అన్నదాతలకు అందించడంలో కీలకపాత్ర పోషించారు.

37 మంది శాస్త్రవేత్తల కృషి

జిల్లాకే తలమానికంగా ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రస్తుతం 5 మంది శాస్త్రవేత్తలు విధుల్లో ఉంటారు. విత్తనాల అభివృద్ధి, ఎరువులు ఎన్ని వేయాలి, తెగుళ్లు వస్తే నివారణ, ఏ తెగుళ్లకు ఏఏ పురుగుమందులు వాడాలి.. ఇలా వివిధ రకాలుగా పరీక్షలు చేయడానికి ఆయా విభాగాలకు శాస్త్రవేత్తలు విధుల్లో ఉన్నారు. కాగా పరిశోధనా స్థానం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపుగా 37 మంది శాస్త్రవేత్తలు వివిధ నూతన వరి వంగడాలను కనుక్కోవడంలో ప్రధాన భూమిక పోషించినట్లు తెలుస్తోంది.

అధిక ప్రాచుర్యంలో..

శాస్త్రవేత్తలు ఉత్పత్తి చేసిన నెల్లూరు మసూరి ఎన్‌ఎల్‌ఆర్‌–34449, శ్వేత ఎన్‌ఎల్‌ఆర్‌–40024, నెల్లూరు ధాన్యరాశి ఎన్‌ఎల్‌ఆర్‌–3354, నెల్లూరు సిరి ఎన్‌ఎల్‌ఆర్‌–4001, నెల్లూరు సుగంధ ఎన్‌ఎల్‌ఆర్‌–40054, స్వర్ణముఖి–145, భరణి–30491, కొత్త మొలగొలుకులు–9674, పార్థివ ఎన్‌ఎల్‌ఆర్‌–33892 వరి వంగడాలు ప్రస్తుతం ప్రాముర్యంలో ఉన్నాయి. వీటిని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల రైతులు సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఒక్కో వరి వంగడం తయారు కావడానికి దాదాపుగా 2 సంవత్సరాల నుంచి 3 సంవత్సరాల సమయం పడుతుందని, కొన్ని వంగడాల ఉత్పత్తికి ఐదేళ్ల సమయం కూడా పట్టే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొన్ని వంగడాలు పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి రావాలంటే కనీసం 10 సంవత్సరాల సమయం కూడా పడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. శాస్త్రవేత్తలు అన్నిరకాలుగా పరిశోధించి, పరీక్షలు జరిపిన తర్వాతనే ఈ నూతన వరి వంగడాలను రైతులకు అందిస్తుంటారు.

నూతన వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి



జిల్లాలోని రైతులకు అవసరాలకు అనుగుణంగా నూతన వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. ఒక వంగడం పూర్తిస్థాయిలో బయటకు రావాలంటే చాలా సమయం పడుతుంది. అప్పటివరకు అన్ని విధాలుగా శాస్త్రవేత్తలు పరిశోధన చేసి నూతన వంగడాలను మార్కెట్‌లోకి తీసుకురావడం జరుగుతుంది. దీని వెనుక సంవత్సరాల తరబడి కష్టం ఉంటుంది.

– వినీత, ప్రధాన శాస్త్రవేత్త, ఎన్‌జీ రంగా పరిశోధనా స్థానం, నెల్లూరు

గుడులపై శిల్పాలు చెక్కినారు..

- ఆలయ గోపురాలకు జీవం పోస్తున్న కోనసీమ శిల్పులు
- అద్భుతమైన పనితనంతో నిర్మాణం
- కట్టిపడేసే రీతిలో దేవతా మూర్తుల విగ్రహాల తయారీ
- మంత్రముగ్ధులవుతున్న భక్తులు



వెంకన్న ఆలయంపై బొమ్మలు చెక్కుతున్న అయ్యప్ప

సాక్షి, అమలాపురం: ఆలయం అంటే భక్తుల కోసం భగవంతుడు కొలువుదీరిన నిలయం. తమ మొరలాలకించి, తమను కష్టాల నుంచి గట్టెక్కించే ఆ స్వామికి, అమ్మవారికి భక్తులు ఎంతో ప్రీతితో సేవలు చేసే ప్రదేశం. అసలు ఆలయాన్ని చూడగానే మనసులో నుంచి భక్తితరంగాలు వెల్లువెత్తుతూంటాయి. ఆలయ గోపురాలపై దేవతామూర్తులను, వివిధ పురాణ ఘట్టాలను ఎంతో నైపుణ్యంగా తీర్చిదిద్దడమే ఇందుకు కారణం. దీని వెనుక చేయి తిరిగిన శిల్పుల పనితనం ఎంతో ఉంటుంది. బొమ్మలు చేసి.. ప్రాణము పోసినట్టు.. వారు ఆలయ శిఖరాలపై రకరకాల బొమ్మలను అపురూపంగా తీర్చిదిద్దుతారు. ఆ దేవతామూర్తి కళ్ల ముందు సాక్షాత్కరించినంత అందంగా వాటికి మెరుగులు అద్దుతారు. 'శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారు' అంటూ ఒక సినీ కవి రాసినట్టు.. 'గుడులపై శిల్పాలు చెక్కినారు.. ఆలయ శిఖరాలకు వన్నె తెచ్చినారు' అని ఈ శిల్పుల గురించి చెప్పవచ్చు. దేవాలయం అనగానే ముందుగా మన కళ్లకు కనిపించేవి ముందుగా గర్భగుడి, రాజ (గాలి) గోపురాలే. ఆలయంలో స్వామి, అమ్మవార్లు ఎవరు కొలువు తీరినా.. గాలిగోపురం మీద దేవతామూర్తులు దర్శనమీయవలసిందే. ఆలయాన్ని సందర్శించినప్పుడే కాదు.. అటుగా వెళ్తున్నప్పుడు కూడా ఈ గోపురాలను చూస్తేనే భక్తిభావం ఉప్పొంగుతుంది. వాటి వంక చూసి, క్షణకాలమైనా కళ్లు మూసుకుని దణ్ణం పెట్టడం భక్తులకు పరిపాటి. అటువంటి గోపురాలను కళ్లు తిప్పుకోలేని రీతిగా తీర్చిదిద్దడంలో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా శిల్పులది అందె వేసిన చేయి. కొత్త ఆలయాలు నిర్మించాలన్నా, పాత ఆలయాలకు కొత్త సొబగులు అద్దాలన్నా కోనసీమ శిల్పుల చేతులు పడాల్సిందే. జిల్లాకు చెందిన పెదిరెడ్డి వెంకటేశ్వరరావు (కపిలేశ్వరపురం మండలం అంగర), బొబ్బిలి అయ్యప్ప (అయినవిల్లి మండలం క్రాప), శ్రీనివాస్‌ (ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి) వంటి వారు ఆలయ గోపురాలను సిమెంటుతో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతారు. వందలాది ఆలయాలకు కొత్త రూపం తీసుకువస్తున్నారు. వాడపల్లి వెంకటేశ్వరస్వామి, అమలాపురం, నల్ల చెరువు వెంకన్న, సాయిబాబా ఆలయాలు, ఎ.వేమవరంలో 23 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహంతోపాటు, 18 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాలు ఈ శిల్పుల చేతుల్లోనే రూపు దిద్దుకున్నాయి.



తయారీకీ ఉంటుందో లెక్క

ఆలయ గోపురాల నిర్మాణం, వాటి మీద తీర్చిదిద్దే దేవతామూర్తులు, జంతువులు, ఇతర బొమ్మలను ఇష్టానుసారం తయారు చేయడానికి వీలు లేదు. సంబంధిత ఆగమ శాస్త్రాల ప్రకారం, వేద పండితుల సలహాల మేరకు వైష్ణవ, శైవ, అమ్మవారి ఆలయాల నిర్మాణాలను, బొమ్మల తయారీని చేపట్టాల్సి ఉంటుంది. గోపురం ఎత్తు, అందుకు తగినట్టుగా అంతస్తుల నిర్మాణాలు, వాటి మీద అమర్చే బొమ్మలకు సైతం లెక్కలు ఉంటాయి. 'ఆరు అడుగుల మనిషి బొమ్మను తయారు చేయాలంటే కాళ్లు, మొండెం, తల ఎంత ఎత్తు, ఎంత పొడవు ఉండాలనే లెక్క ఉంటుంది. చివరకు చేతి వేళ్లకు సైతం ఒక పరిమాణం ఉండాలి. లేకుంటే బొమ్మలో జీవం ఉండదు' అని శిల్పి అయ్యప్ప 'సాక్షి'కి తెలిపారు.

35 ఏళ్లు.. 1,200 గోపురాలు



దేవాలయాల నిర్మాణంలో 1988లో మొదలైన వెంకటేశ్వరరావు ప్రస్థానం ఇప్పటికీ అప్రతిహతంగా కొనసాగుతోంది. 1,200 దేవాలయాల నిర్మాణాల్లో ఆయన పాలు పంచుకున్నారు. తాళ్లరేవు మండలం మట్లపాలెం జీయర్‌ స్వామి ఆలయం వద్ద కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం గోపురం నుంచి హైదరాబాద్, ఘట్‌కేసర్‌లలోని పలు ఆలయాల నిర్మాణాల్లో పాల్గొన్నారు. అండమాన్‌లో రామాలయం, శివాలయం, మరియమ్మ ఆలయాల గోపురాలను నిర్మించారు. వెంకటేశ్వరావు ఆధ్వర్యంలోనే యానాం – ఎదుర్లంక వారధి వద్ద 63 అడుగుల అతి పెద్ద ఆంజనేయ స్వామి విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు.

–పెదిరెడ్డి వెంకటేశ్వరరావు

అమ్మవారి ఆలయ నిర్మాణం ప్రత్యేకం



వడగన శ్రీనివాస్‌ అమ్మవారి ఆలయాల నిర్మాణాలతో పాటు గోపురాల నిర్మాణాల్లో సిద్ధహస్తుడు. హైదరాబాద్, కర్నూలు, విజయవాడల్లో జరిగిన పలు అమ్మవారి ఆలయాలు నిర్మాణాల్లో పాలు పంచుకున్నాడు. ఈ వృత్తిని తండ్రి నుంచి వారసత్వంగా స్వీకరించాడు.

– వడగన శ్రీనివాస్‌

ఉచితంగా ఆధార్ అప్‌డేట్

ఆన్‌లైన్‌లో సొంతగా అప్‌డేట్ చేసుకునే వారికే చాన్స్

నూతన జిల్లాల వారీగా ఆధార్ అప్‌డేట్‌కు చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వ సీఎస్‌కు యూఐడీఏఐ లేఖ

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లు



సాక్షి, అమరావతి: ఆధార్ అప్‌డేట్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అయితే, ఆన్‌లైన్‌లో సొంతగా ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకునేవారికి మాత్రమే ఈ వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాల పేర్లతో ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఇందుకోసం యూఐడీఏఐ ప్రమాణాలకు అనుగుణంగా ధ్రువీకరణపత్రాల జారీకి ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఈ మేరకు ఆధార్ కార్డుల జారీ సంస్థ అయిన యూఐడీఏఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పి.సంగీత ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.జవహర్‌రెడ్డికి లేఖ రాశారు. ప్రతి ఒక్కరూ పదేళ్లకు ఒకసారి అయినా ఆధార్ కార్డులోని తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ ఇటీవల నిబంధన తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దానిప్రకారం ఆన్‌లైన్‌లో సొంతగా ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకునేవారికి ఉచితంగా సేవలు అందిస్తారు. ఆధార్ సెంటర్లకు వెళ్లి అప్‌డేట్ చేసుకునే వారు మాత్రం యథావిధిగా నిర్ణీత ఫీజు చెల్లించాలి. మరోవైపు ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు మాత్రమే ఉచిత సేవలు లభిస్తాయని యూఐడీఏఐ వేరుగా డిజిటల్ మీడియాలో ప్రచారం చేస్తోంది.

అప్‌డేట్ చేసుకోవాల్సినవారు 1.56 కోట్ల మంది!

ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు అయినా ఇప్పటికీ ఒక్కసారి కూడా తమ చిరునామా, ఫొటో ధ్రువీకరణ వంటి వివరాలు అప్‌డేట్ చేసుకోనివారు రాష్ట్రంలో 1.56కోట్ల మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్రంలో 2022, డిసెంబరు 31 నాటికి 5,19,98,236 మందికి ఆధార్ కార్డులు జారీ అయ్యాయి. వారిలో 1.56కోట్ల మంది కొత్త నిబంధన ప్రకారం తమ ఆధార్‌లో వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందని అధికారులు తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రతి ఒక్కరూ తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఐదు రోజులు ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తోంది. ఆధార్ సేవలు అందుబాటులో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ నెల 20, 21, 27, 28, 29 తేదీల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ సాగిలి షన్‌మోహన్ అన్ని జిల్లాల కలెక్టర్లు, సచివాలయాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. గ్రామ, వార్డు సచివాలయాలు లేదా స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతాల్లో ఈ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ఆధార్ క్యాంపుల సమాచారాన్ని ఆయా ప్రాంత ప్రజలందరికీ తెలిసేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ క్యాంపులు ఏర్పాటుచేసిన ప్రాంతాల్లోని వలంటీర్లు తమ పరిధిలో 2014కు ముందు ఆధార్ కార్డులు పొంది ఇప్పటివరకు అప్‌డేట్ చేసుకోనివారిని గుర్తించి వారికి ప్రత్యేక ఆధార్ క్యాంపుల గురించి తెలియజేయాలని సూచించినట్లు అధికారులు తెలిపారు.



ఆహారమే ఆయుష్షును నిర్ణయిస్తుంది

- ఫాస్ట్‌ఫుడ్స్ హానికరం కాదు.. వాటి నిల్వ కోసం కలిపేవే అత్యంత ప్రమాదకరం
- ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వ్యవస్థాపకుడు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



ప్రసంగిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

కాకినాడ క్రైం: తినే ఆహారమే వ్యక్తి ఆయుష్షును నిర్ణయిస్తుందని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వ్యవస్థాపకుడు, ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి చెప్పారు. కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల ఆడిటోరియంలో ఆదివారం జరిగిన రీజినల్ అకడమిక్ కాన్ఫరెన్స్‌లో ఆయన విశిష్టవక్తగా పాల్గొన్నారు. 'గ్యాస్ట్రోఎంట్రాలజీలో తాజా పురోగతులు', 'వ్యక్తిగా విజయం సాధించేందుకు దోహదంచేసే అంశాలు' అనే అంశాలపై ఆయన మాట్లాడారు. ఫాస్ట్‌ఫుడ్స్ హానికారకం కాదని, రంగు, రుచి, వాసన, నిల్వసామర్థ్యం పెంచేందుకు వాటిలో కలిపే అడెటివ్స్ (సంకలనాలే) అత్యంత ప్రమాదకరమని తెలిపారు. ప్రపంచ ఆరోగ్యసంస్థతో కలిసి గత ఆరేళ్లలో తెలంగాణ ప్రభుత్వం మంచినీటి సరఫరా, నాణ్యతను విస్తృతం చేసి విజయవంతమైందని చెప్పారు. ఈ చర్య వల్ల నీటి ద్వారా వ్యాపించే ఎన్నో అనారోగ్యాలు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. కేవలం జంక్‌ఫుడ్స్ తినడానికి అలవాటుపడిన వారిలో వయసుతో నిమిత్తంలేని జీర్ణకోశ వ్యాధులను గుర్తిస్తున్నామని తెలిపారు. క్రోన్స్ డిసీజ్, ఐబీడీ, అల్సరేటివ్ కొలైటిస్ ఎక్కువగా నమోదవుతుండడం ఆందోళనకు గురిచేస్తోందని చెప్పారు. అనంతరం జీవితంలో విజయానికి దోహదం చేసే అంశాలపై చర్చించారు. సమయపాలన, ఎప్పటిపని అప్పుడే పూర్తిచేసే లక్షణం, నిరంతరం నేర్చుకునే ఆసక్తి ఏ వ్యక్తినైనా ఉన్నత శిఖరాలకు చేరుస్తాయని డాక్టర్ నాగేశ్వరరెడ్డి చెప్పారు. ఐఎంఏ కాకినాడ నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ కిరణ్ ఆధ్వర్యాన ఆర్గనైజింగ్ అధ్యక్షుడు డాక్టర్ గురుప్రసాద్, కార్యదర్శి డాక్టర్ జవహర్ నిర్వహణలో జరిగిన ఈ కాన్ఫరెన్స్‌లో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అగర్వాల్, రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జీ, పూర్వపు వీసీ డాక్టర్ ఐ.వి.రావు, రంగరాయ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం, కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి సహా 14 మంది వక్తలు, 800 మంది వైద్యులు పాల్గొన్నారు.

ఏపీ పథకాలు భేష్

- విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం గొప్ప విషయం
- జర్మన్ వైద్యురాలు పెన్‌జిస్క్



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ పెన్‌జిస్క్

శ్రీరంగరాజపురం (చిత్తూరు జిల్లా): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదల కోసం ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా పథకాలను అమలు చేస్తోందని జర్మనీకి చెందిన వైద్యురాలు డాక్టర్ పెన్‌జిస్క్ ప్రశంసించారు. విద్యాభివృద్ధికి ఇక్కడి ప్రభుత్వం పెద్దపీట వేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం నెలవాయిలోని ఇండో–జర్మన్ జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పెన్‌జిస్క్ మాట్లాడుతూ ఏపీలో అమలవుతున్న పథకాలను ప్రవేశపెట్టాలని జర్మన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నట్టు చెప్పారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, క్రమశిక్షణతో చదివి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చన్నారు. భారత దేశం విద్యలకు పుట్టినిల్లు అని డాక్టర్ పెన్‌జిస్క్ పేర్కొన్నారు. తమ దేశంలో క్రీడాభివృద్ధికి దోహదం చేసిన భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ను తాము దేవుడిగా కొలుస్తున్నామన్నారు. విజేతలకు పెన్‌జిస్క్ బహుమతులు అందజేశారు. అనంతరం పెన్‌జిస్క్‌ను పాఠశాల కరస్పాండెంట్ మనోరంజని సత్కరించారు.

అక్రమాలు చూపినా ఆర్‌ఓ పట్టించుకోలేదు

- ఎన్నికల లెక్కింపు నిష్పక్షపాతంగా జరగలేదు
- కలెక్టర్, ఎస్పీ టీడీపీకి మద్దతుగా నిలిచారు
- సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో విధుల నిర్వహణ దేనికి సంకేతం?
- పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి



అనంతపురం క్రైం: ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని, వాటిని సాక్ష్యాలతో సహా చూపించినా రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ), కలెక్టర్ నాగలక్ష్మి పట్టించుకోలేదని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల కౌంటింగ్‌లో అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. పైగా వారు తమకు పడ్డ ఓట్లను సైతం తగ్గించి చూపించారని మండిపడ్డారు. ఆదివారం ఆయన అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రంలో కళ్ల ముందు జరిగిన అన్యాయాన్ని చూసి చాలా బాధేసిందన్నారు. 'కౌంటింగ్ నిర్వహణలో కలెక్టర్, ఎస్పీ పూర్తిగా వైఫల్యం చెందారు. టీడీపీకి అనైతికంగా మద్దతుగా నిల్చిన వీరిపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేస్తున్నాం. మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, టీడీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, టీడీపీ ప్రొద్దుటూరు ఇన్‌చార్జ్ ప్రవీణ్, కమలాపురం ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, పులివెందులకు చెందిన పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆలం నరసానాయుడు, వడ్డే మురళీ, సరిపూటి రమణ.. ఇలా పది మందికిపైగా టీడీపీ ముఖ్య నేతలు ఏజెంట్లుగా కూర్చున్నప్పటికీ ఆర్‌ఓ పట్టించుకోలేదు. వీరు కౌంటింగ్ హాల్లోని ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి ప్రభావం చూపేలా వ్యవహరించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ కౌంటింగ్ హాలులో పదుల సంఖ్యలో, పరిసర ప్రాంతాల్లో వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిష్ట వేసినా ఎస్పీ ఫక్కీరప్ప ప్రేక్షక పాత్ర పోషించారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రవీంద్రారెడ్డి ఇంకా ఏమన్నారంటే..


- మాజీ సీఎం చంద్రబాబు ఫోన్ చేస్తే కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఫక్కీరప్పలు ఏవిధంగా మాట్లాడారు? ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయాన్ని మరచిపోయారా?
- కౌంటింగ్ హాల్లో టేబుల్ నంబర్ 19లో ఓ అధికారి టీడీపీ అభ్యర్థివి 44, మా పార్టీవి ఆరు ఓట్లు కట్టకట్టి ఒకే దానిలో వేశారు. దీనిపై మా ఏజెంట్ ఫిర్యాదు చేయగా అసలు నిజం వెలుగు చూసింది.
- అదే అధికారి 3, 4, 5 రౌండ్లలోనూ ఉన్నాడని ఫిర్యాదు చేస్తే తనకేం సంబంధం లేదని రిటర్నింగ్ అధికారి చెప్పడమేంటి? అక్రమాలు జరిగినప్పుడు విచారణ చేయకపోతే ఆర్‌ఓగా ఎందుకున్నట్లు? మరో అధికారి.. తమవి 70 ఓట్లు ఉంటే ఆ కట్టపై 50 అని రాశారు. టీడీపీవి 30 ఉంటే 50 అని నమోదు చేశారు.
- ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థుల ఓట్లు గల్లంతైనట్లు ఫిర్యాదు చేసినా కలెక్టర్ పట్టించుకోలేదు. ఏదిఏమైనా ఈ ఎన్నికల్లో నైతిక విజయం మాదే. నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు.

ఎన్నికల కోడ్ ఎత్తివేత

సాక్షి, అమరావతి: టీచర్లు, పట్టభద్రులు, స్థానిక సంస్థల నియోజకవర్గ ఎన్నికల దృష్ట్యా విధించిన ఎన్నికల కోడ్‌ను ఎత్తివేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదివారం ప్రకటించారు. ఎన్నికలు జరిగిన ఎమ్మెల్సీ స్థానాల్లో ఫలితాలు విడుదల కావడంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ప్రకాశం, బాపట్ల, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో తక్షణమే ఎన్నికల కోడ్‌ను తొలగిస్తున్నామని, ఈ మేరకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పట్టభద్రులు వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారు


మీడియా సమావేశంలో చంద్రబాబు




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జరిగిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా ఓటువేసి టీడీపీకి ఘనవిజయం సాధించిపెట్టారని చంద్రబాబు చెప్పారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల ఫలితాలతో ప్రభుత్వంపై ఉన్న ప్రజావ్యతిరేకత కనిపించిందన్నారు. ఉగాది పంచాంగాన్ని రెండురోజుల ముందే ప్రజలు ఈ ఎన్నికల ద్వారా చెప్పారని తెలిపారు. నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెప్పలేనంత అవినీతి, దోపిడీ జరిగాయన్నారు. ఈ ఎన్నికలు ఐదుకోట్ల తెలుగు ప్రజలు, రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించినవన్నారు. ఈ నాలుగేళ్లలో ప్రజాస్వామ్య వ్యవస్థలు పనిచేయలేదని విమర్శించారు. చీఫ్ సెక్రటరీ నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌లంతా జగన్ నేరాల్లో భాగస్వాములవుతున్నారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా అధికారులు లెక్కచేయలేదని, డిక్లరేషన్ ఫాం ఇవ్వకుండా రాత్రంతా హైడ్రామాలు ఆడారని విమర్శించారు. రాష్ట్రంలోని 108 నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయని, ఒక్కో నియోజకవర్గంలో ఐదువేల నుంచి 25 వేలమంది ఓటు వేశారని చెప్పారు. వారందరి తీర్పు తమకు అనుకూలంగా ఉందన్నారు. రీ కౌంటింగ్‌కు అవకాశం లేనిచోట రీకౌంటింగ్ అడిగి, స్థానిక ఎస్పీ, కలెక్టర్లపై ఒత్తిడిపెట్టి, ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా తుంగలో తొక్కాలని చూశారని విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేకతకు 'ఎమ్మెల్సీ' ఫలితాలే నిదర్శనం

జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్



సాక్షి, అమరావతి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రజలకు ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తున్నాయని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలకు పట్టభద్రులు తమ ఓటు ద్వారా కనువిప్పు కలిగించారని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇలాంటి వ్యతిరేక ఫలితమే ఉంటుందన్న సంగతి ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైందని తెలిపారు. ప్రజాకంటక పాలనకు వ్యతిరేకంగా ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ, విజేతలకు అభినందనలు తెలియజేస్తున్నట్లు పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు.



కొంతైనా పిచ్చితనం లేని ఏ గొప్ప మెదడూ ఇప్పటి దాకా భూమ్మీద లేదు.
- అరిస్టాటిల్

సాక్షి
సోమవారం, మార్చి, 20

శుభాది కావాల్సిన ఉగాది

వసంతమాసంలో వచ్చే ఉగాది మన తెలుగువాళ్ల కొత్త సంవత్సరం. ఆకులే కాదు, ఆశలూ చిగురించే కాలంలో వచ్చే పండుగ ఇది. వసంతానికీ కవిత్వానికీ అనాదిగా అవినాభావ బంధం ఉంది. ఉగాది అంటే ఆరు రుచుల ఉగాది పచ్చడిని ఆరగించడం; పంచాంగ శ్రవణం మాత్రమే కాదు, ఊరూరా కవిసమ్మేళనాల కోలాహలం కూడా! తెలుగు నేల మీదనే కాదు, తెలుగువాళ్లు ఎక్కడ ఉంటే అక్కడ ఉగాది పండుగ రోజున కవిసమ్మేళనాలు తప్పనిసరిగా జరుగుతాయి.

ప్రాచీన కావ్యాలలో రుతువర్ణన తప్పనిసరి అంశం. కవులు ఆరు రుతువులనూ వర్ణించినా, వాటిలో వసంత వర్ణనకే అమిత ప్రాధాన్యమిచ్చారు. 'ఋతూనాం కుసుమాకరః'– అంటే, 'రుతువులలో వసంతాన్ని నేనే' అని సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్ముడే భగవద్గీతలో చెప్పుకొన్నాడు మరి! అలాంటప్పుడు భాగవతోత్తములైన ప్రాచీన కవివరేణ్యులు వసంత వర్ణనకు రవంత అమిత ప్రాధాన్యమివ్వడంలో వింతేముంటుంది?

'కమ్మని లతాంతముల కుమ్మొనసి వచ్చు మధుపమ్ముల సుగీత నినదమ్ము లెసగం మా/తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధి ముకుళమ్ములను నానుచును ముదమ్మొనర వాచా/లమ్ములగు కోకిల కులమ్ముల రవమ్ము మధురమ్ముగుచు విన్చెనసిశమ్ము సుమనోభా/రమ్ముల నశోక నికరమ్ములను చంపక చయమ్ములును కింశుక వనమ్ములున్ నొప్పెన్' అంటూ 'ఆంధ్ర మహాభారతము' ఆదిపర్వంలో నన్నయ పుష్పవిలసిత వసంత శోభను వర్ణించాడు. 'కీర ముహ సచ్ఛేహిం/ రేహఇ వసుహా పలాస కుసుమేహిం/ బుద్ధస్స చలణ వందణ/ పడి విహిం వ భిక్షు సంఘేహిం' – అంటే, 'భూమి మీద తిరుగాడే రామచిలుకల ముక్కుల్లాంటి మోదుగ పూలు బుద్ధుని పాదాలను తాకి ప్రణమిల్లే బౌద్ధభిక్షువుల సంఘమా?' అని హాలుడు తన 'గాథా సప్తశతి'లో అబ్బురపడ్డాడు.

రుతువర్ణనలో అష్టదిగ్గజాలను తలదన్నే కవిదిగ్గజం ఆంధ్రభోజుడు కృష్ణదేవరాయలు. ఆయన తన 'ఆముక్త మాల్యద'లో చేసిన వసంత వర్ణనలో మీన మేషాలను లెక్కించాడు. 'కినిసి వలఱేడు దండెత్త గేతు వగుట/ మీన మిల దోచుటుచితంబ మేష మేమి/పని యనగ నేల? విరహోఖ్య పాంథ యువతి/ దాహమున కగ్గి రాగ దత్తడియు రాదె?' అని చమత్కరించాడు. ఇందులోని చమత్కారమేమిటంటే, కోపంతో మన్మథుడు దండెత్తగా చేప కనిపించడం సమంజసమే! ఎందుకంటే, మన్మథుడు మీనకేతనుడు. అలాంటప్పుడు అక్కడ మేకకు పనేమిటంటారా? విరహతాపంతో యువతులు దహించుకు పోతున్నప్పుడు అగ్ని వాహనమైన మేషం అక్కడ ఉండటమూ సమంజసమే కదా! సౌరమానంలో మీన, మేష మాసాలు వసంత రుతువు. వసంతాగమనాన్ని ఇంత నర్మగర్భంగా వర్ణించడం రాయలవారికే చెల్లింది!

'క్షితిపయి వట్టి మ్రాకులు జిగిర్ప వసంతుడు దా రసోపగుం/భిత పద వాసనల్ నెఱప, మెచ్చక చంద్రుడు మిన్నునం బ్రస/న్నతయును సౌకుమార్యము గనంబడ జాల్ గరగంగజేసె; ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా' అని చేమకూర వేంకటకవి వాపోయాడు. వసంతుడు వచ్చి, చెట్లను చిగురింపజేసి, వాటిని ఫలపుష్పభరితం చేసి, ప్రకృతిని పులకింపజేశాడట. అప్పుడు వసంతుడు చేసిన ఘనకార్యాన్ని పైనుంచి చూస్తున్న చంద్రుడు మెచ్చకపోగా, కినుక బూనాడు. వసంతుడిని మించి తన ఘనత చాటుకోవడానికి సుకుమారమైన వెన్నెల కురిపించి, రాళ్లను కరిగించేశాడట. అలాగే, ఎంత బాగా రాసినా సమకాలికులు మెచ్చరట! చేమకూర కవికే కాదు, ఈ బాధ ఇప్పటి కవులనూ పీడిస్తూనే ఉంది.

'నాకుగాదులు లేవు, నాకుషస్సులు లేవు' అని కృష్ణశాస్త్రి వగచినంత మాత్రాన తెలుగు కవులకు ఉగాదులు లేకుండా పోలేదు. ఉగాది కవి సమ్మేళనాలు నేటికీ అట్టహాసంగా కొనసాగుతూనే ఉన్నాయి. అలాగని ఉగాది కవి సమ్మేళనాలు ప్రాచీనకాలం నుంచి కొనసాగుతున్నాయనడానికి ఆధారాలేవీ లేవు. మహా అయితే ఒకటి రెండు శతాబ్దాలుగా మొదలై ఉంటాయేమో! ప్రాచీన సాహిత్యంలో వసంత వర్ణన తప్ప ఉగాది వర్ణన ఎక్కడా కనిపించదు. ఒకప్పుడు కొన్ని పత్రికలు ఉగాది ప్రత్యేక సంచికలు విడుదల చేసేవి. ఆ కాలమంతా గత వసంత వైభవం.

కాల చక్రభ్రమణంలో రుతువులు వస్తుంటాయి, పోతుంటాయి. ఉగాదుల రాకతో లోకమంతా పచ్చగా మారిపోతుందనుకుంటే, అది భ్రమ మాత్రమే! 'నీతి పథమునందు, నిత్య జీవితమందు/ మాటనిరుకునందు మార్పులేక/ కొత్తబట్ట గట్టు కొన్నంత నూత్నవ/ర్షంబు మహము సార్థకంబుగాదు' అని జాషువా ఏనాడో నిష్ఠుర సత్యాన్ని పలికారు. 'ఉగాది పాటకు ఒకటే పల్లవి/ బాధ బాధ బాధ అది/ జగాన మెసలే జనాల జీవిత/ గాథ గాథ గాథ' అని నిర్మొహమాటంగా తేల్చేశాడు శ్రీశ్రీ. అంతేనా? 'ఉగాది వచ్చింది/ అయినా/ శుభాది వచ్చిందీ?' అని నిలదీశాడు కూడా!

ఏటా ఉగాది వస్తూనే ఉంటుంది. ఉగాది వేడుకలూ యథాప్రకారం జరుగుతూనే ఉంటాయి. సామాన్యుల జీవితాల్లో పెనుమార్పులేవీ రాకపోయినా; రాజకీయ పంచాంగ శ్రవణాలొక వైపు, బహిరంగ వేదికల మీద అధికారిక, అనధికారిక కండువాల కవి సమ్మేళనాలింకొక వైపు కోలాహలంగా కొనసాగుతూనే ఉంటాయి. ఒకే వేదిక మీదకు చేరిన కవుల్లో కొందరు ఉగాదిని రారమ్మని ఆహ్వానిస్తుంటారు. ఇంకొందరు రావద్దని బతిమాలుకుంటారు. ఉగాది పచ్చడిలోని చేదును మరపిస్తూ, ఈ తప్పనిసరి తతంగాలు జనాలకు ఉచిత వినోదాన్ని ఉదారంగా పంచిపెడుతూనే ఉంటాయి. పండగపూట ఆ మాత్రం వినోదమైనా లేకపోతే, బతుకులు మరీ చేదెక్కిపోవూ!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** చతుర్దశి రా.1.37 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** శతభిషం రా.7.24 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.1.26 నుండి 2.56 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.32 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** ప.12.38 నుండి 2.07 వరకు.

సూర్యోదయం: 6.09
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

మన తీరు ఇలా ఉండాలా?

కామెంట్



కరణ్ థాపర్

ఆస్ట్రేలియన్ క్రికెటర్ ఉస్మాన్ ఖ్వాజా పట్ల మనం వ్యవహరించిన తీరు సంకుచితంగా ఉంది. అతడికి ద్వంద్వ జాతీయత ఉంది. అటు పాకిస్తానీయుడిగానూ, ఇటు ఆస్ట్రేలియన్ పౌరుడిగానూ ఉంటున్నాడు. అది మన ప్రభుత్వ కళ్లలో అతడిని అనుమానితుడిని చేసింది. అందుకే ఆస్ట్రేలియన్ క్రికెట్ జట్టుతో కలిసి భారత్ పర్యటనకు వీసా కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు, వెంటనే అనుమతి దక్కలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, మానవ హక్కుల సూత్రబద్ధ సమర్థకురాలిగా ఉంటున్నందుకు భారత్ గర్వపడుతుంది. మనం ఈ స్వీయ–ప్రతిష్ఠను నిలుపుకొనేలా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మన పట్ల పాకిస్తాన్ ప్రవర్తన కూడా అలాగే ఉందనే వాదన ఒకటుంది. మన సొంత ప్రమాణాలను నిర్దేశించుకోవడానికి మన పొరుగువాడి ప్రవర్తన ప్రమాణం అవుతుందా? పాకిస్తాన్ పౌరులనూ, వారి భయంకరులైన పాలకులనూ మనం వేరు చేసి చూడకూడదా? దక్షిణాసియా ప్రాంతంలో కీలక శక్తిగా తనను తాను పరిణించుకుంటున్న దేశం, ఐరాసలో అత్యున్నత సీటును కోరుకుంటున్న దేశం వ్యవహరించాల్సిన తీరు ఇదేనా?

మన దేశాన్ని సందర్శించాలని కోరుకునే పాకిస్తానీయుల పట్ల మనం ఎందుకు చీకాకుగా వ్యవహరిస్తాం? అయితే మన పట్ల వాళ్ల ప్రవర్తన కూడా అలాగే ఉందనే వాదన ఒకటుంది. కానీ నా అనుభవం అలా లేదని నేను చెప్పాల్సి ఉంటుంది. ఏమైనా ఇలాంటి వాదన సముచితమైనది కాదు. అది మనకు విలువనివ్వదు కూడా!

మొదటి విషయం: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగానూ, మానవ హక్కుల విషయంలో సూత్రబద్ధ సమర్థకురాలిగానూ ఉంటున్నందుకు భారత్ గర్వపడుతుంది. కానీ మనం దీన్ని గురించి చెప్పినట్లయితే పాకిస్తాన్ అసలు నమ్మదు. అయితే మనం కూడా మన స్వీయ–ప్రతిష్ఠను నిలుపుకొనేలా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మరింత ముఖ్యమైన విషయం ఏమిటంటే, మన సొంత ప్రమాణాలను నిర్దేశించుకోవడానికి మన పొరుగువాడి ప్రవర్తన ప్రమాణం అవుతుందా? అలా కాదంటే– ఇస్లామాబాద్‌కు వ్యతిరేకంగా కాకుండా, దానికి భిన్నంగా వ్యవహరించడం ద్వారా మనం మరింత మెరుగైనవాళ్లమని దృఢ నిరూపణ చేయాల్సి ఉంటుంది.

అనుమానపు చూపు

అద్భుతమైన ఆస్ట్రేలియన్ బ్యాట్స్‌మన్ ఉస్మాన్ ఖ్వాజా పట్ల మనం వ్యవహరించిన తీరు నేను వర్ణించిన రోత ప్రవర్తనకు ప్రతిరూపమే. నిజానికి ఇది అంతకుమించిన ఘోరమైన విషయం. సంకుచితంగా, ద్వేషపూరితంగా, మనల్ని మనం తక్కువ చేసుకుంటున్నట్లుగా ఉంది. ఇలాంటి వైఖరి భారత్‌ను పేలవంగా చూపిస్తుంది. దీంట్లోని అత్యంత ఘోరమైన విషయం ఏమిటంటే, ఇదంతా మనకు మనం కలిగించుకున్న నష్టమే.

పాకిస్తాన్‌లో పుట్టిన ఖ్వాజా నాలుగేళ్ల వయసులో ఉండగా కుటుంబంతోపాటు ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. ఈరోజు అతడికి ద్వంద్వ జాతీయత ఉంది. అతడు అటు పాకిస్తానీయుడిగానూ, ఇటు ఆస్ట్రేలియన్ పౌరుడిగానూ ఉంటున్నాడు. అది మన ప్రభుత్వ కళ్లలో అనుమానితుడిని చేసింది. ఆస్ట్రేలియన్ క్రికెట్ జట్టుతో కలిసి భారత్ పర్యటనకు వీసా కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు, అతడికి వెంటనే అనుమతి దక్కలేదు. అది ఎంత ఆలస్యమైందంటే, ఫిబ్రవరి 1న ఖ్వాజా లేకుండానే ఆస్ట్రేలియా టీమ్ ఇండియాకు వచ్చేసింది. ఆస్ట్రేలియన్ క్రికెట్ పాలనా యంత్రాంగం నిరసన తెలిపిన తర్వాతే ఖ్వాజా వీసాను పొందగలిగాడు.



ప్రభుత్వాల ప్రామాణిక ధోరణి

భారతదేశంలో మనలో ఏ కొద్దిమందికో ఈ విషయం గురించి తెలుసు. అందులో బహుశా చాలా కొద్దిమంది దీని గురించి కలవరపడుతుండవచ్చు. కానీ ఆస్ట్రేలియాలో ఇలా ఉండదు. బీజేపీ ఖ్వాజాను ఆస్ట్రేలియా అత్యుత్తమ క్రికెటర్లలో ఒకరిలా కాకుండా పాకిస్తాన్‌లో పుట్టిన ముస్లింలా చూస్తోందని 'సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్'లో రాసే దేశ అత్యుత్తమ క్రికెట్ వ్యాఖ్యాతల్లో ఒకరైన మాల్కమ్ కోన్ రాశారు. వాస్తవం ఇంతకంటే దారుణంగా ఉంది. భారతీయ వీసాను పొందడంలో సమస్యలు ఎదుర్కోవడం ఖ్వాజాకు ఇదే తొలిసారి కాదు. 'ది గార్డియన్' పత్రిక ప్రకారం– మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా 2011లోనే ఈ అనుభవం అతడికి ఎదురైంది. పాకిస్తానీయుల పట్ల ద్వేషపూరిత వైఖరిని ప్రదర్శించడం భారత ప్రభుత్వాలకు ఒక ప్రామాణికమైన ఆచరణగా మారిపోయిందని ఇది స్పష్టం చేస్తోంది.

ద్వంద్వ పౌరసత్వం ఉన్న పాకిస్తానీయుడు, భారతీయ వీసా కోసం దరఖాస్తు చేస్తున్నప్పుడు ఏం జరుగుతుందో ఇప్పుడు నన్ను వివరించనివ్వండి. ఆ వ్యక్తి లండన్, న్యూయార్క్ లేదా దుబాయ్ నివాసి అయినప్పటికీ, వారి పాకిస్తానీ పాస్‌పోర్ట్‌పైనే దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది తప్ప మరొక పాస్‌పోర్ట్ మీద కాదు. దరఖాస్తు సమర్పించగానే భారతీయ రాయబార కార్యాలయం దాన్ని ఢిల్లీకి పంపిస్తుంది. అక్కడ విదేశీ వ్యవహారాల శాఖ కాకుండా, హోమ్ మంత్రిత్వ శాఖ దాన్ని నిర్ణయిస్తుంది. దానికి కొన్ని నెలలు పడుతుంది. మూడు నెలల్లోగా నిర్ణయం వస్తుందని ఆశించవద్దని దరఖాస్తుదారులకు ఆటోమేటిక్‌గా చెబుతారు.

అఖండ భారత్ ఇలాగా?

తరచుగా నేను మెజారిటీ కేసులను తడిమి చూశాను. ఎక్కడా స్పందన లేదు. అలాంటి సందర్భాల్లో ఏ వార్తా రాకపోవడం మంచి వార్త కాదు. ఒకవేళ వచ్చిందంటే, ఎవరో మీ కోసం తీగ లాగగలగాలి. అదీ మీరు అదృష్టవంతులైతే! కానీ ఎంతమంది పాకిస్తానీయులకు అలాంటివి చేసి పెట్టేవారు దొరుకుతారు? తుది ఫలితం ఏమిటంటే – భారత్ సందర్శించడానికి చాలా తక్కువ మంది మాత్రమే అనుమతి పొందుతారు.

ఒకప్పుడు –అంటే చాలా కాలం క్రితం కాదు– మన తోటి దేశవాసులుగా ఉండిన వారితో మనం నిజంగా వ్యవహరించవలసిన తీరు ఇదేనా? మరీ ముఖ్యంగా, అఖండ భారత్‌పై మన ప్రకటనలకు (సమర్థన అటుండనీ) మద్దతు గెల్చుకోవడానికి మనం వెళుతున్న మార్గం ఇదేనా? దక్షిణాసియా ప్రాంతంలో కీలక శక్తిగా తనను తాను పరిగణించుకుంటున్న దేశం, ఐక్యరాజ్యసమితిలో అత్యున్నత సీటును కోరుకుంటున్న దేశం వ్యవహరించాల్సిన తీరు ఇదేనా? ఈ ప్రశ్నల్లో ఏ ఒక్కదానికైనా 'అవును' అనేది సమాధానం అయితే అది నేను నమ్మలేని విషయం అవుతుంది.

పాకిస్తాన్ ప్రభుత్వంతో మనకు దశాబ్దాలుగా సమస్యలు ఉన్నాయనడంలో సందేహమే లేదు. కానీ నిజం ఏమిటంటే పాకిస్తాన్ ప్రజల విషయంలో కూడా ఇది నిజమేనా? ఈ సందర్భంలో దేశ పౌరులనూ, వారి భయంకరులైన పాలకులనూ మనం వేరు చేసి చూడకూడదా? లేదా మనం అలాంటి సులభమైన సూక్ష్మ విషయాన్ని కూడా గ్రహించలేనంత అసమర్థులమా?

ఈ విషయంలో నిజం ఏదంటే, మనం వీసాలను నిరాకరించడం ద్వారా పాకిస్తానీయులు ఇబ్బందిపడి ఉండవచ్చు లేదా పడకపోయి ఉండవచ్చు. కానీ ఒక దేశంగా మనం (భారత ప్రభుత్వాలు మాత్రమే కాదు, భారత ప్రజలం కూడా) వికారంగా కనిపించడం లేదా? కాబట్టి మన కోసమైనా మనం ఇలాంటి ధోరణిని తప్పక ఆపివేయాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అలవాటు మారుతుందా?



వారం రోజులు అలహాబాద్ (ఉత్తర ప్రదేశ్) నగర జనాలతో ఉన్నాను. ఏ ఒక్కరూ దాన్ని ప్రయాగ్‌రాజ్ అని పిలవడం లేదు.
– రంజనా బెనర్జీ, కాలమిస్ట్

గాంధీ తర్వాత...



'ఇండియా ఆఫ్టర్ గాంధీ' నూతన ఎడిషన్ గురించి నేను రామచంద్ర గుహను ఇంటర్వ్యూ చేశాను. ఇండియాను బీజేపీ ఎలా హిందూ పాకిస్తాన్‌గా మార్చడానికి యత్నిస్తున్నదో ఆయన ఈ పుస్తకంలో వివరంగా చర్చించారు.
– నరేశ్ ఫెర్నాండెజ్, సంపాదకుడు

కొత్త సవాలు



అతడి పేరు పిప్స్ బన్స్. ఒక పెద్ద బ్రిటిష్ బ్యాంకుకు డైరెక్టర్. లైంగికత విషయంలో అతడిది ద్రవ స్థితి: అంటే కొన్నిసార్లు పురుషుడిగానూ, కొన్నిసార్లు మహిళగానూ ఐడెంటిఫై అవుతాడు. 2018లో 100 మంది మహిళా వ్యాపారవేత్తల్లో ఒకడిగా నిలిచాడు. మనం పురోగమిస్తున్న భవిష్యత్తులో పుట్టుకతో మహిళలు అయినవారు ఇలాంటివారితో పోటీ పడాల్సి ఉంటుంది.
– స్కిన్ డాక్టర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సిత్రం సూడరో!



నీలిచిత్రాల వెబ్‌సైటు అయిన 'పోర్న్‌హబ్'ను ప్రైవేటు ఈక్విటీ సంస్థ అయిన 'ఎథికల్ క్యాపిటల్ పార్ట్‌నర్స్' చేజిక్కించుకుంది. ఒక నీలిచిత్రాల సైటును 'ఎథికల్' (నీతిసంబంధమైన) అని పేరున్న సంస్థ కొనడం... చూడండి తమాషా!
– అలీ టేలర్, స్ట్రాటెజీ కన్సల్టెంట్

మన ఘనత



చరిత్రలో 'పై' విలువను మొదట లెక్కించిన గణిత శాస్త్రవేత్తలు: బోధాయనుడు (3.088), యాజ్ఞవల్క్యుడు (3.125). 'పై' విలువను గణించడానికి (3.1415926535898) కలన గణితాన్ని తొలిసారి ఉపయోగించినవాడు మాధవ. 'పై అనేది తార్కికం కానిది' అని ప్రకటించిన మొదటి శాస్త్రవేత్త నీలకంఠ.
– జోసెఫ్ టి. నూనీ, రచయిత

మొదటి ఇంజిన్



ఇండియాలో ఈ ఎనిమిదేళ్లలో వేసిన (3,48,000 కి.మీ.) గ్రామీణ రోడ్లు గత 70 ఏళ్లలో వేసిన (3,81,000 కి.మీ.) గ్రామీణ రోడ్ల పొడవుతో దాదాపు సమానం. అలాగే 70 ఏళ్లలో వేసిన జాతీయ హైవేల పొడవులో (97,000 కి.మీ.) సగం పొడవు ఈ ఎనిమిదేళ్లలో వేశారు (46,000 కి.మీ.). రెండోవారు ఎవరైనా కావొచ్చుగానీ, ఈ డబుల్ ఇంజిన్ సర్కార్‌లో మొదటి ఇంజిన్‌గా మాత్రం నితిన్ గడ్కరీ ఉంటారు.
– ఆనంద్ రంగనాథన్, రచయిత

అలా కాకూడదు!



వెయ్యేళ్ల క్రితం డమాస్కస్ (సిరియా), బాగ్దాద్(ఇరాక్) కొత్త ఆలోచనలకూ, పరిశోధనకూ, పారదర్శకతకూ కేంద్రాలుగా ఉండేవి. కానీ మత ఛాందన వాదపు గాలులు ఎప్పుడైతే వీయడం మొదలైందో, వర్తమానపు తరమడాలే గతకాలపు గొప్పతనానికి ప్రత్యామ్నాయంగా నిలిచాయో... ఇక నగరాల గొప్ప గుణాలన్నీ అంతానికి వచ్చాయి. అన్ని సమాజాలకూ ఇందులో నేర్చుకోవాల్సిన ఒక పాఠం ఉంది.
– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఇన్‌బాక్స్

సంపూర్ణ సంక్షేమ బడ్జెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2023–24 సంవత్సరపు బడ్జెట్‌ను సంపూర్ణ సంక్షేమం, సమగ్ర అభివృద్ధి దిశగా ఆలోచించి 2 లక్షల 79 వేల కోట్ల రూపాయలుగా ప్రతిపాదించింది. గత మూడేళ్ళ ప్రణాళికల, కేటాయింపుల దిశలోనే, అంత కన్నా ఎక్కువ కేటాయింపులు జరపడం ద్వారా... సామాన్య ప్రజానీకం అవసరాలు, అభివృద్ధి కాంక్షించింది. అదే సమయంలో కీలక రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేస్తూ అభివృద్ధి దిశగా అడుగులు బలంగా పడేలా జాగ్రత్తలు తీసుకుంది. 'నవరత్నా'ల పథకాలు సహా 22 రకాల ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారులకు ఆర్థిక ఆసరా కల్పించేందుకే 54 వేల కోట్ల రూపాయలు పైగా కేటాయించడం, ఎస్టీ కాంపోనెంట్‌గా రూ. 6,929 కోట్లు, ఎస్సీ కాంపోనెంట్‌గా రూ. 20 వేల కోట్లు కేటాయించడం వంటివి... సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి.



విద్య, వైద్యం, కుటుంబ సంక్షేమం, వ్యవసాయం... ఈ బడ్జెట్ కేటాయింపుల్లో సింహభాగాన్ని పొందడం రాష్ట్రానికి దీర్ఘకాలికంగా మేలు చెయ్యగల మంచి ప్రయత్నం. దేశంలో రాష్ట్ర స్థూల వృద్ధిరేటు (జీఎస్‌డీపీ)లో నంబర్ వన్‌గా నిలిచిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిసిందే. ఆ ఘనతను ముందుముందు నిలుపుకోడానికి ఈ బడ్జెట్ దోహదపడుతుంది. జెండర్ బడ్జెట్, వ్యవసాయ బడ్జెట్‌లు... ఆయా అంశాల్లో వెనకబాటును గుర్తించి, లోపాల్ని నివారించి, బలోపేతం కావడానికీ, తద్వారా మానవ వనరుల అభివృద్ధిని శీఘ్రతరం చెయ్యడానికీ ఉపయుక్తం కాగలవు. ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోణంలో మంచి బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు గౌరవ ముఖ్యమంత్రి అభినందనీయులు.

– డా॥ డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం
మొబైల్: 94408 36931

గర్భ సంస్కార్‌తో దేశభక్తులు!?

సందర్భం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

సంఘ్ అనుబంధ సంస్థ 'సమవర్ధిని న్యాస్' ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో 'గర్భ సంస్కార్' పేరుతో మార్చి 5న కార్యశాల (వర్క్ షాప్)ను నిర్వహించింది. 12 రాష్ట్రాల నుండి పలువురు స్త్రీ, శిశువైద్య నిపుణులూ; ఆయుర్వేద వైద్యులూ పాల్గొన్నారు. కడుపులోని పిండాలకు భారతీయ సాంస్కృతిక విలువలను నేర్పాలనీ, దీంతో దేశభక్తులైన స్త్రీలను గౌరవించే పిల్లలూ, శ్రీరాముని వంటి కొడుకులూ పుడతారనీ; సంస్కృతంలో ఉండే గీత, తదితర మత గ్రంథాలను చదివే గర్భశుద్ధి పద్ధతితో బిడ్డ డీఎన్ఏ మారుతుందనీ న్యాస్ నాయకులు చెప్పారు. పౌరాణిక హిందూ పాలకుల లక్షణాలు గల భావి నాయకులను తయారుచేయడం గర్భ సంస్కార్ లక్ష్యమని న్యాస్ జాతీయ నిర్వహణ కార్యదర్శి మాధురీ మరాఠే అన్నారు.

గర్భ సంస్కార్ అన్న సంస్కృత పదాలకు గర్భసంచీని శుద్ధిచేయడం, పిండం మెదడును చైతన్యపరచడం అని అర్థం. ఇది వేదకాలం నాటి ఆధ్యాత్మిక ఆచరణ. గర్భ సంస్కార్‌లో గర్భవతులకు భగవద్గీత, రామాయణ శ్లోకాలను వినిపిస్తారు. యోగా నేర్పిస్తారు. అంటే సాంస్కృతిక విలువల పేరుతో మతాధిపత్య భావజాలాన్ని పుట్టబోయే పిల్లల మెదళ్ళలో చొప్పించి, వారిని హిందూవాదంతో చైతన్య పరిచే ప్రక్రియే సమవర్ధిని న్యాస్ ప్రతిపాదిస్తున్న గర్భ సంస్కార్ అన్నమాట.

ఆయుర్వేద వైద్యంలో 'సుప్రజ జనన్' పేరుతో గర్భ సంస్కార్ ప్రస్తావన ఉంది. సుప్రజ జనన్ సూత్రం ప్రకారం పిల్లలను కనాలనుకున్న దంపతులను 3 నెలల ముందే శుద్ధీకరిస్తారు. పిండశుద్ధి అంటే భర్త వీర్యాన్నీ, భార్య అండాన్నీ శుద్ధిచేస్తారు!? దంపతులు శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నా మానసిక స్థిరత్వం, ప్రశాంతత (సత్వగుణం) లేకపోతే ఆరోగ్యమైన పిల్లలను కనలేరని తీర్మానిస్తారు. సాత్వికాహారం, యోగా, ధ్యానం, మంత్రోచ్చాటన, రాగాలు, శ్లోకాలు, కథలు వినడం ఈ కార్యక్రమంలో ప్రధానం.



గర్భ సంస్కార్‌లో పౌరాణిక కథలను వినిపిస్తారు. కడుపుతో ఉన్న భార్య సుభద్రకు అర్జునుడు పద్మవ్యూహం గురించి చెప్పాడు. గర్భంలో ఉన్న అభిమన్యుడు పద్మవ్యూహంలోకి వెళ్లడం గురించి వినింది అక్కడే అంటారు కదా! హిరణ్యకశిపుని భార్య లీలావతి కడుపులో ఉన్న ప్రహ్లాదునికి నారదుడు విష్ణుకీర్తనలు వినిపించాడు. ప్రహ్లాదుడు విష్ణు భక్తుడయ్యాడు. కాబట్టి వీరూ ఇటువంటివాటిని గర్భస్థ పిండాలకూ, గర్భవతులకూ వినిపిస్తారట! గర్భ సంస్కార్ కార్యక్రమంలో భాగంగా గర్భం ధరించినప్పటి నుండి బిడ్డ పుట్టిన తర్వాత 2 ఏళ్ల వరకు తల్లీపిల్లలకు 'చైతన్య' శిక్షణ ఉంటుంది.

నిజానికి... 18 వారాల పిండం తల్లి గుండె చప్పుడు లాంటి శబ్దాలను మాత్రమే వినగలుగుతుంది. 6, 7 నెలల తర్వాత అమ్మ శరీరానికి బయట ఉన్న శబ్దాలు వినపడతాయి. 30 వారాల పిండానికి వినడానికి అవసరమైన ఇంద్రియ, మెదడు వ్యవస్థలు అభివృద్ధి చెందుతాయి. బిడ్డ పుట్టిన తర్వాత 3 నెలలకు దేహం వాసనను, సైగల భాషను గుర్తుపడుతుంది. 3 ఏళ్ళకు గానీ అతి ప్రాథమిక స్థాయి బోధనలు అర్థం కావు. అటువంటిది గర్భసంస్కార్‌లో చదివే సంస్కృత శ్లోకాలు తల్లీ, శిశువు లకు ఎలా అర్థమవుతాయి? ఐతే ఈ మతాచారాల లయబద్ధ శబ్దాలు తల్లీపిల్లలను సవ్వడి సమ్మతులుగా మారుస్తాయి. ఈ ప్రక్రియలో జరిగే హిందూవాద తంతులతో తల్లీ, రెండేళ్ల బిడ్డా మమేకమవుతారు. ఈ మిషతో సంఘ్... పిల్లల తొలి గురువూ, సమాజ నిర్మాతా అయిన తల్లికి కాషాయ కషాయం తాపుతుంది. జన్యుశాస్త్ర సాంకేతికతలతో మాత్రమే శాస్త్రవేత్తలు ఒక జీవి డీఎన్ఏను మార్చగలరు. అంతేకాని దానిని మాటలతో మార్చలేం.


గర్భ సంస్కార్ కొత్త వ్యాపారాలకు తెర లేపింది. ప్రయోగశాలలు, శిక్షణాలయాలు పుట్టుకొస్తున్నాయి. సాహిత్య సామగ్రి అమ్మకాలు విపరీతంగా పెరిగాయి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

దేహంతో సాధించు!

అనగనగా ఒక నిరుపేద. అతడు ఓ జెన్ సాధువు దగ్గరకు వెళ్ళాడు. 'గురువుగారూ! నేను కటిక పేదవాడిని. నా దగ్గర నా ప్రాణం తప్ప మరే ఆస్తీ లేదు. కనీస వసతులతోనైనా బతకడానికి ఒక దారి చెప్పండి' అని అడిగాడు.

అందుకు ఆ సాధువు 'నేను నీకు అయిదు వేల వరహాలు ఇస్తాను. నీ చేతులను నరికి నాకివ్వు' అన్నారు. అందుకు 'మీరిచ్చే అయిదు వేల వరహాల కోసం నా చేతులను కోల్పోలేను' అన్నాడు. ఇలాగే కాళ్లు, కళ్లు, ప్రాణాలకు విలువ కట్టి, వాటిని ఇస్తే డబ్బులిస్తానని అన్నారు సాధువు. అందుకు పేదవాడు 'మీరు ఎంతటి గురువుగారైనా కావచ్చు... డబ్బుకు నా అవయవాలు, ప్రాణాలు ఎలా ఇస్తాను?' అని ప్రశ్నించాడు.



జ్యోతిర్మయం

అంతట, ఆ జెన్ సాధువు "నీ దగ్గర నీ ప్రాణం తప్ప మరే ఆస్తీ లేదన్నావు. చేతులూ, కాళ్ళూ, కళ్ళూ ఇలా ఏవి అడిగినా ఇవ్వనంటున్నావు. డబ్బులిస్తానన్నా సరే నువ్వు ఇవ్వనని చెప్పావు. అంటే నువ్వు ఇవ్వకూడదని అనుకున్న ప్రతి అవయవమూ అమూల్యమైనదేగా! మరి అటువంటి అమూల్యాలను నీ దగ్గర ఉంచుకుని 'నేను పేదవాడిని, నా దగ్గర ఏమీ లేదు' అని ఎలా అంటున్నావు? నువ్వెలా పేదవాడివవుతావు? కనుక జీవితంలో వీలున్నంత మేరకు కష్టించు. అవకాశాల కోసం ఎదురు చూస్తూ కూర్చోకు. ఆలోచనలతో రోజులు గడిపెయ్యకు. నీ శక్తి యుక్తుల మీద నీకు విశ్వాసం ఉండాలి. అంతేతప్ప నేనేదీ చెయ్యలేనని అనుకుంటూ కాలం గడపకు. 'నీ కర్తవ్యం నువ్వు నిర్వహిస్తే ఫలితం అదే వస్తుంద'ని కదా గీతాకారుడు అన్నది. కాబట్టి నీ ప్రయత్నం నువ్వు చెయ్యి" అని సాధువు జ్ఞానబోధ చేశారు.

అప్పుడా పేదవాడు కళ్ళు తెరిచాడు. 'పుట్టుక ఎలాగైనా ఉండొచ్చు. కానీ ఎదగడం, ఎదగకపోవడం మన చేతిలో ఉన్నదే. కష్టాలను జయించడానికి అమూల్యమైన ఆణిముత్యమైన ఆత్మ విశ్వాసం ఒక్కటి చాలు. ఆ తర్వాత అంతా దేవుడే చూసుకుంటాడు' అనుకుంటూ ఇంటిదారి పట్టాడు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

22న తిరుమలలో ఉగాది ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 22న శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా జరపనున్నారు. ఉగాదిని పురస్కరించుకొని 22వ తేదీన శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాలను, అలాగే 21, 22 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 75,452 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.05 కోట్లు వేశారు. దర్శన టోకెట్లు లేని భక్తులకు 30 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలు ప్రారంభం



భృంగివాహనాధీశులైన ఆది దంపతులు, మహాలక్ష్మి అలంకారంలో శ్రీ భ్రమరాంబదేవి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలను ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ నెల 23వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు, స్థానాచార్యులు, అర్చకులు, వేద పండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలోని స్వామివార్ల యాగశాలలో ప్రవేశం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉగాది మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శ్రీశైల భ్రమరాంబదేవి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి భృంగివాహనసేవ నిర్వహించారు.

స్వచ్ఛ రాజకీయాలకు స్వరాజ్యం స్ఫూర్తి

- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం సంస్మరణ సభలో వక్తలు

సాక్షి, అమరావతి: భూస్వామ్యవర్గంలో పుట్టి వారికే వ్యతిరేకంగా పేద, కార్మిక వర్గానికి నాయకత్వం వహించి ఉద్యమాన్ని నడిపిన మల్లు స్వరాజ్యం స్వచ్ఛమైన రాజకీయాలకు స్ఫూర్తిగా నిలిచిన ధీరవనిత అని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం, ప్రథమ వర్ధంతి, సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి ఈఎంఎస్ నంబూద్రిపాద్ 25వ వర్ధంతి సభను విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. స్వరాజ్యం, నంబూద్రిపాద్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పూర్వ కార్యదర్శి పి.మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడారు. ప్రజాప్రతినిధులు నిరాడంబరంగా, ఆదర్శవంతంగా, నిజాయితీగా ఎలా జీవించాలో స్వరాజ్యం, నంబూద్రిపాద్ నిరూపించారన్నారు. వారి ఆదర్శంతో ప్రజా పోరాటాలు నడపాలని వక్తలు పిలుపునిచ్చారు.

ముందస్తు బెయిల్ కోసం మార్గదర్శి మేనేజర్ల పిటిషన్

విశాఖ, లీగల్: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమాలు బయటపడుతుండటంతో.. అందులో పనిచేస్తున్న ఏడుగురు మేనేజర్లు ముందస్తు బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ వేశారు. ఎం.సుధాకర్(సీనియర్ మేనేజర్, ఎంవీపీ కాలనీ), ఎం.సుధీర్(సీనియర్ మేనేజర్, అనకాపల్లి), ఎ.శ్రీనివాసరావు (సీనియర్ మేనేజర్, మధురవాడ), వి.వేంకటేశ్వరరావు (మేనేజర్, కూర్మన్నపాలెం), ఎస్.శ్రీనివాసరావు(మేనేజర్, ఎన్ఏడీ కొత్త రోడ్డు), కె.వెంకటేశ్వరరావు(సీనియర్ మేనేజర్, గాజువాక), వైవీ రాజేంద్రప్రసాద్ (సీనియర్ మేనేజర్, డాబాగార్డెన్స్) మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీలో పని చేస్తున్నారు. వీరంతా విశాఖ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రానుంది.

అండగా నిలిచిన ప్రభుత్వానికే బహుజనుల మద్దతు

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: బహుజనులకు అండగా నిలిచిన ప్రభుత్వానికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మద్దతు ఉంటుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 903వ రోజు చేరాయి. పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు న్యాయం చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అన్ని విధాలా అండగా నిలుస్తారనడంలో సందేహం లేదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం పాల్గొన్నారు.

రైతు క్షేత్రం నుంచే అంతర్జాతీయ విపణికి

- త్వరలో ఏపీకి గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (గ్యాప్) సర్టిఫికేషన్
- రాష్ట్రంలో పర్యటించి సంతృప్తి వ్యక్తం చేసిన క్యూసీఐ బృందం



ఏపీ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ సిబ్బందితో మాట్లాడుతున్న క్యూఐసీ బృందం

సాక్షి, అమరావతి: అన్నదాతలు పండించిన పంటలను ప్రీమియం ధరకు తమకు నచ్చినచోట అమ్ముకోవడమే కాకుండా.. ఎవరి మీదా ఆధారపడకుండా యూరప్, యూఎస్ సహా 100కు పైగా దేశాలకు నేరుగా ఎగుమతి చేసుకునే రోజులు త్వరలోనే రాబోతున్నాయి. గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (గ్యాప్) సర్టిఫికేషన్ కోసం దేశంలోనే తొలిసారిగా ఏపీ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ (ఏపీఎస్సీఏ)కు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) అక్రిడిటేషన్ జారీ చేయబోతుంది. రాష్ట్రంలో ఇటీవల పర్యటించిన క్యూసీఐ బృందం ఇక్కడి రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ పద్ధతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్యూసీఐ తరఫున 'గ్యాప్' సర్టిఫికేషన్ జారీ చేసేందుకు ఏపీ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీకి ఏప్రిల్ మొదటి వారంలో అధికారికంగా అనుమతులు మంజూరు కానుంది. దీంతో 'గ్యాప్' సర్టిఫికేషన్ పొందనున్న తొలి రాష్ట్రంగా దేశంలోనే ఏపీ రికార్డులకు ఎక్కనుంది.

సర్టిఫికేషన్ బాధ్యత ఏపీ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీకి..

ప్రస్తుతానికి కొన్నిరకాల వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు మాత్రమే మధ్యప్రాచ్య, తూర్పు, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మెజారిటీ ఉత్పత్తులను రైతులు దేశీయంగానే విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సాగు విధానాలను బట్టి పంట ఉత్పత్తులను ధ్రువీకరించే వ్యవస్థ లేకపోవడం ఎగుమతులకు ప్రతిబంధకంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వపరంగానే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఏపీ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీకి అనుబంధంగా ఏపీ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ (ఏపీఎస్‌వోసీఏ)ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ అథారిటీ ద్వారా తొలి దశలో పొలం బడులు, తోట బడుల ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్న రైతులకు 'గ్యాప్' సర్టిఫికేషన్ జారీ చేసి.. రెండో దశలో వీరందరినీ సేంద్రియ సాగు వైపు మళ్లిస్తారు. వారు పండించే ఉత్పత్తులకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ జారీ చేస్తారు. ఇలా ఏటా రైతుల సంఖ్యను పెంచుతూ మొత్తం రైతులను 'గ్యాప్' సర్టిఫికేషన్ పరిధిలోకి చేరుస్తారు.

నచ్చిన ధరకు.. నచ్చిన చోట

సర్టిఫికేషన్ పొందిన రైతులు తాము పండించే ఉత్పత్తులకు మార్కెట్‌లో ప్రీమియం ధర పొందే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా తమకు నచ్చిన ధరకు అంతర్జాతీయంగా ఎగుమతి చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. మన దేశంలోని రైతులకు ఇచ్చే గ్యాప్ సర్టిఫికేషన్‌ను ఇండో గ్యాప్ సర్టిఫికేషన్‌గా ఇతర దేశాలు గుర్తిస్తాయి. ఇందుకోసం క్యూసీఐ, ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం ఎపెడా (ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ) నుంచి రైతులు అక్రిడిటేషన్ పొందాల్సి ఉంది. ఈ సర్టిఫికేషన్ జారీ కోసం అధికారులతో పాటు క్లస్టర్ పరిధిలో ఎంపిక చేసిన రైతులకు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో), భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) సౌజన్యంతో వివిధ స్థాయిల్లో విడతల వారీగా శిక్షణ ఇచ్చారు.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా..

గ్యాప్ సర్టిఫికేషన్ కోసం 6 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలించడంతో క్యూసీఐ బృందం ఇటీవల ఏపీ ఎస్‌వోసీఏను సందర్శించింది. సర్టిఫికేషన్ జారీ కోసం ప్రభుత్వం కల్పించిన సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. గ్లోబల్ గ్యాప్ ప్రమాణాలకు తగ్గట్టుగా సర్టిఫికేషన్ జారీ చేసేందుకు పలు సూచనలు చేసింది. ఈ నెలాఖరులోగా ఏపీకి గ్యాప్ సర్టిఫికేషన్ కోసం అక్రిడిటేషన్ జారీకి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. సర్టిఫికేషన్ అక్రిడిటేషన్‌కు సంబంధించి ఏప్రిల్ మొదటి వారంలోనే అధికారికంగా ఉత్తర్వులు జారీ కానున్నాయి. మూడేళ్లుగా వైఎస్సార్ పొలం బడులను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాకు 250 ఎకరాలతో ఏర్పాటు చేసిన గ్యాప్ క్లస్టర్స్‌ను ఏపీఎస్‌వోసీఏతో పాటు క్యూసీఐ నుంచి కూడా బృందాలు తనిఖీ చేస్తాయి. ఆయా క్షేత్రాల్లోని రైతులు గ్లోబల్ గ్యాప్ ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో గుర్తిస్తారు. ఈ రైతులను మార్కెటింగ్ ఏజెన్సీలు, ఎగుమతిదారులతో అనుసంధానం చేస్తారు. ఇదే ప్రమాణాలతో వచ్చే ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండించే రైతులకు యూరప్, యూఎస్ సహా 100కు పైగా దేశాల్లో తమకు నచ్చిన చోట తమకు నచ్చిన ప్రీమియం ధరకు వ్యవసాయ ఉత్పత్తుల్ని అమ్ముకునే వెసులుబాటు కలుగనుంది.

ఖరీఫ్ నుంచే సర్టిఫికేషన్



గ్యాప్ సర్టిఫికేషన్ జారీ కోసం ఏపీ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీకి క్యూసీఐ నుంచి మరో రెండు వారాల్లో అక్రిడిటేషన్ జారీ చేయనుంది. ఇండో గ్యాప్ ప్రమాణాలకు అనుగుణంగా సిబ్బందిలో నైపుణ్యం, డాక్యుమెంటేషన్, ఆఫీస్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సర్టిఫికేషన్‌తో మన రైతులు అంతర్జాతీయంగా పోటీపడే అవకాశం ఏర్పడుతుంది.

– త్రివిక్రమ్‌రెడ్డి, ఎండీ, ఏపీ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ

సాంకేతికతతో పోటీ పడకపోతే మనుగడ కష్టం

- పల్సస్ గ్రూప్ సీఈవో డాక్టర్ శ్రీనుబాబు

సాక్షి, విశాఖపట్నం: సాంకేతికతతో పోటీ పడకపోతే కార్పొరేట్ జీవితంలో మనుగడ కష్టమవుతుందని పల్సస్ గ్రూప్ సీఈఓ డాక్టర్ శ్రీనుబాబు గేదెల పేర్కొన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'మెస్కాన్–2023' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి జీవితాంతం కొత్త సాంకేతికతకు అనుగుణంగా అప్‌గ్రేడ్ అవుతూ ఉండాలన్నారు. సాఫ్ట్‌వేర్ నిపుణులు తాజా సాంకేతిక పరిణామాలను ఆకళింపు చేసుకుంటూ ముందుకు సాగకపోతే ప్రయోజనం ఉండదన్నారు. ఏ రంగంలో అయినా నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో విఫలమైతే కెరీర్ అక్కడితో నిలిచిపోతుందన్నారు. కార్పొరేట్ నాయకత్వం, నైపుణ్యాల పెంపుదల, రాబోయే కెరీర్ అవకాశాలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు.

గతంలో 7, 8 నెలలకూ జీతాలిచ్చేవారు కాదు

- అప్పుడెందుకు ఉద్యమాలు చేయలేదు?
- బొప్పరాజుకు ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ ప్రశ్న
- స్వార్థపూరితంగా చేస్తున్న బొప్పరాజు ఉద్యమాల్లో పాల్గొనబోమని స్పష్టీకరణ
- సీఎం జగన్ వల్లే ఉద్యోగ భద్రత, పదోన్నతులు, నెలనెలా సక్రమంగా జీతాలు అందుతున్నాయని వెల్లడి



మాట్లాడుతున్న వీఎస్ దివాకర్

సాక్షి, అమరావతి: గతంలో 7, 8 నెలలకు కూడా జీతం ఇచ్చేవారు కాదని.. ఒక్కోసారి ఏడాది, ఏడాదిన్నర తర్వాత జీతాలందుకున్న సందర్భాలు ఉన్నాయని ఏపీ రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వీఎస్ దివాకర్ చెప్పారు. ఆనాడు ఎందుకు ఉద్యమాలు చేయలేదని ఏపీ జేఏసీ–అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లును ఆయన ప్రశ్నించారు. బొప్పరాజుది రాజకీయ ప్రేరేపిత ఉద్యమమే తప్ప.. ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కాదన్నారు. ఏపీ రెవెన్యూ టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం ఆదివారం తాడేపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ.. బొప్పరాజు తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న నిరసనలు, ఆందోళనల్లో తమ పరిధిలో ఉన్న సంఘాలు పాల్గొనబోవని స్పష్టం చేశారు. ఆయన చేస్తున్న ఉద్యమాల వల్ల ఉద్యోగులకు నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. మోసపూరిత, కుట్రపూరిత ఉద్యమాల విషయంలో ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉండగా నల్ల బ్యాడ్జీ నిరసనలకు ఎవరు అనుమతిచ్చారో చెప్పాలని బొప్పరాజును ఆయన ప్రశ్నించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతభత్యాలు పెంచడమే కాకుండా.. ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని దివాకర్ చెప్పారు. ప్రతి నెల సక్రమంగా జీతభత్యాలు ఇస్తున్నారని.. ఈ విషయంలో సీఎం వైఎస్ జగన్‌కు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రుణపడి ఉంటారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో 4 వేల మంది వీఆర్ఏలకు గ్రామ రెవెన్యూ అధికారులుగా పదోన్నతులు కల్పించారని వివరించారు. ఆఫీస్ సబార్డినేట్ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు అన్ని తరగతుల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన సీఎం జగన్‌కు రెవెన్యూ ఉద్యోగులు రుణపడి ఉంటారన్నారు. అనంతరం ఏపీ రెవెన్యూ టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జ్యోతుల సూరిబాబు(కాకినాడ), ప్రధాన కార్యదర్శిగా వి.సురేంద్ర(పల్నాడు) ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఆర్.దయాకర్ నియమితులయ్యారు.

285 వైద్య పోస్టుల భర్తీ

- ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగంలో 285 వైద్యుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. గతేడాది జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా తుది మెరిట్ జాబితాను ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రామిరెడ్డి విడుదల చేశారు. వీరికి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తామని ఆయన తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు హాజరవ్వాలని సూచించారు.

మే 28 నుంచి ఏపీ పీజీ ఈసెట్-2023 ప్రవేశ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ ఏపీ పీజీఈసెట్–2023 ప్రవేశ పరీక్ష మే 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనుంది. ఈ మేరకు ఎస్వీయూ వీసీ, పీజీఈసెట్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్.సత్యనారాయణ ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి ఈ నెల 21వ తేదీ నుంచి ఆన్‌లైన్లో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఎరక్క వచ్చి.. ఇరుక్కుపోయాయి !

- మేతకు వచ్చి వ్యవసాయ భూమి కంచెలో చిక్కుకున్న ఐదు కృష్ణజింకలు
- కంచె నుంచి విడిపించిన అటవీశాఖ అధికారులు
- బయట పడే ప్రయత్నంలో చూడితో ఉన్న కృష్ణజింక మృతి



వ్యవసాయ భూమిలో చిక్కుకున్న కృష్ణజింకలు

పెద్దదోర్నాల: అటవీ ప్రాంతం నుంచి మేతకు వచ్చిన కృష్ణజింకలు ఓ వ్యవసాయ భూమిలో చిక్కుకుని దారి తెలియక అల్లాడిన ఘటన ప్రకాశంజిల్లా పెద్దదోర్నాలలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... సమీప అటవీ ప్రాంతం నుంచి ఐదు కృష్ణజింకలు శనివారం రాత్రి మేతకు వచ్చి అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో చుట్టూ ఫెన్సింగ్ ఉన్న ఓ వ్యవసాయ భూమిలో చిక్కుకున్నాయి. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు ఆదివారం ఘటనా స్థలికి చేరుకున్నారు. కృష్ణజింకలను వ్యవసాయ భూమికి వేసిన కంచె నుంచి విడిపించేందుకు ప్రయత్నించారు. సాధారణంగా మానవ సంచారంతో అమితంగా భయపడే కృష్ణజింకలు బెదిరి అటూ ఇటూ పరుగులు పెట్టాయి. అలిసిపోయిన ఓ కృష్ణజింక అక్కడే స్పృహ తప్పి పడిపోయింది. అటవీశాఖ అధికారులు స్థానిక పశువైద్యాధికారుల సహకారంతో దానికి ప్రథమ చికిత్స చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఆ కృష్ణజింక మృతి చెందింది. వ్యవసాయభూమికి చుట్టూ వేసిన కంచెను ఓ వైపు తొలగించడంతో మిగతా నాలుగు కృష్ణ జింకలు అటవీ ప్రాంతంలోకి పరుగు తీశాయి. మృతి చెందిన కృష్ణజింకకు ఆత్మకూరుకు చెందిన శ్రీశైలం–నాగార్జునసాగర్ వైల్డ్‌లైఫ్ వైద్యాధికారి జుబేర్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించగా చూడితో ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అనంతరం నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణజింకను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో దోర్నాల ఫారెస్టు రేంజి అధికారి విశ్వేశ్వరరావు, డీఆర్వో చెన్నయ్య పాల్గొన్నారు.

'ఎస్సీ' విద్యార్థులను కలిసిన ప్రధాని

- వారితో ముచ్చటించి.. పుస్తకాలు బహుమతిగా ఇచ్చిన మోదీ
- వివరాలు వెల్లడించిన మంత్రి మేరుగు



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ప్రధాని మోదీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్స్‌కు చెందిన విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసి.. మాట్లాడారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని.. వారికి పుస్తకాలను బహూకరించారని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో విజయనగరం, విశాఖపట్నం, వైఎస్సార్ జిల్లాలకు చెందిన ఎస్సీ హాస్టళ్లలోని ప్రతిభావంతులైన 42 మంది విద్యార్థులు విజ్ఞాన యాత్రకు వెళ్లారని మంత్రి పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి ఆదివారం వరకు కొనసాగిన యాత్రలో భాగంగా ఢిల్లీ వెళ్లిన విద్యార్థులు.. పార్లమెంట్ భవనంలో ప్రధాని మోదీని కలిశారని తెలిపారు. విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని.. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలు చదివి వాటి ద్వారా స్ఫూర్తి పొందాలని ఉద్బోధించారని పేర్కొన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి.. భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలంటూ సూచించారని చెప్పారు. విద్యార్థులకు ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలను బహూకరించి.. వారితో ఫొటోలు దిగారని వివరించారు. రాష్ట్ర విద్యార్థులు ప్రధానిని కలిసి మాట్లాడటం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.

ఉద్యోగుల బకాయి చెల్లింపు ఉత్తర్వులు హర్షణీయం

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్



రాజారావు

గుంటూరు మెడికల్: ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం హర్షించదగిన విషయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు అన్నారు. ఆదివారం గుంటూరులోని అసోసియేషన్ జిల్లా శాఖ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తర్వులు జారీతోపాటు నగదు ఉద్యోగుల అకౌంట్స్‌లో జమ అవ్వటం సంతోషకరమని చెప్పారు. కొంత మంది ఉద్యోగ సంఘ నాయకులు ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించి, వారి నాయకత్వాన్ని నిలుపుకోవటానికి జిమ్మిక్కులు చేస్తున్నారని విమర్శించారు. దీని వల్ల ఉద్యోగులు నష్టపోతారని తెలిపారు. ఉద్యోగుల సంఘ నాయకుల విధానం మారాలని, ఉద్యోగుల హక్కులపై నాయకులకు పేటెంట్ హక్కులు లేవన్నారు. ఉద్యోగులను రెచ్చగొట్టే విధానం సంఘ నాయకులు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సిద్ధం విజయ్‌కుమార్, వి.శ్రీనివాసరావు, నారాయణమూర్తి, వజ్రగిరి విజయవర్ధన్, నన్నపనేని భాస్కరరావు, వేమవరపు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వదలని వర్షాలు



తిరుపతి జిల్లా తూపిలిపాలెం సముద్ర తీరంలో ఒడ్డుకు చేరిన వేట సామగ్రి

నేడు కూడా వర్షాలు.. రేపటి నుంచి తగ్గుముఖం

ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో సోమవారం కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయనున్నాయి. ఇక మంగళవారం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టనున్నాయి. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో మంగళవారం ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి నివేదికలో తెలిపింది.

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

- ఇక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అమలాపురంలో 81.2 మిల్లీమీటర్లు, సఖినేటిపల్లి మండలంలో 79.4, రాజోలు 64.4, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలంలో 61.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మామిడి, జీడిమామిడితో పాటు ఇతర వాణిజ్య పంటలకు, చెరకు, మొక్కజొన్న పంటలకు ఈ వర్షం మేలు చేసింది. నర్సరీ రైతులకూ ఈ వర్షం ఊరటనిచ్చింది. కోనసీమలో వరి రైతులకు వర్షం చేసిన మేలు అంతా ఇంతా కాదు. ముఖ్యంగా శివారు పొలాల్లో రబీ నీటి ఎద్దడి సమస్య తీరేలా వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 22 మండలాల పరిధిలో ఆదివారం ఉదయం 62.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అడ్డతీగల మండలంలో వంతెన కొట్టుకుపోయింది.
- తిరుపతి జిల్లా వ్యాప్తంగా వడగండ్లతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు నమోదయ్యాయి. జిల్లాలోని అక్కడక్కడా ఎనిమిది చోట్ల పిడుగులు సైతం పడ్డాయి. ద్రోణి కారణంగా తీరంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సముద్రం దాదాపు 8 మీటర్లు ముందుకు వచ్చింది. గడిచిన 20 రోజులు జిల్లాలో విపరీతమైన ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయి.
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆదివారం వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఎర్రగుంట గ్రామంలో పిడుగుపాటుకు ఒక ఇల్లు పాక్షికంగా దెబ్బతినగా, పలు ఇళ్లల్లో టీవీలు కాలిపోయాయి.
- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షాలతోపాటు పెద్దఎత్తున గాలులు వీచాయి. భారీ వర్షాల కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా అధికారులు వెంటనే స్పందించి పునరుద్ధరించారు.
- పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఆదివారం వడగండ్ల వర్షం కురిసింది. నరసరావుపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వడగండ్లు పడడంతో జనం పరుగులు తీశారు. మాచర్ల, కారంపూడి, సత్తెనపల్లి, చిలకలూరిపేట ప్రాంతాల్లో కూడా వడగండ్ల వర్షం కురిసింది.
- శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఆదివారం జల్లులు కురిశాయి. శ్రీకాకుళంలోని భద్రమ్మ తల్లి ఆలయంపై పిడుగు పడింది.

ఆందోళన వద్దు.. ఆదుకుంటాం : మంత్రి కాకాణి

రాష్ట్రంలో అకాల వర్షాలవల్ల నష్టపోయే ప్రతీ రైతును అన్ని విధాలా ఆదుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఏ ఒక్క రైతు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. వారం రోజుల్లో పంట నష్టాన్ని అంచనా వేయాల్సిందిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పంటనష్టం అంచనాకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశామని, సీజన్ ముగియకుండానే ఈ పరిహారం జమచేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆదివారం రాత్రి మంత్రి ఓ ప్రకటనలో తెలిపారు.

భీమునిపాడులో శాసనం, విగ్రహం గుర్తింపు

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లాలోని దువ్వూరు మండలం భీమునిపాడు గ్రామంలో ఓ శాసనం, పురాతన విగ్రహాన్ని గుర్తించారు. వీటిని శాసన శోధకుడు బొమ్మిశెట్టి రమేష్ ఫొటోలు తీసి భారత పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపించారు. ఆయన ఈ ఫొటోలను పరిశీలించి విజయనగర సామ్రాజ్యానికి చెందిన (1377–1404) రెండవ దేవరాయలు క్రీ.శ.1394 ఏప్రిల్ 11న శనివారం మురికినాడులోని భీమునిపాడులో లక్కినాయుని కుమారుడు కసవన ఈ శాసనాన్ని వేయించినట్లు, ఎనిమిది అడుగుల హనుమంతుని విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు అందులోని నాటి తెలుగు అక్షరాల ద్వారా తెలుస్తోందని స్పష్టం చేశారు. పురాతన హనుమంతుని విగ్రహం భిన్నం కావడంతో (పగలడంతో) దాన్ని అన్నారం ఏటికి చేర్చారని బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. ఇవి 14వ శతాబ్దం నాటివని వివరించారు. వీటిని గురించి కడప జిల్లాకు చెందిన మూడు విభాగాల శాసన రికార్డుల్లో లేదని, అరుదైన శాసనంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.



భీమునిపాడులో లభించిన శాసనం

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్ని కొట్టుకుంటూ వెళ్తా: లోకేశ్

- గత ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు మోసం చేశారు

నల్లచెరువు (శ్రీసత్యసాయి): తన పాదయాత్రకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అడ్డు తగిలితే వారిని కొట్టుకుంటూ వెళ్తానని.. ఆ విధంగానే ముందుకు సాగుతానని టీడీపీ నేత నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్ర ఆదివారం శ్రీసత్యసాయి జిల్లాలోని నల్లచెరువు మండలం చిన్నపల్లోల్లపల్లి నుంచి జోగన్నపేట వరకు సాగింది. జోగన్నపేట వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టేవిధంగా మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన చంద్రబాబును గత ఎన్నికల్లో ప్రజలు మోసం చేశారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో అయినా టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అక్రమంగా నమోదు చేసిన సారా కేసులను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఎత్తివేస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్నారు. కదిరిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, పరిశ్రమలు నెలకొల్పుతామని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. టమాట రైతుల కోసం కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి సొంత పనులు చేసుకుంటున్నారని లోకేశ్ విమర్శించారు.

సరదాగా...

కాలిఫోర్నియాలో అంతుచిక్కని వెలుగురేఖ!



కాలిఫోర్నియా: ఆకాశంలో ఎవరికీ అంతుచిక్కని వెలుగు రేఖ ఒకటి అమెరికా కాలిఫోర్నియాలోని శాక్రమెంటోలో కనిపించింది. సెయింట్ పాట్రిక్ డే వేడుకల్లో ఉన్న వారంతా నీలాకాశంలో కనిపించిన ఆ వెలుగుని చూసి ఆశ్చర్యచకితులయ్యారు. వెంటనే తమ చేతుల్లో ఉన్న సెల్‌ఫోన్ కెమెరాల్లో దానిని బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కేవలం 40 సెకండ్ల పాటు మాత్రమే కనిపించి ఆ వెలుగురేఖ అదృశ్యమైపోయింది. ''ఇప్పటివరకు ఇలాంటి దృశ్యాన్ని మేము చూడలేదు. ఆకాశంలో ఏదో మండుతున్నట్టుగా ఒక వెలుగు కొన్ని సెకండ్లు కనిపించి మాయమైపోయింది. ఇది ఎందుకు కనిపించిందో ఎవరైనా చెప్పగలరా'' అంటూ దానిని వీడియో తీసిన హెర్నాండెజ్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఈ వీడియోను చూసిన హార్వార్డ్–స్మిత్‌సోనియాన్ సెంటర్ ఫర్ ఆస్ట్రోఫిజిక్స్‌కు చెందిన జోనాథాన్ మెక్‌డొవెల్ అంతరిక్షంలో మండించే శిథిలాల్లో ఒక చిన్న తునక కావడానికి 99.9% ఆస్కారం ఉందని బదులిచ్చారు. జపాన్‌కు చెందిన రిటైర్ అయిన కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఇటీవల మంటల్లో దగ్ధం చేశారని, దాని తాలూకు చిన్న తునక అలా కనిపించి ఉంటుందని అంచనా వేశారు.



గద్దతో 'మంత్రాంగం'

ఈయనెవరో తెలుసా? బ్రిటన్ విదేశాంగ మంత్రి జేమ్స్ క్లెవర్లీ. కజకిస్తాన్‌లోని ఆస్తానాలో ఉన్న బాల్‌ఖరగాయ్ నేషనల్ కల్చరల్ రిక్రియేషన్ జోన్ సందర్శన సందర్భంగా చేతిలో గద్దతో ఇలా ఫొటోకు పోజిచ్చారు.

అవిగవిగో నీటి జాడలు

జీవుల మనుగడకు కావాల్సింది జలం. భూమిపై జలం ఉంది కాబట్టి మానవులతో సహా లక్షల సంఖ్యలో జీవులు ఆవిర్భవించాయి. నిక్షేపంగా మనుగడ సాగిస్తున్నాయి. భూమికి సహజ ఉపగ్రహమైన చంద్రుడిపైనా నీటి జాడలు ఉన్నట్లు గతంలోనే పరిశోధకులు గుర్తించారు. ఈ నీటి ఆనవాళ్లకు సంబంధించిన సవివరమైన పటాన్ని(మ్యాప్)ను తాజాగా రూపొందించారు. దీనివల్ల చందమామ ఉపరితలం, అక్కడ మానవుల జీవనానికి అందుబాటులో ఉన్న పరిస్థితుల గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి వీలవుతుందని చెబుతున్నారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా 'ఆర్టిమిస్'పేరిట కీలకమైన ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తోంది. త్వరలో చందమామపైకి మనుషులను పంపించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చంద్రుడిపై నీటి మ్యాప్‌ను తయారు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.


ఇటు చంద్రునిపై.. అటు అంగారకుడిపై..



- అమెరికా, జర్మనీ సంయుక్తంగా ప్రయోగించిన స్ట్రాటోస్ఫియరిక్ అబ్జర్వేటరీ ఫర్ ఇన్‌ఫ్రారెడ్ అస్ట్రానమీ(సోఫియా) అనే అంతరిక్ష నౌక పంపించిన డేటా ఆధారంగా చంద్రుడిపై ఉన్న నీటి మ్యాప్‌ను రూపొందించారు.
- చంద్రుడిలో మన కంటికి కనిపించే భాగంలో నాలుగింట ఒక వంతు భాగాన్ని ఈ మ్యాప్ కవర్ చేస్తోంది. చంద్రుడిపై 60 డిగ్రీల అక్షాంశాల దిగువ భాగం నుంచి దక్షిణ ధ్రువం వరకూ ఉన్న ప్రాంతమంతా ఈ మ్యాప్‌లో ఉంది.
- చంద్రుడిపై నీరు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఎలా కదులుతుంది? అనేది ఈ మ్యాప్ తెలుసుకోవచ్చని సైంటిస్టులు అంటున్నారు. అంతేకాకుండా చంద్రుడి దక్షిణ ధ్రువంలోని భౌగోళిక పరిస్థితులను స్పష్టంగా గమనించవచ్చని చెబుతున్నారు.
- చంద్రుడి ఉపరితలంపై చాలా ప్రాంతాల్లో సూర్యకాంతి పడదు. అతిశీతల వాతావరణం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో చందమామ ఉపరితల లక్షణాలతో అక్కడి నీటికి ఎలాంటి సంబంధం ఉంది? అనేది మ్యాప్ సులభంగా ద్వారా తేల్చవచ్చని నాసా వెల్లడించింది.
- చంద్రుడి ఉపరితలంలో పాటు అంతర్భాగంలోనూ నీటి ఉనికిని గతంలో గుర్తించారు. ఇది మంచు స్ఫటికాల రూపంలో నిక్షిప్తమై ఉన్నట్లు అంచనాకొచ్చారు. మరి కొంత నీరు రసాయన సమ్మేళనాలుగా ఉన్నట్లు కనిపెట్టారు.
- చంద్రుడిపై అసలు నీరు ఎలా పుట్టిందన్న సంగతి నిగ్గు తేల్చడానికి సైంటిస్టులు ఆసక్తి చూపుతున్నారు.

ఆర్టిమిస్ ప్రయోగం

- వ్యోమగాములను పంపించడానికి నాసా చంద్రుడిపై 13 ల్యాండింగ్ సైట్లను గుర్తించింది.
- విభిన్నమైన వాతావరణ పరిస్థితుల్లో చందమామపై నీరు ఎలాంటి మార్పులు చెందుతున్న సంగతి తెలుసుకోవడానికి జల పటం ఉపకరిస్తుందని నాసా వెల్లడించింది.
- ఆర్టిమిస్ ప్రయోగం ద్వారా తొలిసారిగా ఒక మహిళను, ఒక నల్ల జాతీయుడిని చంద్రుడిపైకి పంపించాలని నాసా సంకల్పించింది. చంద్రుడిపై మనుషులు దీర్ఘకాలం నివసించేందుకు అనువైన పరిస్థితులను సృష్టించడానికి ప్రయోగాలు చేస్తోంది.
- ఇందులో భాగంగా అక్కడున్న నీటిని ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపై పరిశోధనలు సాగుతున్నాయి.
- చంద్రుడి నీటి మ్యాప్ ఆర్టిమిస్ ప్రోగ్రామ్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని 'వైపర్'సైన్స్ టీమ్ సభ్యుడు కాసీ హానీబాల్ చెప్పారు.



అరుణ గ్రహంపై జల సవ్వడి!



అంగారక గ్రహం (మార్స్)పై వాతావరణం శూన్యం. గాలి, నీరు ఉండే అవకాశమే లేదని, మానవ మనుగడపై అనువైన పరిస్థితులు లేవని పరిశోధకులు ఇన్నాళ్లూ భావించారు. కానీ, అక్కడ నీటి ఉనికి ఉందన్న నిజం వెలుగులోకి వచ్చింది. మార్స్ మధ్యరేఖ వద్ద పురాతన హిమానీనదం(గ్లేసియర్) అవశేషాలను గుర్తించామని అమెరికా



సైంటిస్టులు ప్రకటించారు. ఈ అవశేషం 6 కిలోమీటర్ల పొడవు, 4 కిలోమీటర్ల వెడల్పు ఉందని వివరించారు. ఇదే ప్రాంతంలో వేలాది సంవత్సరాల క్రితం అగ్నిపర్వతం పేలుడు సంభవించిందని పేర్కొన్నారు. అగ్నిపర్వతం పేలుడు వల్ల ఇక్కడున్న నీరు ఉప్పురూపంలో ఘనీభవించినట్లు భావిస్తున్నామని వివరించారు. ఈ వివరాలను ఇటీవల జరిగిన 54వ లూనార్ అండ్ ప్లానెటరీ సైన్స్ కాన్ఫరెన్స్‌లో విడుదల చేశారు. భూమికి 5.46 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న అరుణ గ్రహంపై అమెరికాతో పాటు వివిధ దేశాలు విస్తృతంగా పరిశోధనలు చేస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని దేశాలు రోవర్లను సైతం పంపించాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

కరోనాతో ఆనందం ఆవిరి

గువాహటి: కరోనా మహమ్మారి మన భావోద్వేగాలతో ఒక ఆటాడుకుంది. మన ఆనందాలను ఆవిరి చేసేసింది. కోవిడ్ సోకిన భారతీయుల్లో 35 శాతం మంది ఇంకా తీవ్ర నిరాశ నిస్పృహల్లోనే ఉన్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఒత్తిడి, కోపం, విచారం, ఆందోళన వంటి ప్రతికూల భావోద్వేగాలు కోవిడ్ బాధితుల్లో అధికంగా ఉన్నాయని హ్యాపీప్లస్ సంస్థ విడుదల చేసిన హ్యాపీనెస్–2023 నివేదికలో వెల్లడైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో కోవిడ్ బాధితుల్లో అత్యధికంగా 60 శాతం మంది తాము ఆనందంగా లేమని చెప్పారు. 58 శాతంతో మధ్యప్రదేశ్, 51 శాతంతో గుజరాత్, ఉత్తరప్రదేశ్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కరోనాతో నిమిత్తం లేకుండా కూడా భారతీయుల్లో సంతోషం పాలు కాస్త తగ్గుతోందని నివేదిక తేల్చింది. తాము ఆనందంగా ఉన్నామని గతేడాది 70 శాతం మంది చెప్పగా ఇప్పుడది 67 శాతానికి తగ్గిందట! ప్రజల శ్రేయస్సును లెక్కల్లోకి తీసుకుంటే గతేడాది 10కి 6.84 పాయింట్లుంటే 6.08కి తగ్గింది. భారతీయ ప్రజల్లో సంతోషం తగ్గిపోవడానికి ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడి, సామాజిక సంబంధాల్లో క్షీణత, ఒంటరితనం కారణాలని అధ్యయనం పేర్కొంది.

రాహుల్ ఇంటికి పోలీసులు

'లైంగిక వేధింపుల' బాధితుల వివరాల కోసమే | 4 పేజీల ప్రాథమిక ప్రతిస్పందనను పంపిన రాహుల్ | పోలీసుల చర్య పట్ల కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం



ఆదివారం రాహుల్ నివాసం వద్ద ఆయన కోసం ఎదురు చూస్తున్న ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ: దేశంలో మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటూ జనవరి 30న శ్రీనగర్‌లో భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఢిల్లీ పోలీసులు మరోసారి స్పందించారు. సదరు బాధిత మహిళల నుంచి ఫిర్యాదు స్వీకరించడంతోపాటు రక్షణ కల్పించడానికి వీలుగా వారి వివరాలు తెలుసుకొనేందుకు ఆదివారం ఢిల్లీలోని రాహుల్ గాంధీ ఇంటికి వెళ్లారు. ప్రత్యేక కమిషనర్ సాగర్‌ప్రీత్ హుడా నేతృత్వంలో పోలీసుల బృందం ఉదయం పదింటికి తుగ్లక్ రోడ్డులోని రాహుల్ ఇంటికి వెళ్లినా ఆయన్ను కలవలేకపోయింది. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి వెళ్లిపోయింది. ఢిల్లీ పోలీసులు రాహుల్ గాంధీ ఇంటికి రావడం ఇటీవల ఇది మూడోసారి. 'లైంగిక వేధింపులకు గురవుతున్నామంటూ మిమ్మల్ని వేడుకున్న మహిళల వివరాలు తెలపండి' అంటూ రాహుల్‌కు ప్రశ్నావళితో నోటీసు పంపించారు.

తీవ్రమైన ఆరోపణలు చేశారు

రాహుల్ ఇంటికి పోలీసుల వచ్చారన్న సంగతి తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నేతలు పవన్ ఖేరా, అభిషేక్ సింఘ్వీ, జైరాం రమేశ్ తదితరులు ఇక్కడికి చేరుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీలో జోడో యాత్ర జరుగుతున్నప్పుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్థానికంగా దర్యాప్తు జరిపామని, మహిళలపై లైంగిక వేధింపులు జరిగినట్లు, సమస్యను వారు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు నిర్ధారణ కాలేదని ప్రత్యేక కమిషనర్ సాగర్‌ప్రీత్ హుడా చెప్పారు. ''రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. త్వరలో తానే స్వయంగా ఆయనను కలిసి, వివరాలు తెలుసుకుంటా'' అని చెప్పారు.

అదానీపై ప్రశ్నిస్తున్నందుకే: రాహుల్

తన ఆరోపణపై రాహుల్ ఆదివారం సాయంత్రం 4 పేజీల్లో ప్రాథమిక ప్రతిస్పందనను పోలీసులకు పంపించారు. గౌతమ్ అదానీ అంశంలో పార్లమెంట్ లోపల, బయట కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తున్నందుకే పోలీసులు తన ఇంటికి వస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, ఇతర పార్టీలు ప్రకటనలపై కూడా ఇలాంటి శల్యపరీక్ష చేశారా అని ప్రశ్నించారు. ఢిల్లీ పోలీసుల చర్యను తీవ్రంగా ఖండించారు. ఆరోపణలపై పూర్తిస్థాయిలో సమాధానం ఇవ్వడానికి 8 నుంచి 10 రోజుల సమయం కోరారు.

కుట్రపూరితంగానే: కాంగ్రెస్

ఢిల్లీ పోలీసులు రాహుల్ ఇంటికి వెళ్లడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. దీని వెనుక రాహుల్‌ను వేధించి, బెదిరించే కుట్ర ఉందని పార్టీ నేతలు అశోక్ గహ్లోత్, జైరాం రమేశ్, అభిషేక్ సింఘ్వీ మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలు చేసే ప్రకటనలపై కేసులు నమోదు చేసే దుష్ట సంస్కృతికి మోదీ సర్కారు తెరతీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు చేసే ప్రకటనలపై ఇకపై ఇలాంటి కేసులు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకుల విమర్శలపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా స్పందించారు. పోలీసులు వారి విధులను వారు నిర్వర్తించారని, ఇందులో తప్పుపట్టడానికి ఏమీ లేదని తేల్చిచెప్పారు. చట్ట ప్రకారమే వారు నడుచుకున్నారని తెలిపారు.

పరారీలో అమృత్‌పాల్

చండీగఢ్: పంజాబ్‌లో వివాదాస్పద ఖలిస్తానీ నేత,, 'వారిస్ దే పంజాబ్' సంస్థ చీఫ్ అమృత్‌పాల్‌సింగ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం నుంచి మొదలైన గాలింపులో అతడి 78 మంది అనుచరులను అరెస్ట్ చేశామన్నారు. ఆదివారం అదుపులోకి తీసుకున్న నలుగురు అమృత్‌పాల్ సన్నిహితులను అస్సాంలోని డిబ్రూగఢ్ సెంట్రల్ జైలుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో తరలించామన్నారు. అమృత్‌పాల్ జాడ కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు. రాష్ట్రంలో మొబైల్ ఇంటర్నెట్, ఎస్ఎంఎస్ సేవల నిలిపివేతను సోమవారం దాకా పొడిగించారు. శనివారం ఛేజింగ్ సమయంలో తన కాన్వాయ్ ముందు వాహనంలో ఉన్న అమృత్‌పాల్ సింగ్, ఇరుకు సందుల్లో వెళుతూ అదను చూసి తప్పించుకున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారు. కానీ అమృత్‌పాల్ పోలీసుల అదుపులోనే ఉన్నాడని అతడి తండ్రి తర్సెమ్ సింగ్ అంటున్నారు.

జపాన్‌లో పుష్పవిలాసం

చెర్రీ బ్లాసమ్ సీజన్‌కు ఘనస్వాగతం

రుతువులు మారే వేళ..
ప్రకృతి వింత అందాలను సంతరించుకున్న వేళ..
నింగిలోని కోటి తారలే నేలపై పూలై
విరబూసే సమయాన..
ఒక పండుగ శోభ మది మదిని ఆహ్లాదపరుస్తుంది.
రాలేటి పూలు రాగాలు పలికిస్తుంటే,
పూసేటి పూలు సుగంధాలు వెదజల్లుతూ ఉంటే
తెలుగువారు ఆమని పాడవే హాయిగా అని
పాటలు పాడుకుంటారు.





అదే జపాన్‌లో అయితే చెర్రీ బ్లాసమ్ (సకుర) చెట్ల కింద కూర్చొని వేడుకలు చేసుకుంటారు. వాతావరణ మార్పుల కారణంగా ఈ ఏడాది చెర్రీ బ్లాసమ్ సీజన్ జపాన్‌ను ముందుగానే పలకరించింది. జపాన్ దేశవ్యాప్తంగా చెర్రీ బ్లాసమ్ చెట్లు ఎక్కడంటే అక్కడే కనిపిస్తాయి. సాధారణంగా మార్చి చివరి వారంలో ఈ చెట్లు విరగబూస్తాయి. కానీ ఈ ఏడాది పది రోజుల ముందే చెర్రీ బ్లాసమ్స్ పూసాయి. రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లు నిండా తెలుపు, గులాబీ రంగుల్లో పువ్వులు అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయి. కొన్ని చెట్లకు పసుపు, ఆకుపచ్చ రంగుల్లో కూడా పూలు పూస్తాయి. ఈ పూలు కేవలం 15 నుంచి నెల రోజుల వరకు మాత్రమే ఉండి ఆ తర్వాత నేల రాలిపోతాయి. అందుకే ఈ సీజన్‌లో జపాన్‌లో ఒక పండుగ వాతావరణం నెలకొని ఉంటుంది. చెర్రీ బ్లాసమ్‌ని మహోత్సవంలా నిర్వహిస్తారు. దీనినే హనామీ ఫెస్టివల్ అంటారు. ఇది జపాన్ జాతీయ పండుగ. వెయ్యేళ్ల క్రితం నుంచే హనామీ ఉత్సవాలు జపాన్ నేలపై జరుగుతున్నాయి. ఈ సీజన్ ఎందరో కవుల హృదయాలను తట్టి లేపి దేశానికి అమృతం లాంటి కవిత్వాన్ని పంచి ఇచ్చింది. ఈ సీజన్‌లో ప్రజలు తమ బాధలన్నీ మర్చిపోయి రోజంతా చెట్ల కింద ఆడుకుంటారు. పాడుకుంటారు. ముచ్చట్లు చెప్పుకుంటారు. తింటారు. తాగుతారు. అక్కడే సేద తీరుతారు. పార్కులు, రోడ్డుకిరువైపులా చెర్రీలు కనువిందు చేస్తుంటే ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చి చీర్స్ చెప్పుకుంటూ ఎంజాయ్ చేస్తారు. చైనా, కొరియా, తైవాన్, యూరప్, అమెరికా దేశాల్లో కూడా చెర్రీ బ్లాసమ్ చెట్లు ఉన్నప్పటికీ జపాన్‌లో చేసినట్టుగా ఒక పండుగలా వైవిధ్యభరితంగా మరెవరూ చేయరు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఈ పండుగ జపాన్ వాసులకు ఆహ్లాదాన్ని పంచడమే కాదు ఆదాయాన్ని కూడా భారీగా సమకూరుస్తుంది. ఈ సీజన్‌లో జపాన్‌కి పర్యాటకులు పోటెత్తుతారు. గత రెండు మూడేళ్లుగా కరోనా మహమ్మారితో ఈ పండుగ కాస్త కళ తప్పింది. ఈ ఏడాది అన్ని భయాలు తొలగిపోవడంతో జపాన్ వాసులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవడానికి సిద్ధమయ్యారు. మార్చి నుంచి ఏప్రిల్ వరకు కొన్ని ప్రాంతాల్లో ఈ చెట్లు పూస్తే, దేశానికి ఉత్తరాదివైపు ఉండే హిరోసాకి

ఆహ్లాదంతో ఆదాయం

వంటి నగరాల్లో మేలో పూలు పూస్తాయి. ఈ సీజన్‌లో చెర్రీ చెట్లు దేశ ఖజానాకు 61,580 కోట్ల యెన్‌ల ఆదాయం తెచ్చిపెడతాయి. ఈ సమయంలో జపాన్‌కు ఏటా 23 లక్షల విదేశీ పర్యాటకులు వస్తుంటారు. ఈసారి జపాన్‌కు బుకింగ్స్ గతం కంటే 70 శాతం ఎక్కువయ్యాయని ట్రావెలింగ్ సంస్థల గణాంకాలు వెల్లడించాయి. హనామీ పండుగలో పాల్గొనడానికి ముందస్తు బుకింగ్‌లకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. టోక్యోలో ప్రధాన కంపెనీలు దేశ విదేశాల్లోని తమ ప్రతినిధుల్ని చెర్రీ పిలిచి చెట్ల కిందే పార్టీలు చేసుకుంటాయి. అయితే ఈ చెట్లను ముందుగానే ప్రభుత్వం దగ్గర బుక్ చేసుకోవాల్సి ఉంటుంది! అలాగాక అప్పటికప్పుడు చెట్ల కింద పార్టీ చేసుకుందామంటే దొరకడం కష్టమే!! ఈ సీజన్‌లో జపాన్‌లో ఫుడ్ అండ్ బెవరేజెస్ కంపెనీల ఆదాయం ఓ రేంజ్‌లో ఉంటుంది. అవును మరి.. చెర్రీ అంటే ఏమనుకున్నారు. ఫ్లవర్ కాదు పవర్....!!

పార్లమెంటే అత్యుత్తమం: ఉపరాష్ట్రపతి

కొందరు విదేశాల్లో దేశంపై విషం చిమ్ముతున్నారంటూ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: దేశంలో పార్లమెంటే అత్యుత్తమమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తేల్చిచెప్పారు. రాజ్యాంగం మన పార్లమెంట్‌లోనే పురుడు పోసుకుందని గుర్తుచేశారు. రాజ్యాంగ రచనలో న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థ తదితరాల పాత్ర ఎంతమాత్రం లేదన్నారు. ప్రజల తీర్పును పార్లమెంట్ ప్రతిబింబిస్తుందని చెప్పారు. రాజ్యాంగ రూపశిల్పి పార్లమెంటేనని వివరించారు. తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహన్‌రావు జీవిత చరిత్ర గ్రంథాన్ని జగదీప్ ధన్‌ఖడ్ ఆదివారం పార్లమెంట్ ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ధన్‌ఖడ్ మాట్లాడారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకంపై కేంద్ర ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ నడుమ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, దేశాభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు విదేశాలకు వెళ్లి మన దేశంపై విషం చిమ్ముతున్నారని, మన ప్రజాస్వామ్యంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ధన్‌ఖడ్ విమర్శించారు! అలాంటి వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇటీవల బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యలపై ప్రస్తుతం పార్లమెంటులో దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాహుల్ పేరు ప్రస్తావించకుండా ధన్‌ఖడ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

సల్మాన్ ఖాన్‌కు బెదిరింపు మెయిల్

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ కార్యాలయానికి బెదిరింపు మెయిల్ రావడం కలకలం రేపింది. గ్యాంగ్ స్టర్ గోల్డీ బ్రార్ ఆయనతో ముఖాముఖి మాట్లాడాలని అనుకుంటున్నట్లుగా అందులో ఉంది. రోహిత్ గర్గ్ అనే ఐడీతో ఆ మెయిల్ ఉంది. శనివారం ఈ మేరకు అందిన ఫిర్యాదుపై గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్, గోల్డీ బ్రార్, రోహిత్ అనే మరో వ్యక్తిపై ముంబైలోని బాంద్రా పోలీసులు కేసులు నమోదు చేశారు. బిష్ణోయ్ ప్రస్తుతం భటిండా జైలులో ఉన్నాడు. పంజాబీ సింగ్ సిద్ధూ మూసేవాలా హత్య కేసులో గోల్డీ బ్రార్ నిందితుడు. గత ఏడాది గుర్తు తెలియని వ్యక్తి నుంచి సల్మాన్‌కు బెదిరింపు లేఖ అందింది.

ఆక్రమిత మేరియుపోల్‌లో పుతిన్



కీవ్: ఉక్రెయిన్‌లోని ఆక్రమిత తీర ప్రాంత నగరం మేరియుపోల్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆకస్మికంగా పర్యటించారు. సెప్టెంబర్‌లో తమ సైన్యం ఈ నగరాన్ని స్వాధీనం చేసుకున్నాక పుతిన్ మొదటిసారిగా అక్కడికి వెళ్లారని రష్యా వార్తా సంస్థలు తెలిపాయి. హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న పుతిన్, సొంతంగా వాహనం నడుపుతూ నగరంలోని స్మారకప్రాంతాలను సందర్శించారు. పుతిన్ శనివారం మేరియుపోల్‌కు దగ్గర్లోనే ఉన్న క్రిమియాకూ వెళ్లారు.

ఈక్వెడార్, పెరూల్లో భూకంపం..14 మంది మృతి

క్విటో: ఈక్వెడార్–పెరూ సరిహద్దుల్లో శనివారం భారీ భూకంపం సంభవించింది. భవనాలు కూలిన ఘటనల్లో 14 మంది చనిపోయారు. మృతుల్లో 13 మంది ఈక్వెడార్‌కు, ఒకరు పెరూకు చెందిన వారు. మరో 126 మంది గాయపడినట్లు ఈక్వెడార్ అధికారులు చెప్పారు. మృతుల్లో 11 మంది ఎల్ ఒరోకు చెందిన వారేనన్నారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి కోసం రక్షణ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. పలు భవనాలు బీటలు వారాయి. విద్యుత్, టెలిఫోన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పసిఫిక్ తీరంలో ఈక్వెడార్ రెండో పెద్ద నగరం గుయాక్విల్ కేంద్రంగా ఉన్న ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.8గా నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది.



మత్స్య విలాపం

ఆస్ట్రేలియాలోని డార్లింగ్ నదిలో దృశ్యమిది. బ్రోకెన్‌హిల్ సమీపంలో ఇటీవల ఇలా ఏకంగా 10 లక్షలకు పైగా చేపలు చచ్చిపోయాయి. వీటిలో సున్నితమైన బోనీ హెర్రింగ్ సహా పలు రకాల చేపలున్నాయి. ఇందుకు వడగాలుల తీవ్రతే కారణమని అధికారులంటుంటే నీటి కాలుష్యమే ఉసురు తీసిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

లద్దాఖ్ మయూర్‌భంజ్ చలో

టైమ్ 'అద్భుత ప్రాంతాల జాబితాలో చోటు



న్యూఢిల్లీ: సమ్మర్ హాలీడేస్‌లో ఎక్కడికెళ్లాలి? పిల్లా పాపలతో కలిసి ఎక్కడికెళ్తే అన్నీ మర్చిపోయి హాయిగా ఎంజాయ్ చేస్తాం? పెద్దగా ఆలోచించకుండా లగేజ్ సర్దేసుకొని కశ్మీర్‌లోని లద్దాఖ్‌కో, ఒడిశాలో మయూర్‌భంజ్‌కు ప్రయాణమైపోవడమే! ఆ రెండే ఎందుకంటారా? ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ ప్రపంచవ్యాప్తంగా అత్యంత అద్భుతమైన ప్రాంతాల జాబితా–2023లో మన దేశం నుంచి చోటు దక్కించుకున్న ప్రాంతాలు అవే మరి! అరుదైన పులులు, పురాతన ఆలయాలు, సాహసంతో కూడిన ప్రయాణం, ఆహా అనిపించే ఆహారం. ఇవన్నీ లద్దాఖ్, మయూర్‌భంజ్‌లకు 50 పర్యాటక ప్రాంతాలతో టైమ్స్ రూపొందించిన ఈ జాబితాలో చోటు కల్పించాయి. లద్దాఖ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అక్కడ అడుగు పెడితే స్వర్గమే తలవంచి భూమికి చేరిందా అనిపించక మానదు. ''మంచుకొండలు, టిబెటన్ బౌద్ధ సంస్కృతి కనువిందు చేస్తాయి. అక్కడి వాతావరణాన్ని ఫీల్ అవడానికి పదేపదే లద్దాఖ్ వెళ్లాలి'' అని టైమ్స్ కీర్తించింది. ''ఇక మయూర్‌భంజ్ అంటే పచ్చదనం. సాంస్కృతిక వైభవం, పురాతన ఆలయాలు, కళాకృతులకు ఆలవాలం. ప్రపంచంలో నల్ల పులి సంచరించే ఏకైక ప్రాంతం'' అంటూ కొనియాడింది. ఏటా ఏప్రిల్లో మయూర్‌భంజ్‌లో జరిగే 'చౌ' డ్యాన్స్ ఫెస్టివల్ అదనపు ఆకర్షణ. ఒడిశా సాంస్కృతిక వారసత్వంతో పాటు ఏకశిలా శాసనాలు గొప్పగా ఉంటాయని టైమ్స్ పేర్కొంది. జాబితాలో అత్యధిక శాతం అమెరికా ప్రాంతాలకే చోటు దక్కింది. టాంపా (ఫ్లోరిడా), విల్లామెట్ (ఒరెగాన్), టక్సాన్ (అరిజోనా), యోసెమైట్ నేషనల్ పార్క్ (కాలిఫోర్నియా) వంటివి వాటిలో ఉన్నాయి.

మోదీ చిరంజీవి

చైనా నెటిజన్లు ఫిదా



బీజింగ్: భారత్, చైనా మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. కానీ ప్రధాని మోదీకి మాత్రం చైనాలో ఫాలోయింగ్ మామూలుగా లేదు! ముఖ్యంగా నెటిజన్లయితే మోదీ పట్ల ఫిదా అవుతున్నారు. 'మోదీ లావోగ్జియన్' (మోదీ చిరంజీవి) అని ప్రేమగా పిలుచుకుంటున్నారు. ఒక విదేశీ నేత పట్ల చైనీయులు ఇంతటి గౌరవాదరాలు చూపడం అరుదు. 'మోదీ అద్భుతమైన నాయకుడు. విభిన్నంగా ఆలోచిస్తారు. భారత్‌ను చక్కగా ముందుకు తీసుకెళ్తున్నారు' అంటూ చైనా సోషల్ సైట్ సినావెబోలో నెటిజన్లు ఆకాశానికెత్తుతున్నారని అమెరికా మ్యాగజైన్ ది డిప్లొమేట్ పేర్కొంది. సినా వెబోకు 58 కోట్లకు పైగా యాక్టివ్ యూజర్లున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం । 20 । మార్చి । 2023



వీకెండ్ విశ్రాంతి

ఆదివారం బెంగళూరు శివార్లలో మైసూరు రహదారి నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం. వారాంతం, పైగా వర్షసూచన వల్ల ప్రజలు బయటకు రాలేదు

న్యూస్‌రీల్

పక్షులను కాపాడుకోవాలి



మైసూరు: వాతావరణ ప్రభావం కారణంగా అరుదైన జాతికి చెందిన పక్షులు మృత్యువాత పడుతున్నాయని, పర్యావరణానికి కలుగుతున్న ఆపద వాటి ప్రాణం మీదికి వస్తోందని మైలాక్ అధ్యక్షుడు ఆర్. రఘు కౌటిల్య ఆందోళన వ్యక్తం చేశారు. జేఎల్‌బీ రోడ్డులో కేఎంపీకే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన చిన్నచిన్న ప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. వాతావరణంలో మార్పులు, రుతువుల మార్పులను మొదట చెప్పేవే పక్షులని తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలంలో పక్షుల కోసం నీటిని ఆరు బయట ఉంచాలని సూచించారు.

కలెక్టరేట్ వద్ద ఆజాన్, కేసు నమోదు

శివమొగ్గ: శివమొగ్గ నగర కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆజాన్ ప్రార్థన చేసిన యువకునిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ పి.మిథున్ కుమార్ తెలిపారు. ఆజాన్ గురించి ఎమ్మెల్యే కేఎస్ ఈశ్వరప్ప చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ మార్చి 17న జిల్లాధికారి కార్యాలయం ఎదుట కొందరు ముస్లిం యువకులు ఆందోళన చేపట్టారు. వారిలో ఒక యువకుడు అక్కడే ఆజాన్ చేశాడు. ఇది సబబు కాదని అతనికి మందలించి పంపించినట్లు తెలిపారు. అలాగే ముందస్తు హెచ్చరికగా కేసు కూడా నమోదు చేసినట్లు చెప్పారు. ధర్నాలో పాల్గొన్నవారి సమాచారాన్ని సేకరిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.

మరణించీ.. ప్రాణదానం

మైసూరు: ఒక వ్యక్తి తన మరణానంతరం కూడా ఐదు మంది రోగులకు ప్రాణదానం చేశాడు. అనిల్ కుమార్ అనే వ్యక్తి తన అవయవాలను దానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచాడు. మైసూరు జిల్లా హెచ్‌డీ కోట తాలూకా పరసయ్యహుండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అనిల్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇతనిని మైసూరు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయ్యాడు. దీంతో అనిల్ కుమార్ కుటుంబ సభ్యుల అనుమతితో అతని కాలేయం, మూత్రపిండాలు, గుండె కవాటాలు, కళ్లను వైద్యులు సేకరించి వాటిని అవసరమైన రోగులకు మార్పిడి చేశారు.

నేడు ఆటోల సమ్మె హెచ్చరిక

శివాజీనగర: బెంగళూరులో బైక్ ట్యాక్సీలను నిషేధించాలని కోరుతూ నేడు సోమవారం సమ్మె చేయనున్నట్లు ఆటోరిక్షాల సంఘాలు ప్రకటించాయి. దీంతో ఆటో సేవల లభ్యతపై అనుమానం వ్యక్తమవుతోంది. బెంగళూరులో 21 ఆటో డ్రైవర్ల సంఘాలుండగా, 2.10 లక్షల ఆటోలు ఉన్నాయి. సీఎం వెంటనే బైక్ ట్యాక్సీలను రద్దు చేయకపోతే సమ్మె తప్పదని తెలిపాయి. గత రెండు సంవత్సరాల నుంచి యాప్ ఆధారిత అనధికారిక వైట్‌బోర్డు బైక్ ట్యాక్సీల తిరగడం వల్ల తమ ఉపాధికి గండి పడిందని ఆటో డ్రైవర్లు ఆరోపించారు. ప్రభుత్వమే బైక్ ట్యాక్సీలకు మద్దతిస్తోందని అన్నారు. ఢిల్లీ, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో బైక్ ట్యాక్సీలను ఇప్పటికే నిషేధించారన్నారు.

తలపై బండరాయితో బాది హత్య

దొడ్డబళ్లాపురం: తలపై బండరాయితో బాది వ్యక్తిని హత్య చేసిన సంఘటన చెన్నపట్టణ పట్టణ పరిధిలోని లాలాఘట్ట సర్కిల్‌లో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. చెన్నపట్టణ పట్టణ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ నివాసి ప్రసాద్ (35) హత్యకు గురైన వ్యక్తి. దుండగులు ప్రసాద్ తలపై బండరాయితో కొట్టి హత్య చేసారు. చెన్నపట్టణ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సైబర్ గజదొంగలు

- రాష్ట్రంలో 4 ఏళ్లలో రూ. 721 కోట్ల దోపిడీ
- అందులో రూ.97 కోట్లు మాత్రమే రికవరీ
- మోసపోతున్న అమాయకులు

బనశంకరి: దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలకు నిలయంగా మారిన కర్ణాటకలో గత నాలుగేళ్లలో రూ.721.26 కోట్లను సైబర్ కేటుగాళ్లు దోచేశారు. కానీ పోలీసులు తిరిగి స్వాధీనం చేసుకున్నది మాత్రం రూ.97.55 కోట్లు మాత్రమే. అంటే సుమారు రూ. 624 కోట్ల భారీ మొత్తం సైబర్ నేరగాళ్ల పాలైంది. క్యూఆర్ కోడ్ స్కాన్, ఓటీపీ, క్రిప్టో కరెన్సీ, పెట్టుబడులు, లక్కీ డ్రా, స్కిమ్మింగ్, గిఫ్టులు, డేటింగ్, మ్యాట్రిమోనియల్ తదితర మార్గాల ద్వారా సైబర్ వంచకులు రాష్ట్ర ప్రజలను వంచనకు తెగబడి నగదు లూటీ చేయడాన్ని టార్గెట్‌గా చేసుకున్నారు. 2019 నుంచి 2023 (జనవరి) వరకు కన్నడనాట రూ.721.26 కోట్లను కొల్లగొట్టారు.

నకిలీ రికార్డులతో సిమ్‌లు, ఖాతాలు

ప్రధానంగా జార్ఖండ్, రాజస్తాన్, ఢిల్లీ, హర్యానా,



డెబిట్, క్రెడిట్ కార్డు మోసాలు పెరిగాయి



దేశంలో సైబర్ నేరగాళ్లు కర్ణాటకనే లక్ష్యంగా చేసుకున్నారు



కరోనా తరువాత బిట్‌కాయిన్ల పేరుతో మోసాలు

పశ్చిమబెంగాల్, గుజరాత్‌లో కూర్చుని సైబర్ వంచకులు అమాయకులను దోచుకుంటున్నారు. ముందుగా నకిలీ సిమ్ కార్డు, డిజిటల్ వ్యాలెట్, గుర్తు తెలియని వ్యక్తుల పేర్లతో బ్యాంకు అకౌంట్ తెరుస్తారు. తమ వలలో పడిన అమాయకుల నుంచి నకిలీ బ్యాంక్ అకౌంట్లకు లక్షలాది రూపాయలు జమ చేసుకుంటారు. నగదు జమ కాగానే దుండగులు డ్రా చేసుకోవడమో, విలువైన వస్తువులను కొనేయడమో జరుగుతుంది. వంచనకు వినియోగించిన నకిలీ సిమ్‌కార్డును పక్కన పడేసి నకిలీ బ్యాంక్ అకౌంట్ క్లోజ్ చేస్తారు. దీంతో మోసగాళ్ల మొబైల్ నంబరు, కంప్యూటర్ ఐపీ అడ్రస్, బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించడం సైబర్‌క్రైం పోలీసులకు సవాల్‌గా మారింది. అపరిచితులతో నగదు వ్యవహారాలకు దూరంగా ఉండాలని బెంగళూరు ఆగ్నేయ విభాగ డీసీపీ సీకే బాబా తెలిపారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

- గుర్తుతెలియని వారితో ఆన్‌లైన్ వ్యవహారాలు చేయరాదు.
- ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్‌లో తెలియని వ్యక్తుల మాటలను నమ్మరాదు
- గిఫ్టులు, కానుకలు పంపిస్తామని తెలిపి కస్టమ్స్ అధికారుల ముసుగులో టోపీ వేస్తారు
- ఆన్‌లైన్ లాటరీ లాంటి మెసేజ్, ఇ-మెయిల్స్ కాల్స్‌కు స్పందించరాదు. ఓటీపీని ఎవరు అడిగినా చెప్పరాదు. ఫోన్ నంబరు తప్పుగా కొట్టడంతో మీ మొబైల్‌కి ఓటీపీ వచ్చింది, చెప్పండి ప్లీజ్ అనే మాటలకు మోసపోరాదు.
- బ్యాంకు అకౌంట్, ఏటీఎం, ఇ-మెయిల్, మొబైల్ పాస్‌వర్డ్స్ రహస్యంగా ఉంచాలి. మొబైల్ కు వచ్చే గుర్తుతెలియని లింక్‌పై క్లిక్ చేయరాదు. వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదు
- ఆర్మీ సిబ్బంది ముసుగులో కాల్ చేసి ఇంటిని బాడుగ కు తీసుకునే నెపంతో ఆన్‌లైన్‌లో నగదు లావాదేవీల ద్వారా బురిడీకి పాల్పడేవారి వలలో పడరాదు.

ఫిర్యాదులకు కేంద్ర హోంశాఖ వెబ్‌సైట్

- సైబర్ క్రైం హెచ్చుమీరుతున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ ఫిర్యాదుల కోసం సైబర్‌క్రైం.జీఓవీ.ఐఎన్ అనే వైబ్‌సైట్ ను ప్రారంభించింది.
- వెబ్‌సైట్‌లోకి వెళ్లగానేపై భాగంలో రిపోర్ట్స్ సైబర్ క్రైమ్ అనేదానిపై క్లిక్ చేయాలి.
- తరువాత మరో పేజీ లో కంప్లైంట్ ఫైల్ అని క్లిక్ చేస్తే రాష్ట్రం, అడ్రస్, పేరు, వివరాలు, మొబైల్ నంబరును నమోదు చేయాలి.
- తరువాత వంచన జరిగిన తీరును నమోదు చేయాలి. సంబంధిత సైబర్ క్రైం అధికారులు ఫిర్యాదుపై దర్యాప్తు చేపడతారు.

రామనగర జిల్లా జైల్లో పోలీసుల సోదాలు

- మొబైల్, సిగరెట్, గంజాయి స్వాధీనం

దొడ్డబళ్లాపురం: రామనగర జిల్లా కారాగృహంపై ఆదివారం ఉదయం పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఎస్పీ కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసులు దాడి చేసారు. దాడుల్లో భారీగా సిగరెట్లు, గంజాయి, మొబైళ్లు దొరికాయి. దాడి చేసిన ప్రతిసారి ఖైదీల వద్ద మత్తుపదార్థాలు, సిగరెట్లు మొబైళ్లు దొరకడం పరిపాటిగా మారింది. జైలు సిబ్బంది సహకారంతోనే ఖైదీలకు మత్తు పదార్థాలు, మొబైళ్లు సులభంగా దొరుకుతున్నాయనేది జగమెరిగిన సత్యం. ఇందుకు సంబంధించి పోలీసులు విచారణ ప్రారంభించారు.

విద్యార్థిని ఆత్మహత్య



వైష్ణవి (ఫైల్)

యశవంతపుర: మానసిక ఒత్తిడితో 7వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కొడగు జిల్లా శివరళ్లి గ్రామంలో జరిగింది. సోమవారపేట తాలూకా శివరళ్లికి చెందిన జితేంద్ర, అక్షత దంపతుల కుమార్తె వైష్ణవి (13) ఆదివారం తెల్లవారుజామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. వారం రోజులుగా మానసికంగా ఒత్తిడికి లోనైనట్లు సమాచారం. ఆదివారం ఉదయం చదువుకొమ్మని చెప్పి తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. ఆ సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఆ ఘోరానికి ఏడాది

- పావగడ వద్ద ప్రైవేటు బస్సు బోల్తా ఘటనలో ఏడుగురు విద్యార్థుల మృత్యువాత
- ఇప్పటికీ కోలుకోని క్షతగాత్రులు

పావగడ: పావగడ చరిత్రలోనే మరచి పోలేని దుర్దినం. ఇంకో అర్ధగంటలో పరీక్షా కేంద్రాలకు వెళ్ళి పరీక్షలు రాయాల్సిన 7 మంది విద్యార్థుల విలువైన ప్రాణాలు గాల్లో కలసి పోయాయి. మరికొందరు విద్యార్థులు తీవ్ర గాయాల పాలై ఇప్పటికీ కోలుకోలేక జీవచ్ఛవాలుగా బతుకీడాల్సి వచ్చింది. ప్రైవేటు బస్సు యజమానుల దురాశకు అమాయకులు బలయ్యారు.

పరీక్ష రాయడానికి వస్తూ

గత ఏడాది మార్చి 19వ తేదీన ఉదయం సుమారు 11 గంటల సమయంలో వైఎన్ హొసకోట నుంచి ఓ ప్రైవేట్ బస్సు క్రిక్కిరిసిన ప్రయాణికులు, పైగా టాప్ మీద కూడా నిండుగా పావగడకు వస్తున్న బస్సు పళవల్లి చెరువు కట్ట మీద అతి వేగం వల్ల పల్టీలు కొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న పీయూ విద్యార్థులు



ఆనాటి బస్సు ప్రమాద దుర్ఘటన(ఫైల్)

అజిత్, షానవాజ్, కళ్యాణ్, హర్షిక, దాదా వలీ, అమూల్య, మహేంద్ర తీవ్ర గాయాల పాలై ఇద్దరు సంఘటనా స్థలంలోనే మృతి చెందగా మిగిలిన 5 మంది క్షతగాత్రులు వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతూ కొన్నిగంటల్లో కన్నుమూశారు. గాయాల పాలైన పలువురు విద్యార్థులు అంగ వైకల్యంతో బాధ పడుతున్నారు. ఇంతటి ఘోర ప్రమాదానికి కారణమైన ఆ పళవల్లి చెరువు కట్ట ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోకపోవడం గమనార్హం. బాధిత కుటుంబాలకు సైతం అరకొర సాయమే అందింది. ఆనాటి ఘోరాన్ని తలుచుకుని బాధిత కుటుంబాలు కన్నీరు మున్నీరయ్యాయి.

పారిశ్రామికవేత్తకు హనీట్రాప్

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

బనశంకరి: సిలికాన్ సిటీలో హనీట్రాప్ దందాలు పెచ్చుమీరుతున్నాయి. టెలిగ్రాం యాప్ ద్వారా పరిచయమైన మహిళ ఆహ్వానం మేరకు వెళ్లిన పారిశ్రామికవేత్త హనీట్రాప్‌లో చిక్కుకున్నాడు. చివరికి వారి నుంచి బయటపడి పోలీసులను ఆశ్రయించాడు.

టెలిగ్రామ్ యాప్ ద్వారా వల వేసి...:

27 ఏళ్ల పారిశ్రామికవేత్తకు టెలిగ్రామ్ యాప్ ద్వారా మెహర్ అనే మహిళ పరిచయం ఏర్పడింది. ఇద్దరూ వాట్సాప్ ద్వారా చాటింగ్‌లు చేసుకునేవారు. తన భర్త దుబైలో ఉద్యోగం చేస్తున్నారని, అతనికి దగ్గరైంది. ఈనెల 3న తన ఫొటో లోకేషన్ పంపించి పారిశ్రామికవేత్తను జేపీ.నగర 5వ స్టేజ్‌లోని అమినామంజిల్ పేరు గల ఇంటికి పిలిపించుకుంది. బెడ్‌రూమ్‌లో పారిశ్రామికవేత్త కూర్చుని ఉండగా గదిలోకి వచ్చిన ముగ్గురు యువకులు ఎవరు నువ్వు అంటూ పారిశ్రామికవేత్తపై దాడి చేశారు.

శారీరక సంబంధం ఉందంటూ ప్రచారం చేస్తామని, రూ. 3 లక్షలు ఇవ్వాలని, లేదంటే, మెహర్‌తో వివాహం చేస్తామని బెదిరించారు. అతని ఫోన్ లాక్కొని రూ. 21,500 జమ చేసుకున్నారు. రాత్రి 8 గంటల వరకు వారివద్ద పెట్టుకున్న అనంతరం క్రెడిట్ కార్డు ఉంటే రూ.2.5 లక్షల నగదు జమచేయాలని డిమాండ్ చేశారని, క్రెడిట్ కార్డు ఇంట్లో ఉందని పారిశ్రామికవేత్త చెప్పాడు. చివరకు వారి బారినుంచి తప్పించుకుని పుట్టేనహళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వంచకుల కోసం గాలిస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి ఎస్మా హెచ్చరిక

శివాజీనగర: కొన్నివారాలుగా ఉద్యోగాల పర్మినెంట్ కోసం ఫ్రీడంపార్క్‌లో ధర్నా చేస్తున్న జాతీయ ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆరోగ్య శాఖ ఎస్మా జారీ చేసింది. తక్షణమే విధులకు హాజరుకావాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించింది. ఆరోగ్య శాఖ సిబ్బంది ఒక నెల నుంచి ధర్నా చేపట్టడంతో ప్రజలకు ఆరోగ్య సేవలకు ఇబ్బంది ఏర్పడింది. ఈ నెల 16న ఇచ్చిన హెచ్చరికను నిర్లక్ష్యం చేస్తూ ధర్నా సాగించగా ఎస్మా జారీ చేయడమైనది. అనేక రాష్ట్రాల్లో ఉద్యోగులను పర్మినెంట్ చేశారని, కాబట్టి తమకూ వర్తింపజేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లో కలిపి మొత్తం 30,574మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ధర్నా నేపథ్యంలో సర్కారు వారి వేతనాన్ని ఈ నెలలో 15 శాతం పెంచింది. అయినప్పటికీ ఆందోళనను వీడలేదు. చివరకు సర్కారు ఎస్మా చట్టం హెచ్చరిక చేసింది.



రవాణా ఉద్యోగుల సమ్మె ఉపసంహరణ

శివాజీనగర: ఈ నెల 21 నుంచి నిర్వహించ తలపెట్టిన నిరవధిక సమ్మెను రవాణా శాఖ ఉద్యోగులు ఉపసంహరించుకున్నారు. రవాణా ఉద్యోగుల 8 సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు హెచ్.వీ.అనంత సుబ్బరావుతో పాటు పదాధికారులు ఆదివారం సీఎం బసవరాజ బొమ్మైను కలిసి ఉద్యోగుల వేతనాన్ని 15 శాతం పెంపుపై కృతజ్ఞతలు తెలిపి, ఉద్యోగుల పలు డిమాండ్లను పరిష్కరించాలని విన్నవించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసాలతో ఈ నెల 21న సమ్మెను ఉపసంహరించుకున్నామని,

మిగతా డిమాండ్లను త్వరలోనే పరిష్కరించాలని కోరామని అనంత సుబ్బరావు తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అయితే సంఘం నేతలు మరికొందరు సమ్మె విరమించుకోలేదని, ప్రభుత్వ ఉత్తర్వుల్లో తమ డిమాండ్లపై స్పష్టత రాగానే సమ్మె విరమిస్తామని వారు తెలిపారు.

టెక్కీ గృహ హింస

- ఉద్యోగం వదిలి మద్యపానం
- భార్యపై దాడి, ఆపై ఆత్మహత్యాయత్నం

యశవంతపుర: దురలవాట్లతో విద్యావంతులు కూడా జీవితాన్ని సమస్యలమయం చేసుకుంటున్నారు. దీంతో పచ్చని సంసారాలు రోడ్డున పడుతున్నాయి. మద్యం తాగవద్దు. సక్రమంగా ఉద్యోగానికి వెళ్లాలని సూచించిన భార్యను భర్త చితకబాదిన ఘటన బెంగళూరులో జరిగింది. తుమకూరుకు చెందిన హర్ష, సుధారాణిలు టెక్కీలుగా పని చేస్తున్నారు. 10 ఏళ్ల నుంచి బెంగళూరు ఆర్ఆర్ నగరలో నివాసం ఉంటున్నారు.

భూమి అమ్మగా డబ్బులు వచ్చాయని

దండిగా జీతాలతో కొడుకుతో కలిసి జీవిస్తున్నారు. ఇటీవల తుమకూరులో హర్ష భూమిని అమ్మగా కోట్లాది రూపాయల డబ్బు వచ్చింది. డబ్బులు చేతికి అందగానే హర్షలో మార్పులు వచ్చాయి. లక్ష రూపాయలు వేతనం ఉన్న ఐటీ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పాడు. ఐదు నెలల నుంచీ రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడుతున్నాడు. మానసికంగా



వేధించేవాడు, ఇదేమని ప్రశ్నిస్తే ఇష్టం వచ్చినట్లు కొడతాడు. మద్యం మత్తులో శుక్రవారం రాత్రి భార్యతో గొడవ పడి ఆమె తలను గోడకేసి కొట్టాడు. తీవ్రమైన గాయాలు కావడంతో స్పృహ తప్పి పడిపోయింది. ఆమె చనిపోయిందని భయంతో హర్ష కూడా ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించాడు. ఇద్దరూ ప్రాణాయయ స్థితిలో ఉండగా స్థానికులు గమనించి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల రగడను చూసిన 12 ఏళ్ల కొడుకు ఇంటి నుంచి పారిపోయి బంధువుల ఇంట్లో తలదాచుకున్నాడు. తానిక తల్లిదండ్రుల వద్ద ఉండనని చెప్పాడు. సుధారాణి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రాజరాజేశ్వరినగర పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆగని అకాల వానలు

- మరో 24 గంటలు వర్షసూచన

బనశంకరి: రానున్న 24 గంటల అవధిలో రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో గాలి, ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. రానున్న 48 గంటల్లో దక్షిణ ఒళనాడులోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షం, ఉత్తర ఒళనాడు ప్రాంతంలో సాధారణ వర్షం కురుస్తుందని తెలిపింది. గత రెండురోజులుగా రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో గాలీవాన, వడగండ్ల వర్షం నమోదైంది. పలు జిల్లాల్లో పంటలకు తీవ్ర నష్టం కలిగింది.

నగరంలో జడివాన

బెంగళూరు నగరంలో మరో రెండురోజుల పాటు ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణశాఖ పేర్కొంది. ఇప్పటికే వర్షం కురుస్తుండటంతో నగరంలో చల్లబడింది. మహదేవపుర వలయంలో వైట్‌ఫీల్డ్, వర్తూరు, కాడుగోడి, సర్జాపుర, మారతహళ్లి, కృష్ణరాజపురం ప్రాంతాలకు అధిక వర్ష సూచన జారీ అయ్యింది. ఇక యాదగిరిలో పిడుగు పడటంతో ఆరుగొర్రెలు మృతి చెందాయి. బళ్లారి జిల్లాలో వడగళ్లతో కూడిన వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వందలాది ఎకరాలలో మిరపపంట కు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. వర్షాలు కొనసాగితే మరింత నష్టం తప్పదు.



వేసవిలో వర్షాలతో వాతావరణం చల్లబడింది

లోకాయుక్త వలలో విద్యుత్ శాఖ ఇంజినీర్లు

యశవంతపుర: బెంగళూరులో లంచం తీసుకుంటూ ఇద్దరు విద్యుత్ శాఖకు చెందిన ఇంజినీర్లు లోకాయుక్త వలలో చిక్కుకున్నారు. సుమనహళ్లి ఉపవిభాగం ఏఈఈ భారతి, కామాక్షిపాళ్య విభాగం ఏఈఈ కనల్‌కుమార్‌లు లోకాయుక్త వలలో పడ్డారు. విద్యుత్ కనెక్షన్‌ని 30 హెచ్‌పీ నుంచి 60 హెచ్‌పీకి నవీకరించటానికి అనంతరాజు అనే వ్యక్తి అర్జీ పెట్టుకున్నాడు. ఇందుకు పై ఇద్దరూ రూ. 25 వేలు డిమాండ్ చేశారు. అనంతరాజు లోకాయుక్తకు ఫిర్యాదు చేయటంతో శనివారం సాయంత్రం డీఎస్‌పీ ప్రకాశ్‌రెడ్డి సిబ్బందితో నిఘా ఉంచి లంచం తీసుకుంటుండగా ఇద్దరు ఏఈఈలను పట్టుకున్నారు. లంచం సొమ్ము స్వాధీనం చేసుకుని కేసు విచారణ చేపట్టారు.

కలబురిగిలో

గౌరవ వేతనం మంజూరు చేయటానికి కలబురిగి జిల్లా వికలాంగుల, వృద్ధుల విభాగం అధికారి వెంకటేశ్ దేశపాండేతో పాటు ముగ్గురు సిబ్బంది లోకాయుక్త వలలో పడ్డారు. శుక్రవారం సాయంత్రం చంద్రశేఖర పాటిల్ క్రీడా మైదానం వద్దనున్న ఆఫీసులో వెంకటేశ్ దేశపాండె, నానాగౌడ హొన్నళ్లి, అంబరేశ నాయక్‌లు లంచం తీసుకొంటూ లోకాయుక్త కు దొరికిపోయారు.





అదిరే ప్రదర్శన ఆధునిక మోటారు సైకిళ్లు, కార్లు, వాటితో అందాలభామలు. ఆదివారం బెంగళూరులో మహిళల జాగృతి కోసం ఓ సంస్థ నిర్వహించిన ప్రదర్శన కనువిందు చేసేంది

క్లుప్తంగా

యోగినారాయణ గురూజీ బాటలో నడవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి

గంగావతి: యోగి నారాయణ గురూజీ జయంత్యుత్సవాన్ని ఆదివారం జంతకల్‌లోని పంపావిరుపాక్షేశ్వర ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి హాజరై యోగి నారాయణ చిత్రపటానికి నివాళుర్పించి మాట్లాడారు. యోగి నారాయణ గురూజీ చూపిన బాటలో నడిచి ఆయన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. బలిజ సమాజం అధ్యక్షుడు రమేష్, నగర ప్లానింగ్ చైర్మన్ రాఘవేంద్ర శెట్టి, బలిజ సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

బాగేపల్లి: సుమారు రూ. 22 కోట్ల అంచనాతో రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి భూమి పూజ చేశారు. బాగేపల్లి నేషనల్ కాలేజీ ముందు నుంచి మిట్టేమరి వరకు ఈ రోడ్డు నిర్మాణ పనులు చేస్తారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరికి జ్ఞానం లోపించి అభివృద్ధి విషయంలో ఇష్టానుసారం మాట్లాడుతున్నారని అన్నారు. తాను వారి మాటాలు పట్టించుకోనని, తనకు తన నియోజకవర్గ ప్రజలే సుప్రీం అని, వారు ఏమి చెబితే అందుకు తాను బద్ధుడనై ఉంటానన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

రాయచూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. శనివారం అర్ధరాత్రి మాన్వి తాలూకా రాజోలి సిద్ధరూఢ మఠం మార్గం మీదుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను మాన్వి ఆబ్కారీ శాఖ సీఐ శైలాజా నాయక్ తనిఖీ చేయగా 115 బాక్స్‌ల్లో మద్యం బయట పడింది. వచ్చే విధానసభ ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు మద్యాన్ని తరలిస్తున్నట్లు తేలడంతో స్వాధీనం చేసుకున్నారు. మద్యం రవాణాదారులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

దంచికొట్టిన వడగండ్ల వర్షం



టార్పాలిన్లు కప్పి ఎండుమిర్చి రాశిని కాపడుకుంటున్న దృశ్యం

కంప్లి: కురుగోడు తాలూకాలోని సోమసముద్ర ఏళు బెంచి, కోళూరు ప్రాంతాల్లో శనివారం అరగంటపాటు ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దీంతో పొలాల్లో నిల్వ చేసిన ఎండు మిరపరాశులు తడిసిపోయి రైతులకు నష్టం జరిగింది. పలువురు రైతులు పరుగు పరుగున పొలాలకు వెళ్లి మిరపరాశులకు టార్పాలిన్లు కప్పారు.

23న యువశక్తి పథకం: సీఎం

శివాజీనగర: యువకులు స్వయం ఉపాధి పొందడానికి స్వామి వివేకానంద యువశక్తి సంఘం పథకాన్ని ఈ నెల 23న సీఎం బొమ్మై ప్రారంభిస్తారు. పథకం గురించి ఆదివారం అధికారులతో ఆయన సమీక్షించారు. యువ సంఘాలకు పరిశ్రమల ఏర్పాటుకు, ఉపాధికి రుణ వసతి కల్పిస్తామని చెప్పారు. పథకం ఖర్చు రూ.5 లక్షల కంటే అధికమైతే బ్యాంకులు రుణ సాయం చేయాలని సూచించారు. యువతకు ఆయా రంగాల్లో శిక్షణనివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు ఆప్ మొదటి జాబితా

బనశంకరి: రానున్న శాసనసభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్) అభ్యర్థుల మొదటి జాబితా నేడు సోమవారం విడుదల చేస్తామని పార్టీ రాష్ట్రాధ్యక్షుడు పృథ్వీరెడ్డి తెలిపారు. ఆదివారం పులకేశినగర నియోజవర్గంలో పార్టీ అభ్యర్థి సురేశ్ రాథోడ్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని ఆదరించాలని ప్రజలకు మనవిచేశారు. అవినీతి రహిత పాలనకు పెద్దపీట వేస్తామన్నారు. అభ్యర్థుల రెండో జాబితాను 27వ తేదీన విడుదల చేస్తామన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- రూ.1.85 లక్షల సొత్తు స్వాధీనం

హుబ్లీ: పాత హుబ్లీ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.1.85 లక్షల విలువైన 4.5 గ్రాముల బంగారం, 11.50 గ్రాముల వెండి, కంచు కడవ, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ ఆర్‌కే.పాటిల్ ఆధ్వర్యంలో కేసును ఛేదించిన ఎస్ఐ ఎక్కూర బృందాన్ని పోలీస్ కమిషనర్ రమణగుప్తా అభినందించారు.

నిరుద్యోగ సమస్యకు పరిష్కారం వెతకాలి

రాయచూరు రూరల్: నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం వెదకాలని కిల్లే బృహన్మఠ శాంతమల్ల శివాచార్యులు సూచించారు. వీరశైవ కళ్యాణమంటపంలో ఉపాధ్యాయుల ఉద్యోగ మేళాను ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. ప్రైవేటు విద్యా సంస్థలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కేశవ రెడ్డి,శ రణేగౌడ, విజయ్ రాజేంద్ర బసవరాజ్, మురళీధర్ పాల్గొన్నారు.

వడగండ్ల వానతో రైతుకు కడగండ్లు



ఓ పొలంలో పడిన వడగండ్లు



రాలిపోయిన ఎండు మిరపకాయలు

- నేలకూలిన మామిడి తోటలు

రాయచూరు రూరల్: అకాల వర్షాలు రైతులను నిలువునా ముంచేశాయి. వేలాది రూపాయలు ఖర్చు చేసి పండించిన పంటలు నేలపాలయ్యాయి. శనివారం సాయంత్రం మూడు జిల్లాలో వడగళ్ల వానలు కురిశాయి. రాయచూరు, యాదగిరి, కలబుర్గి జిల్లాల్లో పలు గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వానలు పడడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. వందల ఎకరాల్లో మామిడి తోటలు, వరి, పత్తి, మిరప పంటలు దెబ్బ తిన్నాయి. రాయాచురు ఆర్‌టిఓ కూడలిలో వాన నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది.

భారీగా పంట నష్టం

యరగేరలో 150 మామిడి చెట్లు, శహపురలో వెయ్యి ఎకరాల్లో మిరప పంట, 2500 ఎకరాల్లో వరి పైరు నాశనమైంది. వడగేరలో లక్ష్మణ్ అనే రైతు 25 ఎకరాలలో వేసిన వరి పంటను వడగళ్ల కప్పేశాయి. బత్తాయి పండంత సైజులో వడగండ్లు పడడంతో పంట పూర్తిగా పోయిందని రైతు ఆవేదన చెందాడు. బీదర్‌లో గాలీవానకు ఒక కోళ్లఫారంలో 8 వేల కోళ్లు మృతి చెందాయి.



రాయచూరులో రోడ్లపై వాననీరు

చితిమంటల్లో బంధువులకు గాయాలు

ఆత్మకూరు: తమ సమీప బంధువు ఉరి వేసుకుని మృతి చెందడంతో ఆమె దహన సంస్కారాలకు వెళ్లిన ఒక వ్యక్తి తీవ్రంగా, మరో ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయట పడిన సంఘటన అనంతపురం సమీపంలో ఆత్మకూరు మండలంలోని పంపనూర్ తాండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.... బళ్లారి ప్రాంతానికి చెందిన శశికళ అనే నవ వధువు శనివారం జిల్లా కేంద్రం అనంతపురంలో ఇంట్లో ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకోవడం తెలిసిందే. ఆమె అంత్యక్రియలు ఆదివారం ఉదయం పంపనూర్ తాండాలో జరిపారు. రాయదుర్గం మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన సమీప బంధువు తిప్పేస్వామి నాయక్ వచ్చాడు. ఆమె మృతదేహన్ని చితి మీద పెట్టి పెట్రోలు పోసి నిప్పు అంటించారు. మంటలు ఆరిపోవడంతో తిప్పేస్వామి నాయక్ పెట్రోలు క్యాన్ తీసుకుని పెట్రోలు పోయగానే మరొక వ్యక్తి నిప్పు అంటించాడు. వెంటనే మంటలు పెట్రోలు క్యాన్‌తో పాటు తిప్పేస్వామి నాయక్ కు వ్యాపించాయి. మంటలను ఆర్పేందుకు మరో ఇద్దరు బంధువలు ప్రయత్నించగా వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే తాండావాసులు మంటలను ఆర్పి తిప్పేస్వామి నాయక్‌ను ఆటోలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన ప్రాణాలకు ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. వరుస విషాద ఘటనలతో బాధిత కుటుంబాలు మరింత శోకానికి గురయ్యాయి.



గాయపడిన తిప్పేస్వామి నాయక్

హత్యకేసులో ఇద్దరికి యావజ్జీవకారాగార శిక్ష

హుబ్లీ: వ్యక్తి హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవకారాగార శిక్ష, రూ.1.10లక్షల జరిమానా విధిస్తూ హుబ్లీ 1వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు శనివారం తీర్పునిచ్చింది. హుబ్లీకి చెందిన అబుజర నాలబంద, అరీఫ్‌ఖాన్ మంతోడి అనే వ్యక్తులు 2018 ఫిబ్రవరి 25న పాండురంగ తిప్పణ్ణ పవార అనే వ్యక్తిని హత్య చేసి రూ.5.60 లక్షలు దోచుకున్నారు. మృతదేహాన్ని అతని కారులోనే ఉంచి హుబ్లీ గబ్బూరు వద్ద కారు వదలి ఉడాయించారు. ఘటనపై కసాబపేట సీఐ సురేష్‌కుంబార కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసు శనివారం విచారణకు వచ్చింది. నిందితుల నేరం రుజువు కావడంతో యావజ్జీవ శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూరి బీ.పరమేశ్వర ప్రసన్న తీర్పు వెలువరించారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది గిరిజా తమ్మినాళ కేసు వాదించారు.

సిద్దుపై మంత్రి ధ్వజం

శివాజీనగర: వ్యవసాయ శాఖ మంత్రి బీసీ పాటిల్ ఇంటిపై దాడిచేస్తే వెయ్యి కోట్ల రూపాయలు లభిస్తాయని సీఎల్పీ నేత సిద్దరామయ్య ఆరోపణలకు మంత్రి మండిపడ్డారు. హావేరి జిల్లా హిరేకరూర్‌లో మాట్లాడిన మంత్రి ముఖ్యమంత్రిగా పనిచేసిన సిద్దరామయ్య ఇంటిలో ఎంత సొమ్ము లభిస్తుందని ప్రశ్నించారు. ఆయన కోలారులో పోటీ చేసినా గ్యారంటీ లేదని ఎద్దేవా చేశారు. ఆయనకు ఏ నియోజకవర్గమూ గ్యారంటీ లేదని అన్నారు.

కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

కంప్లి: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే అక్రమాలు జరుగుతున్న అధికారులు కళ్లుమూసుకొని ఉన్నారని ఎమ్మెల్యే గణేష్ ఆరోపించారు. సంగత్రాయ సంస్కృత పాఠశాలలో ఆదివారం జరిగిన బ్లాక్ కాంగ్రెస్ అల్పసంఖ్యాక విభాగం పదాధికారుల పదవీస్వీకారణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ నాయకులు పట్టపగలే చీరలు పంచుతున్నారని ఆరోపించారు. అయినా తహసీల్దార్, అధికారులు, పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఓటుకు రూ. 10 వేలు పంచినా... కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. కాంగ్రెస్ ప్రముఖులు వై.మునాఫ్, యూ.జిలాన్‌లు మాట్లాడారు. కంప్లి బ్లాక్ కాంగ్రెస్ అల్పసంఖ్యాత అధ్యక్షుడిగా కే.ముస్తాన్‌సాబ్, ఉపాధ్యక్షులుగా ఖుర్షదాబేగం, ఫ్రాన్సిస్, మొహ్మద్ అల్తాఫ్ హుస్సేన్, మక్బుల్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఖాజావలీ, కోశాధికారిగా ఎన్.యూనస్ ప్రమాణ స్వీకారం చేశారు.



ముస్తాన్‌సాబ్‌కు పార్టీ జెండా అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

ఎన్నికల్లో అక్రమాలకు కళ్లెం వేయండి

గంగావతి రూరల్: ఎలాంటి లోటుపాట్లకు తావ్వికుండా విధానసభ ఎన్నికల నిర్వహణను సమర్థంగా, పారదర్శకంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.సుందరేశ బాబు అధికారులకు సూచన చేశారు. జిల్లాడళిత భవనం ద్వారా ఆదివారం ఆయన జెడ్పీసీఈఓ, జిల్లా ఎస్పీ, ఆబ్కారీ శాఖ అధికారుల, తహసీల్దార్లతో సమావేశమై మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సదుపాయాలు కల్పించాలన్నారు. ఓటర్లకు కానుకలు ఇచ్చేవారిపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల్లో అక్రమాలను అరికట్టేందుకు, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు రవాణాను నిరోధించేందుకు 14 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లడుతూ ర్యాలీల్లో లౌడ్ స్పీకర్లకు అనుమతి తీసుకోవాలన్నారు. జెడ్పీ సీఈఓ రాహుల్ రత్నం పాండె, జాయింట్ కలెక్టర్ సావిత్రి బి.కడి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లాధికారి ఎం.సుందరేశ బాబు

అటవీభూములను అక్రమంగా కట్టబెట్టారు



మాట్లాడుతున్న కేఆర్ కుమారస్వామి

హొసపేటె: సండూరు, ఎమ్మిహట్టి గ్రామంలో సుమారు 180 ఎకరాల అటవీ భూములను మంత్రి ఆనంద్‌సింగ్ తన కుమారుడు, బంధువుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించారని కన్నడ ప్రజాసేన రాష్ట్రాధ్యక్షుడు కేఆర్.కుమారస్వామి ఆరోపించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తహసీల్దార్, గ్రామ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సహకరించారని ఆరోపించారు. ఈ విషయంపై లోకయుక్త అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. న్యాయం లభించకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. చిదానందప్ప, ధర్మనాయక పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

గంగావతి రూరల్: పాత్రికేయుడు సిరాజ్ బిసరళ్లికి ప్రకాశనద దత్తి అవార్డును అందజేశారు. మైసూరులోని రాజేంద్ర కళామందిరంలో ఆ జిల్లా జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి హెచ్.ఎన్ నాగమోహన్‌దాస్ ప్రశస్తిని ప్రదానం చేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

గంగావతి: మాధ్యమ అకాడమీ ప్రశస్తి విజేత కే.నింగజ్జను కేఆర్‌పీపీ సంస్థాపకులు గాలి జనార్దనరెడ్డి సన్మానించి సత్కరించారు. గాలి జనార్దనరెడ్డి మాట్లాడుతూ సమాజంలో తప్పిదాలను ఎత్తి చూపుతూ జటిలమైన సమస్యల పరిష్కారానికి కే నింగజ్జ కృషి చేశారన్నారు. నింగజ్జ భార్య లక్ష్మీ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాచార్య జయంతి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామిజీ

గంగావతి రూరల్: జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో రేణుకాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకాచార్యుల చిత్రపటాన్ని నగర వీధుల్లో కళాబృందాల మధ్య ఊరేగించారు. మంత్రి హాలప్ప ఆచార్, ఎంపీ కరడి సంగణ్ణ, ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నల్, అదనపు జిల్లా అధికారిణి సావిత్రి బి కాడి, నగరసభ సభ్యులు, కమిషనర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం మహంతయ్య మఠం కల్యాణ మండపంలో రేణుకాచార్య చిత్రపటానికి ఉజ్జయిని పీఠానికి చెందిన జగద్గురువు సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్యులు నివాళులర్పించారు. రేణుకాచార్య చూపిన బాటలో నడవాలని సూచించారు.

కోలారు వార్తలు...

ముఖ్యాధికారికి వ్యతిరేకంగా ధర్నా



ఆందోళనకారులతో చర్చిస్తున్న తహసీల్దార్

శ్రీనివాసపురం : పట్టణ పురసభ ముఖ్యాధికారి సత్యనారాయణ తీరును నిరసిస్తూ పురసభ అధ్యక్షురాలు ఎం.ఎస్.లలితా శ్రీనివాస్ నేతృత్వంలో పురసభ సభ్యులు ఆదివారం పురసభ కార్యాలయం ముందు ప్రతిఘటన నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ ముఖ్యాధికారి అధ్యక్షురాలి విధులకు అడ్డు పడుతూ మానసిక హింసకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ శాఖ వ్యాప్తిలో ఉన్న భూమికి ఇ ఖాతా చేసిచ్చారని ఆరోపించారు. ముఖ్యధికారి అక్రమాలపై తనిఖీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

స్వసహాయ సంఘాలతో అభివృద్ధి బాట

శ్రీనివాసపురం : మహిళలు స్వసహాయ సంఘాల ద్వారా అభివృద్ధి బాట పట్టాలని శ్రీ క్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ బెంగుళూరు రీజనల్ డైరెక్టర్ శీనప్ప సూచించారు. పట్టణంలోని మారుతీ సభా భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన మహిళా విచార గోష్ఠి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్త్రీ శక్తి సంఘాలను పారదర్శకంగా నిర్వహించడం వల్ల ఆర్థికంగా ముందుకు వెళ్లవచ్చన్నారు. జిల్లా డైరెక్టర్ మురళీధర శెట్టి, సమన్వయ అధికారి ఈరమ్మ నాగరాళ పాల్గొన్నారు.

జాగల్బంది సినిమా ఏప్రిల్‌లో విడుదల



సినిమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

హొసపేటె: దివ్యాంగులు, ప్రేమికులు, యువత ఆకాంక్షలను కథాంశంగా హొసపేటె కళాకారులతో కలిసి తక్కువ బడ్జెట్‌తో జాగల్బంది సినిమాను నిర్మించినట్లు సినీ డైరెక్టర్ దివాకర్ విజ్ఞప్తి చేశారు. సినిమాను ఏప్రిల్‌లో విడుదల చేస్తామని తెలిపారు. నటులు మానసిసుధీర్, ప్రద్యూన్, దివాకర డిండమ్, అర్జునా కొట్టిగి, సంతోష్, అమిత్ శెట్టి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యమపాశమైన కరెంటు తీగ

- పెనుగాలులకు తెగిన విద్యుత్ వైరు
- కందిపొట్టుకు టార్పాలిన్ కప్పేందుకు వెళ్లి తల్లి, ఇద్దరు కుమారుల దుర్మరణం
- కలబుర్గి జిల్లాలో విషాదం



మృతులు శరణమ్మ, మహేష్, సురేష్(ఫైల్)

రాయచూరు రూరల్: అకాల వర్షాలు ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చాయి. ఈదురుగాలులతో తెగి పడిన కరెంటు తీగను తొక్కి తల్లీ ఇద్దరు కుమారులు మృతి చెందారు. ఈ విషాద ఘటన కలబుర్గి జిల్లా చించోళిలో జరిగింది. గ్రామంలోని దనగర్దకి కాలనీలో శరణమ్మ(44), అంబన్న దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి మహేష్(18), సురేష్(16) అనే కుమారులున్నారు. శనివారం రాత్రి ఈదురుగాలుతో భారీ వర్షం కురవడంతో ఇంటి సమీపంలో కందిపొట్టు తడవకుండా టార్పాలిన్ కప్పేందుకు తల్లీ, ఆమె కుమారులు వెళ్లారు. అప్పటికే గాలులతో తెగిపడిన తీగను తొక్కడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. కాగా భార్యా, పిల్లలు ఎంతసేపటికీ రాకపోవడంతో భర్త అంబన్న వెళ్లగా ఆయనకూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వచ్చి అంబన్నను ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు చందాపూర్ తాలుకా అస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.ఒకే కుటంబానికి చెందిన ముగ్గురు మరణించడంతో గ్రామాన్ని విషాదం కమ్మేసింది.

జేడీఎస్‌కు మద్దతివ్వండి

రాయచూరురూరల్ : నగర సభ మాజీ అధ్యక్షుడు వినయ్ కుమార్ నగరంలోని నాలుగవ వార్డులో పర్యటించారు. మాజీ సీఎం కుమార స్వామి హయాంలో చేపట్టిన అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో జేడీఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లాధ్యక్షుడు విరుపాక్షి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినయ్‌కుమార్

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

- బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే బి.నాగేంద్ర

సాక్షి,బళ్లారి: ఐదు సంవత్సరాలుగా బళ్లారి గ్రామీణ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులే వచ్చే ఎన్నికల్లో తన విజయానికి బాటలు వేస్తాయని ఎమ్మెల్యే నాగేంద్ర పేర్కొన్నారు. ఆయన ఆదివారం బళ్లారి నగరంలో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ నుంచి అంచెలంచెలుగా రాజకీయాల్లో రాణించానని, 2008లో మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి సూచనతో బీజేపీ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందినానన్నారు. 2013లో కూడ్లిగిలో స్వతంత్ర అభ్యర్థిగా, 2018 ఎన్నికల్లో బళ్లారి గ్రామీణ నుంచి కాంగ్రెస్ తరఫున గెలుపొందినట్లు గుర్తు చేశారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గంలో దాదాపు 1,100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. మంత్రి శ్రీరాములు బళ్లారి గ్రామీణ నుంచి పోటీ చేస్తే తాను నియోజకవర్గం మారుతానని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. శ్రీరాములు బళ్లారి గ్రామీణ నుంచి పోటీ చేసి ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా తన విజయాన్ని అడ్డుకోలేరన్నారు. బళ్లారి గ్రామీణలో మైనార్టీల ఓట్లు అధికమని, ఇక్కడ కాంగ్రెస్‌కే విజయవకాశాలు ఎక్కువన్నారు.

కేఆర్‌పీపీ పార్టీకి ప్రజాదరణ పుష్కలం

- అధికారంలోకి వస్తే రూ.5వేల కోట్లతో అంజనాద్రి అభివృద్ధి
- గాలి జనార్దనరెడ్డి



మాట్లాడుతున్న గాలి జనార్దనరెడ్డి

గంగావతి రూరల్: కేఆర్‌పీపీ పార్టీకి ప్రజలనుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ వ్యవస్థాకులు గాలి జనార్దన రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన నగరంలోని 35వ వార్డు, విరుపాపుర తండాలో ప్రజలతో సమావేశమై మాట్లాడారు. ఒక్కడి వల్ల ఏమవుతుందని చాలా మంది అన్నారని, వారికి రెండు నెలల తర్వాత సరైన సమాధానం ఇస్తానని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే బసవ శిక్షణ పథకం అమలు చేసి ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు బడుగు బలహీన వర్గాల పిల్లల విద్యకు సహకారం అందిస్తామన్నారు. నిరుద్యోగులకు రూ. 2,500 ప్రతినెల నిరుద్యోగ భృతి, వృద్ధులకు రూ.2,500 పింఛన్ అందిస్తామన్నారు. రైతులు, కూలీలు, కార్మికులకు అండగా ఉంటామన్నారు. అనంతరం తండాకు చెందిన ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్నారు. బాలాంజనేయస్వామి జన్మస్థానమైన అంజనాద్రిని రూ. 5వేల కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో గాలి జనార్దనరెడ్డి సతీమణి గాలి అరుణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మనోహర్ గౌడ హేరూరు, ఉపాధ్యక్షుడు ఈడిగ రామకృష్ణ, నగర ప్రచార సమితి అధ్యక్షుడు నరసప్ప అమజ్యోతి, నగర ఘటక అధ్యక్షుడు వీరేశ్, చౌడ్కి యమనూర్, రామునాయక్, జీలాన్‌బాషా పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో రాష్ట్రాభివృద్ధికి కృషి

కోలారు: రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన పథకాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, ఉక్కు శాఖ మంత్రి ఫగాన్‌సింగ్ కులాస్తె అన్నారు. నగరంలోని ప్రైవేటు హోటల్‌లో ఆదివారం నిర్వహించిన బీజేపీ ప్రణాళికా సలహా స్వీకరణ అభియాన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి దేశాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లిందన్నారు. సమాజంలోని చిట్టచివరి వ్యక్తికీ సౌలభ్యాలను అందించడంలో కేంద్ర ప్రభుత్వం సఫలమైందన్నారు. రాష్ట్ర ప్రజల అభిప్రాయాలను సేకరించి ఎన్నికల ప్రణాళికలో ఉంచి అమలు చేస్తామని తెలిపారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, మాలూరు మాజీ ఎమ్మెల్యే మంజునాద్‌గౌడ, మామిడి మండలి అధ్యక్షుడు వాసుదేవ్, కుడా మాజీ అధ్యక్షుడు ఓం శక్తిచలపతి, ఎస్‌బీ మునివెంకటప్ప, తిమ్మరాయప్ప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి ఫగాన్‌సింగ్ కులాస్తె

హూడి విజయకుమార్ ప్రజా సేవ ప్రశంసనీయం



భక్తులకు ఆశీర్వచనం పలుకుతున్న స్వామీజీ

మాలూరు: హూడి విజయకుమార్ ప్రజా సేవలు ప్రశంసనీయమని మహర్షి ఆనంద గురూజీ అన్నారు. పట్టణంలోని వైట్ గార్డెన్ కాలనీలో సంజీవని ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు హూడి విజయకుమార్ నేతృత్వంలో కొల్హాపుర నుంచి తెచ్చిన మహాలక్ష్మీ విగ్రహానికి స్వామీజీ పూజలు నిర్వహించి మాట్లాడారు. ట్రస్టు ద్వారా సేవలు అందిస్తున్న హూడి విజయకుమార్‌కు రాజకీయంగా మద్దతు ఇవ్వాలని కోరారు. ట్రస్టు అధ్యక్షుడు హూడి విజయకుమార్, శ్వేతా విజయకుమార్, వెంకటేష్‌గౌడ, బీఆర్ వెంకటేష్, హరీష్‌గౌడ పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షునిగా నియామకం

కోలారు: జేడీఎస్ జిల్లా అధ్యక్షునిగా బణకనహళ్లి నటరాజ్ నియమితులయ్యారు. ఆదివారం బెంగుళూరులో హెచ్‌డీ కుమారస్వామి నుంచి నియామక పత్రాలను స్వీకరించారు. అధ్యక్ష బాధ్యతలను సక్రమంగా నిర్వహించి జిల్లాలో పార్టీ అభ్యర్థుల విజయానికి శ్రమించాలని కుమారస్వామి సూచించారు. గత 40 సంవత్సరాలుగా పార్టీకి అందించిన సేవలను గుర్తించి తనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించారని నటరాజ్ తెలిపారు.

కేజీఎఫ్ నగరసభను సూపర్ సీడ్ చేయాలి

కేజీఎఫ్: ఈ ఖాతా ముసుగులో అక్రమాలు జరిగాయని, వెంటనే నగరసభను సూపర్‌సీడ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేంద్రన్ డిమాండ్ చేశారు. ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. గౌతమ నగర్‌లో నిర్మించిన ఇళ్లకు ఈ ఖాతా చేయడానికి గతంలో నగరసభ అధ్యక్షురాలు, వార్డు సభ్యురాలు, ఆమె భర్త తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను వంచించారన్నారు. దీనిపై గతంలో లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా దోషులైన అధికారులకు జరిమానా విధించారన్నారు. అయితే ఏడాది క్రితం ప్రస్తుత నగరసభ అధ్యక్షుడు వళ్లల్ మునిస్వామి, సభ్యురాలు శాలిని, ఆమె భర్త నందకుమార్‌లు అదే తరహా మోసాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నగరసభను సూపర్‌సీడ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వ్యవసాయ పథకాలపై అవగాహన

రాయచూరు రూరల్: రైతులు వ్యవసాయ పథకాలను వినియోగించుకొని ఆదాయం పెంచుకోవాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ దేవిక, తాలూకా అధికారి నయిముద్దీన్ సూచించారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

విద్యా సంస్థల పాత్ర కీలకం



స్వామీజీని సత్కరిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: పిల్లల సమగ్రాభివృద్ధిలో విద్యా సంస్థల పాత్ర ఎక్కువగా ఉంటుందని పేజావర మఠాధిపతి విశ్వప్రసన్న తీర్థస్వామి అభిప్రాయపడ్డారు. ప్రెస్టీజ్ గ్రూప్ కొత్తగా ప్రెస్టో కిడ్స్ సెంటర్, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు చదువుతో పాటు దేశంపై ప్రేమ తదితర భవిష్యత్తు అవసరాలను పాఠ్యాంశాల తరహాలో బోధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రెస్టీజ్ గ్రూప్ అధ్యక్షుడు కె.అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని బైక్ చోదకుడు మృతి

దొడ్డబళ్లాపురం: కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొని బైక్ చోదకుడు మృతి చెందిన సంఘటన కుంబళగోడు సమీపంలోని రాజరాజేశ్వరి ఆస్పత్రి వద్ద బెంగళూరు–మైసూరు రహదారిపై చోటుచేసుకుంది. టోల్ ఫీజు కట్టకుండా తప్పించుకునే ఉద్దేశంతో బస్సు వన్‌వేలో రావడంతో బైక్‌ను ఢీకొంది. బైక్ చోదకుడి వివరాలు తెలిసిరాలేదు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో రాజరాజేశ్వరి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

దొడ్డబళ్లాపురం: పేకాట స్థావరంపై దాడి చేసిన దొడ్డ రూరల్ పోలీసులు ఏడుగురిని అరెస్టు చేసారు. దొడ్డ తాలూకా రాజఘట్ట గ్రామం చెరువుకట్ట వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసారు. పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ. 11 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. దొడ్డ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్-క్యాంటర్ ఢీ.. వ్యక్తి మృతి

మైసూరు: క్యాంటర్ గూడ్స్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన హుణసూరు మైసూరు–బంట్వాళ రహదారిపై యశోధర పుర వద్ద జరిగింది. హుణసూరు తాలూకా కొత్తగాల నివాసి హెచ్‌డీ కోట ప్రజా ఆస్పత్రి గ్రూపు డీ ఉద్యోగి మాదేశ్ గౌడ (57) మరణించాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామం నుంచి హుణసూరు వైపుగా మాదేశ్ గౌడ బైక్‌పై వస్తుండగా మైసూరు వైపు నుంచి పిరియాపట్టణ వైపుగా వెళుతున్న క్యాంటర్ గూడ్స్ వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన మాదేశ్ అక్కడికక్కడే మరణించాడు.

విద్యార్థి జలసమాధి

మైసూరు: కావేరి నదిలో ఈతకు వెళ్లిన విద్యార్థి మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా టీ.నరసీపుర తాలూకా తలకాడిలో జరిగింది. తలకాడి ఒక్కలిగర వీధికి చెందిన దీక్షిత్ (16) అక్కడే ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఇదిలా ఉంటే గ్రామంలో వైకుంఠ నారాయణ స్వామి ఉత్సవమూర్తి బ్రహ్మరథోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం పుణ్యస్నానం కోసం మాధవమంత్రి ఆనకట్టలో ప్రవహిస్తున్న కావేరి నదిలో దీక్షిత్ దిగాడు. పాచి ఎక్కువగా ఉండడంతో కాలు జారి ప్రవహిస్తున్న నీటిలో పడిపోయాడు. ఇతనితో పాటు వెళ్లిన స్నేహితుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బార్‌లు, వైన్‌షాపుల తనిఖీ


వైన్‌షాపులో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: ఎన్నికలకు ముందస్తు చర్యగా తహసీల్దారు మహేశ్ ఎస్ పత్రి, ఎక్సైజు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తమ సిబ్బందితో శనివారం రాత్రి నగరంలోని బార్లు, వైన్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. చిన్న చిన్న, ఇరుకైన ప్రదేశాలలో వున్న వైన్‌షాపులను, బార్‌లను చూసి ఇది షాపా లేక పందుల గూడా అని షాపు యజమానులను ప్రశ్నించారు. అక్కడి శుభ్రతపై మండి పడ్డారు. ఎన్నికల నియమాలు జారీ కాకున్నా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ తెలిపారు. కొంతమంది వ్యక్తులు ఎన్నికల నియమాలకు విరుద్ధంగా కానుకలు, మద్యం సైతం ఇస్తుండటంతో తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఎక్సైజు ఇన్‌స్పెక్టర్ రమేశ్ మాట్లాడుతూ... షాపులను శుభ్రంగా వుంచాలని, స్టాక్ రిజిస్టర్ సక్రమంగా ఉండాలన్నారు. ఏదైనా తేడాలు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శివాజీ విగ్రహానికి పూజలు

యశవంతపుర: బెళగావి రాజకీయం మళ్లీ వేడెక్కుతోంది. రాజహంసగడ కోటను వణికిస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తరువాత ఎంఈఎస్ ఎంట్రీ ఇచ్చింది. మహారాష్ట్ర రాయఘడ నుంచి అర్చకులను పిలిపించి ఎంఈఎస్ రాజహంసగడ కోటలోని శివాజీ విగ్రహాన్ని మూడోసారి ప్రారంభించారు. బెళగావి గ్రామీణ క్షేత్ర పరిధిలోని రాజసంహాగడ కోటలో నిర్మించిన శివాజీ విగ్రహాన్ని రెండుసార్లు ప్రారంభించగా, విగ్రహానికి అవమానం జరిగిందంటూ ఎంఈఎస్ నాయకులు శుద్ధీకరణ పేరులో కార్యక్రమాన్ని నిర్వహించారు.

పొంచి ఉన్న ఇన్‌ఫ్లుయెంజా

- ఈ జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్యశాఖ హెచ్చరిక
- మాస్కు, చేతుల శుభ్రతకు ప్రాధాన్యం



దగ్గు, తుమ్మినప్పుడు చేతికి, ముక్కుకు కర్చీఫ్ లేదా టిష్యూ పేపర్ అడ్డుపెట్టుకోవాలి, చేతుల శుభ్రతను పాటించడం ఉత్తమం

బనశంకరి: దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఇన్‌ఫ్లుయెంజా ఫ్లూ రోగం బెడద పెరుగుతోంది. ఎంతోమంది దగ్గు, జ్వరం, తలనొప్పి, ఒంటినొప్పులు తదితర లక్షణాలతో ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ప్రజలకు కొన్ని సలహాలు విడుదల చేశారు. రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్‌లో ఎక్కువ కేసులు నమోదు కాగా ఐసీఎంఆర్ ల్యాబ్ డేటా విశ్లేషణలో కర్ణాటకలో కూడా ఇన్‌ఫ్లుయెంజా కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ జబ్బుకు ఒసెల్టామివిర్ మాత్రలను చికిత్సా విధానంలో చేర్చారు. ఇవి అన్ని ఆరోగ్యకేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

ప్రజలు పాటించాల్సిన నియమాలు

- తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు నోరు, ముక్కుకు టవల్, కర్చీఫ్, లేదా టిష్యూ పేపర్‌ను అడ్డుగా పెట్టుకోవాలి, ఆపై చేతులను సబ్బుతో నీటితో శుభ్రంగా కడుక్కోవాలి. అవసరం లేకుండా కన్ను, ముక్కు , నోటిని చేతులతో ముట్టరాదు.
- అధిక రద్దీ ఉండే స్థలాలకు వెళ్లడం తగ్గించాలి, రద్దీ ప్రాంతాల్లో మాస్కును ధరించాలి. ఫ్లూ జ్వరంతో బాధపడే వ్యక్తులనుంచి కనీస దూరం పాటించాలి
- రోజూ బాగా నిద్రపోవాలి. తీవ్ర శ్రమ కలిగించే కార్యకలాపాలకు దూరంగా ఉండాలి. ఆలింగనం, ముద్దు పెట్టుకోవడం, జనరద్దీ ప్రాంతాల్లో ఉమ్మివేయడం వంటివి చేయరాదు. వైద్యుల సలహాలేకుండా ఔషధాలను, యాంటి బయాటిక్ మందులను తీసుకోరాదు.

ఇన్‌ఫ్లుయెంజా ఉంటే ఇలా చేయండి

- జ్వరం, జలుబు, అస్వస్థత, ఆకలి లేకపోవడం, చేతులు,కాళ్ల నొప్పులు, దీర్ఘకాలికంగా జలుబు తదితర లక్షణాలు ఇన్‌ఫ్లుయెంజా రోగ లక్షణాలు. ఇలాంటి లక్షణాలు ఎక్కువగా ఉంటే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించాలి. వైద్యుల సలహా మేరకు ఇంటిలోనే విశ్రాంతి తీసుకోవాలి. ప్రయాణాలు చేయరాదు. మాస్కు ధరించడం ముఖ్యం. రోగ లక్షణాలు ప్రారంభమైన తరువాత కనీసం 7 రోజుల పాటు ఆరోగ్యవంతులకు దూరంగా ఉండాలి. లేదంటే రోగి వల్ల ఇతరులకు సులభంగా వ్యాపించే ప్రమాదం ఉంది.


రద్దీ ప్రాంతాలకు వెళ్లేటప్పుడు మాస్కు ధరించాలి

మహిళలకు కుట్టుమిషన్లు వితరణ


కుట్టుమిషన్లు వితరణ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్ఆర్. విశ్వనాథ్ వాణిశ్రీ విశ్వనాథ్ తదితరులు

బనశంకరి: యలహంక నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని యలహంక ఎమ్మెల్యే, బీడీఏ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్ఆర్. విశ్వనాథ్ తెలిపారు. శనివారం యలహంక నియోజకవర్గ పరిధిలోని ఆలూరు గ్రామంలో విశ్వవాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లను ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. యలహంక నియోజకవర్గాన్ని అభివృద్ధితో పాటు మూలభూతసౌకర్యాలకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలూరు గ్రామంలో గర్భిణులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీమంత కార్యక్రమాన్ని వాణిశ్రీ విశ్వనాథ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ ఎస్‌వీ.అలోక్, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైతన్యానికి ప్రతీకలు రచయితలు


లక్ష్మీనారాయణను సన్మానించిన దృశ్యం

బనశంకరి: సరికొత్త ఆలోచనలతో కవులు, రచయితలు సామాజిక చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నారని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం కళ్యాణనగరలోని ఇండో ఏషియన్ అకాడెమి సమావేశమందిరంలో కర్ణాటక తెలుగు రచయితలు సమాఖ్య, ఇండోఏషియన్ అకాడెమి విద్యాసంస్థలు, డీఆర్ అకాడమి ఆధ్వర్యంలో ఉగాది జాతీయ సాహిత్య పురస్కారాలు–2023 ప్రదానోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కవులు, సాహితీవేత్తలు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తమ కలాన్ని కవులు ఎక్కుపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికచేసిన 42 మంది తెలుగు కవులకు ఉగాది జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టీ.ఏకాంబరం, కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య చైర్మెన్ డాక్టర్ బొగ్గవరపు మాల్యాద్రి, పీ.దేవేందర్‌రెడ్డి, డాక్టర్ ఆశాజ్యోతి, కుంచా నాగరాజు, కాచం సత్యనారాయణ గుప్తా, మమత సింగూరు, వెంకట చండీశ్వర్, కళ్లే వెంకటేశ్వరశాస్త్రి, ఈతకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి, శిశు మరణాలు ఉండకూడదు

మైసూరు: రానున్న ఐదేళ్లలో మైసూరు కేఆర్ నియోజకవర్గంలో గర్భిణులు, నవజాత శిశువుల మరణాలను పూర్తిగా నిరోధించడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఎస్ఏ రామదాస్ తెలిపారు. రాజేంద్ర కళా మందిరంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సుకన్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి మాతృ వందనా యోజన లబ్ధిదారులకు పరిహారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన వందలాది కార్యక్రమాల్లో తనకెంతో ఇష్టమైన పథకం మాతృవందనా యోజన అని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ పథకాన్ని తీసుకొచ్చింది మన కృష్ణరాజ విధానసభ నియోజకవర్గంలోనేనని గుర్తు చేశారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 9200 మంది గర్భిణులు లబ్ధి పొందారని తెలిపారు.

సామూహిక వివాహాలు

మైసూరు: కర్ణాటక రత్న, దివంగత నటుడు డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా ఆదివారం నగరంలో సామూహిక వివాహాలు జరిగాయి. మొత్తం 8 జంటలు ఒకేసారి దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టాయి. వస్తు ప్రదర్శన ప్రాధికార ఆవరణలో డాక్టర్ పునీత్ సమాజ సేవా సమితి రెండోసారి నిర్వహించిన సామూహిక వివాహ కార్యక్రమంలో రిజిస్టర్ చేసుకున్న దంపతులకు వివాహాలు చేశారు. సమితి ఆధ్వర్యంలో వరునికి పంచె, షర్ట్, మైసూరు పేట, వధువుకు చీర, తాళిబొట్టు ఇచ్చారు. శివమొగ్గ జిల్లా నిట్టూరు శ్రీ నారాయణ గురు మహాసంస్థాన మఠాధిపతి శ్రీ రేణుకానంద స్వామిజీ తాళిబొట్లను ఆశీర్వదించి వధూవరులకు అందించారు.

రెండు బైక్‌లు ఢీ, ఒకరు మృతి

క్రిష్ణగిరి: రెండు ద్విచక్రవాహనాలు నేరుగా ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలేర్పడి ఆస్పత్రిలో మృతి చెందిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. సూళగిరి అన్నానగర్‌కు చెందిన మంజు (38). శనివారం సాయంత్రం భార్యతో కలిసి ద్విచక్ర వాహనంలో సమీపంలోని డిమార్ట్‌కు వెళ్లి వస్తువులను తీసుకొని తిరిగివస్తుండగా గుండుగురికి వద్ద ఎదురుగా ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన మంజును స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ధర్మపురి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితంలేక ఆదివారం ఉదయం మృతి చెందాడు. సూళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

దయనీయ స్థితిలో కాంగ్రెస్

- మాజీ కేంద్ర మంత్రి సదానందగౌడ ఎద్దేవా

శివాజీనగర: గ్యారెంటీ కార్డుల బోర్డు వేసుకొని ఓటు అడుక్కొనే దయనీయ స్థితికి కాంగ్రెస్ పార్టీ చేరుకొందని కేంద్ర మాజీ మంత్రి డీ.వీ.సదానందగౌడ ఎద్దేవా చేశారు. ఆదివారం నగరంలోని సహకార నగర క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన యువ మోర్చా సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన ఆయన, కార్యసాధకులు కాకుండా భరోసాలను ప్రజలకు గ్యారెంటీ పేరుతో ఇస్తోందని ఆరోపించారు. ఈ గ్యారెంటీ కార్డులను ఇంటింటికి అందజేసేందుకు సిద్ధమైంది. ఈ బోర్డుతో పాటుగా ఓటమి గ్యారెంటీ అనే బోర్డు వేసుకోవటం కాంగ్రెస్ వారు మరిచారని, దానిని వేసుకోవాలని డీవీ.సదానందగౌడ అన్నారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు మాజీ సీఎం బీ.ఎస్.యడ్యూరప్ప నాయకత్వంలో అసెంబ్లీ ఎన్నికలు ఎదుర్కొంటామని, బ్యాటరాయనపురతో పాటు 150 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొంది మళ్లీ అధికారంలోకి వస్తామని పార్టీ రాష్ట్రాధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్ కార్యక్రమంలో విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సాధనాలు, కేంద్ర ప్రభుత్వం కల్పించిన పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ముందుంచుతున్నాం. విజయసంకల్ప యాత్రలకు మంచి స్పందన లభిస్తోందని, బీజేపీ మళ్లీ అధికారంలోకి రావటం తథ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

పెంపుడు కుక్క అపహరణ


కుక్క (ఫైల్)

యశవంతపుర: వాకింగ్‌కు వదిలిన కుక్కను బైక్‌లో అపహరించిన ఘటన బెంగళూరులో జరిగింది. ఫ్రేజర్ టౌన్‌కు చెందిన సయ్యద్ అనే వ్యక్తి సైబీరియన్ హస్కీ జాతికి చెందిన కుక్కను పెంచుతున్నాడు. రోజూ సాయంత్రం కుక్కను వాకింగ్‌కు వదలుతారు. బైక్‌పై వచ్చిన ముగ్గురు నిందితులు కుక్కకు దగ్గరకు పిలిచి అందరూ చూస్తుండగానే బైక్‌లో ఎత్తుకెళ్లారు. ఎంతసేపైనా కుక్క ఇంటికి రాకపోవటంతో సయ్యద్ సీసీ కెమెరాలను పరిశీలించగా బైక్‌పై వచ్చిన దుండగులు అపహరించినట్లు గుర్తించారు. వీడియోతో పాటు కుక్క ఫోటోను బెంగళూరు పోలీసులకు పోస్ట్ చేసి ట్యాగ్ చేసి, తన కుక్కను వెతికి పెట్టాలని బాధితుడు కోరారు.

ఉడుపిలో కేంద్రమంత్రి పర్యటన


మఠంలో కేంద్రమంత్రి జై శంకర్

యశవంతపుర: కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఆదివారం ఉడుపి కృష్ణ మఠాన్ని దర్శించుకున్నారు. పర్యాయ కృష్ణాపుర మఠం విద్యాసాగర తీర్థను కలిశారు. అనంతరం అమృత్ గార్డెన్‌లో మణిపాల్ వర్శిటీలో నిర్వహించిన నాయకత్వ ఉపన్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.

యువతలో హృద్రోగ సమస్యలు

విజయపుర: ఇటీవల కాలంలో యువకులు ఎక్కువగా హృద్రోగ సంబంధిత సమస్యల కారణంగా మృతి చెందుతున్నారని, వారిలో శారీరక శ్రమ లేకపోవడమే ఇందుకు కారణమని తుమకూరు సిద్ధగంగ ఆస్పత్రి కార్డియాలజిస్టు డాక్టర్ జేబీ రవిచంద్రన్ తెలిపారు. శ్రీ నగరేశ్వర ప్రార్థన మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి వ్యక్తి తన దైనందిన జీవితంలో కొంత సమయాన్ని వ్యాయామం, ధార్మిక చింతనలకు కేటాయించాలన్నారు. తద్వారా హృద్రోగ సమస్యలను అధిగమించవచ్చన్నారు.

వ్యవసాయ మేళాలో డాగ్‌షో



శివమొగ్గ: నగర శివార్లలోని నవులె వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో నిర్వహించిన వ్యవసాయ, ఉద్యాన మేళా అందరిని అలరించింది. ఈ మేళా సందర్భంగా ఆదివారం జిల్లా స్థాయి కుక్కల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 15 జాతులకు చెందిన 35 కుక్కలు పాల్గొన్నాయి. ఇందులో పోలీసు శాఖకు చెందిన గౌరి, జాను, హంస జాగిలాలు కూడా పాల్గొన్నాయి. అమెరికన్ అకితా, సైబీరియన్ హస్కి కుక్కలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జర్మన్ షెపర్డ్ ఈ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకుంది.

ఘనంగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తాదులు

చింతామణి: తాలూకాలోని కంగానహళ్లి గ్రామంలో వెలసిన పురాతన శ్రీ సీతారామాంజనేయస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తాదులకు మౌలిక సదుపాయాలు కల్పించారు.

ఆప్ ఉపాధ్యక్షుడిపై దాడి

యశవంతపుర: ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర యువ విభాగం ఉపాధ్యక్షుడిపై దాడి జరిగింది. అమృతహళ్లి పోలీసుస్టేషన్ పరిధిలోని జక్కూరు మొయిన్‌రోడ్డులో శనివారం రాత్రి ఆప్ ఉపాధ్యక్షుడు గిరీశ్‌కుమార్ నాయుడు స్నేహితులను కలిసి యలహంక నుంచి కేఆర్‌పురంకు కారులో వెళ్తుండగా బైక్‌పై వచ్చిన దుండగులు ఓవర్‌టేక్ చేసి బెదిరించినట్లు పార్థిబన్ అనే వ్యక్తి అమృతహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీబీఎంపీ, బీడీఏ అధికారుల అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో గతంలో బెదిరింపు ఫోన్ కాల్ కూడా వస్తున్నట్లు కేఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిసింది.

హోసూరు వార్తలు..

ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకారం

హోసూరు: హోసూరు నియోజకవర్గంలోని 32 గ్రామ పంచాయతీల్లో ఆరు రోజులుగా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆదివారం కెలవరపల్లి గ్రామపంచాయతీలో ముగిసింది. హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. గ్రామ పంచాయతీలోని ఎదుర్కొంటున్న సమస్యలపై 50కి పైగా ఫిర్యాదులను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ కౌన్సిలర్ గుణవతి త్యాగరాజన్, గజేంద్రమూర్తి, పుట్టారెడ్డి, కౌన్సిలర్లు రమేష్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హృద్రోగ వైద్య శిబిరం


హృద్రోగ పరీక్షలు చేయించుకొంటున్న ఎమ్మెల్యే

హోసూరు: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ 70వ జన్మదినాన్ని పురస్కరించుకొని హోసూరు పారిశ్రామికవాడ జుజువాడిలో ఆదివారం ఉచిత హృద్రోగ చికిత్సా శిబిరం నిర్వహించారు. హోసూరు కార్పొరేషన్ 1వ వార్డు, పట్టణంలోని చంద్రశేఖర ఆస్పత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, మేయర్ ఎస్.ఏ. సత్య ముఖ్య అతిథులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో మొదటగా ఎమ్మెల్యే, మేయర్‌లు హృద్రోగ పరీక్షలు చేయించుకొన్నారు. అనంతరం జుజువాడి ప్రాంతానికి చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని హృద్రోగ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ఆనందయ్య, మండల అధ్యక్షులు రవి, టివికె కరుణానిధి, వడివేలు, విద్యాసాగర్, కలైవాణన్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణం ప్రారంభం


భూమిపూజ చేస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: వేపనపల్లి నియోజకవర్గంలోని కొమ్మేపల్లి గ్రామపంచాయతీ అగరం గ్రామంలో రూ. 21.50 లక్షల ఖర్చయ్యే ఓవర్‌ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే కే.పి.మునిస్వామి ఆదివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అగరం గ్రామంలో తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి స్థానిక ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వంగ రైతులు విలవిల


సూళగిరి ప్రాంతంలో వంగతోట


రైతు పండించిన వంకాయలు

- గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న వైనం

క్రిష్ణగిరి: వంకాయ ధరలు దారుణంగా పడిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోసూరు, డెంకణీకట, అంచెట్టి, సూళగిరి తాలూకాల్లో కాయగూరల సాగుకు అనుకూలమైన శీతోష్ణస్థితి ఉండడంతో ఈ ప్రాంతంలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పూలు, ఆకుకూరలు, కాయగూరలను పండించి దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రైతులు పండించే కాయగూరలను ప్రధానంగా హోసూరు, బెంగళూరు, సూళగిరి, రాయకోట మార్కెటలతో పాటు చెన్నై, కోయంబత్తూరు ప్రాంతాలలోని మార్కెట్‌లకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. హోసూరు, సూళగిరి ప్రాంతంలో పెద్ద ఎత్తున రైతులు వంగ పంటను సాగుచేస్తున్నారు. ఎకరా పొలంలో పంటసాగుకు సుమారు లక్ష దాకా ఖర్చు చేయవలసి వస్తుంది. గత కొద్ది రోజులుగా పాదుగైన వంకాయలకు ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలో రూ. 30 నుంచి 60 దాకా ధరపలికే వంగ ప్రస్తుతం మార్కెట్‌లో రూ. 10 ధర పలకడంతో నష్టాలను ఎదుర్కొనవలసి వస్తుందని ప్రభుత్వం చర్యలు చేపట్టి ఈ ప్రాంతంలో రైతులకు శీతలగిడ్డంగి ఏర్పాటు చేయాలని, పంటల బీమాలో వంగ పంటకు అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ప్రైవేట్ బస్సు బోల్తా

- పలువురికి స్వల్ప గాయాలు


బోల్తాపడిన బస్సు

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి నుంచి బెంగళూరుకు వెళ్తున్న ప్రైవేట్ బస్సు బోల్తాపడిన ఘటనలో ప్రయాణికులకు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. క్రిష్ణగిరి బస్టాండు నుంచి 50 మంది ప్రయాణికులతో బెంగళూరుకు బయల్దేరిన ప్రైవేట్ బస్సు ఆదివారం మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో క్రిష్ణగిరి– హోసూరు జాతీయ రహదారి పుళియరసి వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. బస్సులో ప్రయాణిస్తున్న సుమారు ఆరుగురికి స్వల్ప గాయాలు తగిలాయి. మిగతా ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు. సూళగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కెలమంగలం: తళి నియోజకవర్గంలోని బెట్టముగిళాలం గ్రామ పంచాయతీ తొలువబెట్ట ప్రాంతంలో లోవోల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నామని, సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే టి. రామచంద్రన్ విద్యుత్ శాఖాధికార్ల దృష్టికి తీసుకెళ్లి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ప్రారంభించారు. విద్యుత్ శాఖాధికార్లు, కౌన్సిలర్ సుజాత, పంచాయతీ అధ్యక్షులు, ప్రజలు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో పూజలు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని మిడగరపల్లిలో శ్రీ రేణుకయల్లమ్మ దేవి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో మూడేళ్లకొకసారి గంగపూజ నిర్వహించడం ఆనవాయితీ. గంగపూజ కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు.



వ్యక్తి ఆత్మహత్య


ఉరి వేసుకున్న దృశ్యం

క్రిష్ణగిరి: క్రిష్ణగిరిలో గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... క్రిష్ణగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రి వెనుక భాగంలో హైటెన్షన్ విద్యుత్‌లైన్‌లో వ్యక్తి మృతదేహం వేలాడుతున్నట్లు స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలియరాలేదని, కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాడు రైతులపై కాల్పులు..
నేడు నాణ్యమైన కరెంట్

అసెంబ్లీలో విద్యుత్తు శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- నయాపైసా భారం పడకుండా నేరుగా డీబీటీతో ఖాతాలకు జమ
- విద్యుత్తు మీటర్లపై టీడీపీ, లెఫ్ట్ పార్టీల తప్పుడు ఆరోపణలు
- టెండర్లలో ఎలాంటి అక్రమాలూ లేవు
- శ్రీకాకుళంలో పైలెట్ ప్రాజెక్టు విజయవంతం
- రైతుల సంఖ్య పెరిగినా విద్యుత్తు వినియోగం తగ్గింది



సాక్షి, అమరావతి: రైతులకు నాణ్యమైన కరెంట్‌ను 9 గంటలపాటు నిరాటంకంగా అందించడం, విద్యుత్తు పంపిణీ సంస్థల్లో జవాబుదారీతనాన్ని పెంచడమే లక్ష్యంగా వ్యవసాయ మోటార్లకు పారదర్శకంగా మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్తు శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఆదివారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా దీనిపై టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 'రైతులపై నయాపైసా భారం లేకుండా ప్రభుత్వమే బిల్లుల మొత్తాన్ని డీబీటీ ద్వారా వారికి అందిస్తుంది. మీటర్ల ద్వారా రైతులు ఎంత విద్యుత్తు వినియోగిస్తున్నారో తెలుస్తుంది. శ్రీకాకుళం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేశాం. 2021లో ఆ జిల్లాలో విద్యుత్తు వాడకం 101.5 మిలియన్ యూనిట్లుగా ఉండగా మీటర్లు అమర్చాక 67.7 మిలియన్ యూనిట్లకు తగ్గింది. వినియోగదారుల సంఖ్య పెరిగినా వాడకం 33 శాతం తగ్గింది. రాష్ట్రంలో 16.50 లక్షల పంపుసెట్లు ఉండగా 10,027 మంది మినహా అంతా మీటర్ల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. సీఎం మంచి చేస్తున్నారు కనుకనే నమ్మకంతో ముందుకు వచ్చారు. మీటర్ల టెండర్లలోనూ ఎలాంటి అవకతవకలూ లేవు. టీడీపీ, లెఫ్ట్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయి. ముందు పిలిచిన టెండర్లలో ధర ఎక్కువగా ఉండంతో రద్దు చేసి మళ్లీ రూ.5692 కోట్లతో పిలిచాం. మాకు కావాల్సిన వారికి టెండర్లు కేటాయిస్తున్నామన్న ఆరోపణలు సరికాదు' అని పెద్దిరెడ్డి పేర్కొన్నారు. టీడీపీ నేత అచ్చెన్నాయుడు స్పెషల్ సీఎస్ విజయానంద్ లేఖను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్తు చార్జీల పెంపుపై 11 రోజులు దీక్ష చేసిన రైతులపై కాల్పులు జరిపించి, గుర్రాలతో తొక్కించి నలుగురి ప్రాణాలను బలిగొన్న చరిత్ర చంద్రబాబుదని గుర్తు చేశారు.

టీడీపీ చర్యలు హేయం: ఎం.ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్



అసెంబ్లీ సమావేశాలు మొదలైనప్పటి నుంచి టీడీపీ సభ్యులు సభలో నిత్యం గొడవ చేయడం సస్పెండ్ కావడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గవర్నర్ ప్రసంగాన్ని అవమానించారు. ప్రతి రోజూ సభాపతి పోడియం వద్ద అమర్యాదగా ప్రవర్తిస్తున్నారు. విపక్షం చర్యలు హేయం.

అది విపక్షం డిక్షనరీలోనే లేదు: కొరుముట్ల శ్రీనివాస్, ప్రభుత్వ విప్



టీడీపీకి ఉచిత విద్యుత్‌పై మాట్లాడే హక్కులేదు. విపక్షం సభా మర్యాదలను కాలరాస్తూ స్పీకర్‌ను అగౌరవపరుస్తోంది. ప్రజా సమస్యలపై మాట్లాడటం అనేది వారి డిక్షనరీలోనే లేదు.

టీడీపీ చర్యలు అప్రజాస్వామికం: అంబటి రాంబాబు, జలవనరుల శాఖ మంత్రి

టీడీపీ సభ్యులు నిత్యం గందరగోళం సృష్టించాలనే సంకల్పంతో సభకు వస్తున్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు బయట నుంచి డైరెక్షన్ చేస్తుంటే వీళ్లు ఇక్కడ యాక్షన్ చేస్తున్నారు. మోటర్లకు మీటర్లు బిగిస్తుంటే టీడీపీకి భయం పట్టుకుంటోంది. చర్చలు, నిర్ణయాలు జరగకుండా సభను అడ్డుకోవడం దుర్మార్గం, అప్రజాస్వామికం.

మీడియాలో ప్రచారానికే రచ్చ: సుధాకర్‌బాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే



మీడియాలో ప్రచారానికే విపక్షం ఆరాటం. రైతుల గురించి మాట్లాడే హక్కు టీడీపీకి లేదు. కేవలం సస్పెన్షన్‌తో వదిలేయకుండా వెల్‌లోకి దూసుకెళ్లడం ఎంత దుష్ట సంప్రదాయమో తెలియచేసేలా కఠిన చర్యలు తీసుకోవాలి.

మళ్లీ మళ్లీ.. అదే రభస

విద్యుత్తు మీటర్లపై మంత్రి పెద్దిరెడ్డి సమాధానం అనంతరం స్పీకర్ సభకు టీ విరామాన్ని ప్రకటించారు. అనంతరం సభ ప్రారంభమయ్యాక మళ్లీ అదే అంశంపై తమకు మాట్లాడే అవకాశమివ్వాలని టీడీపీ సభ్యులు పట్టుబట్టారు. సభలో మంత్రులు వివిధ శాఖల పద్దులను ప్రవేశపెడుతున్న సమయంలో టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియంపైకి ప్లకార్డులతో ఎక్కి నినాదాలు చేశారు. దీంతో సభ ఆమోదంతో స్పీకర్ తమ్మినేని సీతారామ్ వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

వేడెక్కిన వాతావరణం..

అప్పులు అధికంగా తీసుకునేందుకు కేంద్రం పేరుతో మీటర్లను ఏర్పాటు చేయడం సరికాదని చర్చ సందర్భంగా టీడీపీ నేత అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించడంతో సభలో వాతావరణం వేడెక్కింది. వ్యవసాయం దండగని, రైతులపై కాల్పులు జరిపించిన టీడీపీకి విద్యుత్తుపై మాట్లాడే హక్కు లేదని మంత్రి జోగి రమేష్ ధ్వజమెత్తారు. రైతులకు 30 ఏళ్లపాటు ఉచిత విద్యుత్తు నిరాటంకంగా అందించేలా శాశ్వత వ్యవస్థను సీఎం జగన్ తెస్తున్నారని మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు.

మీడియా పాయింట్

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం..



సాక్షి, అమరావతి: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ అధికారులతో సమీక్షించారు. వారంలోగా పంట నష్టం అంచనా వేసి.. నివేదిక సమర్పించాలని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక సమాచారం మేరకు ఐదు జిల్లాల్లోని 25 మండలాల్లో పంటలకు నష్టం జరిగింది. ఇందులో నంద్యాల జిల్లాలోని 15 మండలాల్లో మొక్కజొన్న, వరి, మినుము, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వంలో మాదిరిగా నష్టం జరిగిన ఏడాది తర్వాత అరకొర సాయం చేయడం కాకుండా.. నష్టం జరిగాక అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ లేదా పంటల బీమా రైతులకు చెల్లిస్తాం. రైతులెవరూ ఆందోళన చెందొద్దు. గత ప్రభుత్వంలో రైతులు కరువుతో అనేక ఇబ్బందులు పడ్డారు. జగన్ సీఎం అయ్యాక పుష్కలంగా వర్షాలు పడి జలాశయాలన్నీ నిండాయి. కేవలం మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలిచినందుకే టీడీపీ నేతలు జబ్బలు చరుచుకుంటున్నారు.

–చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సమాచార శాఖ మంత్రి

మూడు గెలిచి ముచ్చటపడితే ఎలా?



మోసం, కుట్రలు, పొత్తులతో రాజకీయాలు చేయడంలో చంద్రబాబు దిట్ట. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు గెలిచినందుకే చంద్రబాబు జబ్బలు చరుచుకుంటున్నారు. గతంలో నంద్యాల ఎన్నికలో గెలిచినప్పుడు కూడా ఇలాగే చేశారు. కానీ ప్రజలు మాత్రం సాధారణ ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను గెలిపించారు. ఇప్పుడు కూడా టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలు రెండింటితోపాటు ఆరు స్థానాలు మేమే గెలిచాం. ఇప్పటిదాకా జరిగిన అన్ని ఎన్నికల్లో సీఎం జగన్ ప్రజాస్వామ్యబద్ధంగానే పోరాడారు. తన సొంత కష్టంతో ప్రజల్లో నుంచి నాయకుడిగా గెలిచారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్నిచోట్లా మేం గెలిస్తే చంద్రబాబు మాపై ఆరోపణలు చేసేవారు. అది ఆయన నైజం. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ఎంతో ఉన్నతంగా ఉంది. ప్రజలు కూడా సంతృప్తిగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలు గెలుస్తాం.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి

చంద్రబాబుకు శిక్ష తప్పదు



సీమెన్స్ కుంభకోణంలో రూ.300 కోట్లు దోచుకోవడంపై జీఎస్టీ విభాగం, ఈడీలు హెచ్చరించినా చంద్రబాబు ప్రభుత్వం విచారణ చేయించలేదు. ఈ స్కామ్‌లో చంద్రబాబు, పెద్దలు భాగస్వాములు కావడమే ఇందుకు కారణం. 2004లో ఫోక్స్‌వ్యాగన్ కంపెనీ ఏర్పాటుపై ఆరోపణలు వస్తే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి సీబీఐతో విచారణ చేయించారు. తద్వారా ప్రభుత్వ చిత్తశుద్ధిని, విశ్వసనీయతను, నిజాయతీని చాటుకున్నారు. ప్రజాధనాన్ని బందిపోటు దొంగలా దోచుకొన్న చంద్రబాబు సీమెన్స్ కేసు నుంచి తప్పించుకోలేరు. ఆయనకు శిక్ష తప్పదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు, ఓటములపై సమీక్షించుకుంటాం.

– బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి న్యాయం చేయాలి. అగ్రిగోల్డ్ యాజమాన్యం ఆస్తులను వేలం వేసి వారికి నగదు చెల్లించాలి. బాధితులు విజయవాడలో నిర్వహించే ఆందోళనకు పీడీఎఫ్ పూర్తి మద్దతు ఇస్తోంది.

– కేఎస్ లక్ష్మణరావు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ

మద్దతు ధరకు ధాన్యం మొత్తం కొనాలి

రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. ఈ నెల చివరి నాటికి ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి హామీ ఇచ్చారు. అప్పటివరకు రైతులెవరూ తక్కువ ధరకు దళారులకు ధాన్యాన్ని అమ్ముకోకుండా చర్యలు తీసుకోవాలని కోరాం. పశ్చిమ గోదావరి జిల్లా పెరవలికి చెందిన జయ 2002 డీఎస్సీలో హైకోర్టు ఉత్తర్వులు ద్వారా నియామకం పొందారు. అయితే ఆమెకు గత 21 ఏళ్ల నుంచి జీతం ఇవ్వడం లేదు. వెంటనే కోర్టు ఉత్తర్వుల మేరకు జీతం ఇవ్వాలని విద్యాశాఖను ప్రస్తావనలో కోరాం.

– షేక్ షాబ్జీ, పీడీఎఫ్ ఎమ్మెల్సీ

కౌలు రైతులందరికీ పంట రుణాలు

బఫర్‌స్టాక్ కింద 7లక్షల టన్నుల ఎరువులు

- రైతులకు అందుబాటులో నాణ్యమైన ఉత్పాదకాలు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి, అమరావతి : పంట రుణాల పంపిణీలో కౌలు రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా రైతులకు పంట రుణాలపై ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన పంట రుణాలను పంపిణీ చేయిస్తున్నామన్నారు. అవేకాక.. వైఎస్సార్ రైతుభరోసా, సున్నా వడ్డీ, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలను అందిస్తోందన్నారు. ఇక పంట సాగుదారుల హక్కుల పరిరక్షణ చట్టం కింద 5.49 లక్షల మంది కౌలు రైతులకు పత్రాలు అందించామని, వారిలో 1.63 లక్షల మందికి రుణాలు అందాయన్నారు. నాబార్డు నిబంధనల జాయింట్ లయబులిటీ గ్రూపులుగా ఏర్పాటుచేసి రుణాల కోసం, ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూ యజమానులను ఒప్పించి కౌలు రైతులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. అడంగల్‌లో పేర్లు నమోదు చేసుకున్న రైతులందరికీ రాయితీలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కౌలురైతులందరికీ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ.. రైతులకు మరింత సహాయం చేసేందుకు ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తమ నియోజకవర్గంలో 2వేల ఎకరాల్లో 40 ఏళ్లనుంచి సాగుచేస్తున్న రైతులకు పత్రాలు లేనందున ఎలాంటి రాయితీ అందడం లేదని, వారికి రాయితీలు అందేలా చర్యలు తీసుకోవాలని రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీనివాసులుకోరారు.

రైతులకు సరిపడా ఎరువుల పంపిణీ

రాష్ట్రంలోని రైతులందరికీ తగినన్ని ఎరువులు పంపిణీ అయ్యేలా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని మంత్రి కాకాణి తెలిపారు. అలాగే, అదనంగా 7 లక్షల టన్నులకు పైగా బఫర్ స్టాక్‌ను కూడా అందుబాటులో ఉంచామన్నారు. 2022-23లో 10,611 ఆర్బీకేల ద్వారా ఇప్పటివరకు 3.69 లక్షల టన్నులు, పీఏసీఎస్‌ల ద్వారా 3.54 లక్షల టన్నుల ఎరువులు ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లను మరింత సమర్థంగా ఉండేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించేందుకు గోడౌన్లను ఏర్పాటుచేయాలన్నారు.

అగ్రి ల్యాబ్‌ల ఏర్పాటులో ఏపీ అగ్రగామి

సమీకృత వ్యవసాయ ల్యాబ్‌ల ఏర్పాటులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. వీటిద్వారా నాణ్యమైన ఉత్పాదకాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అగ్రిల్యాబ్‌లను విస్తృతం చేశామని, విత్తనాలు, ఎరువుల నాణ్యతను ఈ ల్యాబ్‌ల ద్వారా పరిశీలన అనంతరం ఆర్బీకేల ద్వారా రైతులకు అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలు పుప్పాల శ్రీనివాసరావు, రెడ్డిశాంతి, డి. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అగ్రి ల్యాబ్‌ల ఏర్పాటు తరువాత రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయన్నారు. గిరిజన రైతుల ఉత్పత్తులకు మంచి ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని.. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని మామిడి రైతులకు నష్టం లేకుండా చూడాలని కోరారు.

దెబ్బతిన్న రెగ్యులేటర్, బ్రిడ్జిలను నిర్మిస్తాం : అంబటి



ఏలేరు వరదల్లో దెబ్బతిన్న తూర్పు గోదావరి జిల్లా దబ్బాకాలువపై ఉన్న కట్టమూరు–కాండ్రకోట హెడ్ రెగ్యులేటర్‌తోపాటు, బ్రిడ్జిల పునర్నిర్మాణానికి అంచనాలు పూర్తయ్యాయని, త్వరలోనే ఈ పనులు ప్రారంభించి పూర్తిచేస్తామని సాగునీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు వెల్లడించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ.. ఏలేరు వరదల్లో హెడ్‌రెగ్యులేటర్ కొట్టుకుపోయి మూడేళ్లయినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు.

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచింది మేమే : మంత్రి సురేష్

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులకు వేతనాలు గతంలో కన్నా రెట్టింపు చేయడమే కాకుండా వారిని అన్ని విధాలుగా తమ ప్రభుత్వమే ఆదుకుంటోందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. పారిశుధ్య కార్మికులపై టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. టీడీపీ హయాంలో వారికి చాలాతక్కువ వేతనాలిచ్చేవారని.. ముందు రూ.7వేలిచ్చి ఆ తరువాత ఎన్నికల ముందు రూ.10వేలకు పెంచారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ రూ.15వేలకు పెంచారని.. ఆ తరువాత రూ.21వేలుగా చేశారన్నారు. వారికి ఎంతిచ్చినా తక్కువే అని సీఎం చెబుతుంటారని.. వారిపై ఈ ప్రభుత్వానికి ఎందుకు కక్ష ఉంటుందని మంత్రి ప్రశ్నించారు. టీడీపీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ.. నెలల తరబడి వేతనాలు పెండింగ్ పెడుతున్నారని విమర్శించారు. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలున్నా ఆ మొత్తాలను ఆయా సంస్థలకు జమచేయడం లేదని విమర్శించారు.

8 పద్దులకు అసెంబ్లీ ఆమోదం

- వార్షిక బడ్జెట్ 2023-24లో పద్దుల నిర్వహణకు సభ ఆమోదం
- రూ.64,429.93 కోట్ల పద్దులను ప్రతిపాదించిన మంత్రులు




సాక్షి, అమరావతి: రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2023–24లో రూ.64,429.93 కోట్ల మేర ఎనిమిది పద్దుల నిర్వహణకు శాసనసభ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అనంతరం పద్దులపై సభ్యులు చర్చించారు. సభ్యుల సూచనలు పరిగణనలోకి తీసుకుని తగు చర్యలు చేపడతామని ఈ పద్దులను ప్రతిపాదించిన మంత్రులు చెప్పారు. చర్చలో ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమగ్ర నైపుణ్య శిక్షణకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. తొలుత అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కిల్‌హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినప్పటికీ.. మొత్తం 192 స్కిల్‌హబ్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఎస్‌క్యూఎఫ్ సూచించిన స్థాయిలను బట్టి నియోజకవర్గస్థాయిలో లెవల్–4 వరకు కాలేజీ, స్కూల్ మధ్యలో మానేసిన వాళ్లకు, ఇతర ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 26 జిల్లా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాల్లో ఇప్పటికే 21 ఏర్పాటు చేశామన్నారు. ఇందులో పీజీ, ఇంజనీరింగ్, ఫార్మా, నర్సింగ్, హాస్పిటాలిటీ వంటి రంగాల్లో లెవల్–5 నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. స్కిల్ యూనివర్సిటీ ప్లానింగ్ ఉందని.. ఏడాదికి 50వేల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ కడపలో రూ.వంద కోట్లకుపైగా వ్యయంతో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ చర్చలో ఎవరేమన్నారంటే..

విద్యపై ఖర్చు సమాజ మార్పు



విద్యపై రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న ఖర్చు సమాజాన్ని మారుస్తుంది. దీపం ఇంటికి వెలుగునిస్తుంది.. విద్య కుటుంబం మొత్తానికి వెలుగు నిస్తుందన్న సీఎం జగన్ మాటలు అక్షర సత్యం. పాఠశాలల ఆధునికీకరణ దగ్గర నుంచి మైక్రోసాఫ్ట్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ వరకు ప్రభుత్వం పేద విద్యార్థుల ఉన్నతి కాంక్షిస్తోంది.

– ఆదిమూలపు సురేష్, పురపాలకశాఖ మంత్రి

పేదల భవిష్యత్తు మార్చే విప్లవం



రాష్ట్రంలో పేదపిల్లల భవిష్యత్తును మార్చే విద్యావిప్లవం నడుస్తోంది. ప్రాథమికవిద్య నుంచి ఉన్నతవిద్య వరకు ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో అక్షరాస్యత శాతం పెరుగుతోంది. విద్యారంగంలో సీఎం విప్లవాత్మక నిర్ణయాల కారణంగా కేంద్ర మానవవనరుల అభివృద్ధి పనితీరు సూచీ–2021లో ఏపీ 24వ స్థానం (2018లో) నుంచి 7వ స్థానానికి వచ్చింది. మా నియోజకవర్గంలో వైఎస్సార్ హయాంలో ఏర్పాటుచేసిన నన్నయ్య వర్సిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి. సీతానగరం మండలంలో డిగ్రీ కాలేజీలో సిబ్బంది కొరతను తీర్చడంతోపాటు ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలనూ కూడా పరిష్కరించాలి.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, రాజానగరం

విద్యతోనే అసమానతల తొలగింపు



వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చిన నేను అనుకోని విధంగా స్కూల్‌కు వెళ్లాను. అనుకోని విధంగా ఇంగ్లిష్ మీడియంలో పడ్డాను. పొలాల్లో ఉండాల్సిన వ్యక్తిని ఐఏఎస్ చదివి.. ఇప్పుడు ప్రజాసేవ చేస్తున్నాను. సమాజంలోని అసమానతలు కేవలం విద్యతోనే తొలగించవచ్చని విశ్వసించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇంతగా పేదల విద్యకోసం పరితపిస్తున్న నాయకుడిని చూడలేదు. అమ్మ ఒడి దగ్గర నుంచి గ్లోబల్ లాంగ్వేజ్ ఇంగ్లిష్ వరకు ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం ఇది. ప్రభుత్వ పాఠశాలల్లో 90 శాతం బడుగు బలహీనవర్గాలే చదువుకుంటున్నారు. అటువంటి పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చి సాంకేతికత వైపు నడిపిస్తున్నారు.

– వరప్రసాద్, ఎమ్మెల్యే, గూడూరు

అవినీతిలో టీడీపీ నైపుణ్య శిక్షణ



టీడీపీ ప్రభుత్వంలో యువతకు ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి కల్పించాల్సిన విషయంలో విఫలమయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్‌ను అవినీతి స్కామ్‌గా మార్చడంలో విజయవంతం అయ్యారు. ఇందులో అప్పటి ఐటీ మంత్రి లోకేశ్ కర్త, కర్మగా మారారు. పరిశ్రమలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాలు పెంపొందించడం చాలా ముఖ్యం. అందుకే రాష్ట్రంలో స్కిల్ విప్లవం నడుస్తోంది. వెనుకబడిన గిరిజన ప్రాంతం అరకులోను స్కిల్ కాలేజీ రాబోతోంది. గిరిజన ప్రాంతంలో నిరుద్యోగ యువత ఉపాధి కోసం వలస వెళ్తోంది. అటవీ ప్రాంతంలో అటవీ ఉత్పత్తులపై ఆధారపడుతున్న మాకు.. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పించాలి. అప్పుడు గిరిజనులు ఆర్థికంగా బలపడతారు. పర్యాటక రంగానికి అనువుగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలి.

– కె.భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే, పాడేరు

వైద్యం ప్రజల హక్కు



వైద్యం ప్రజల హక్కుగా సీఎం భావిస్తున్నారు. అందుకే పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేయడంతోపాటు 10,032 వైఎస్సార్ హెల్త్‌కేర్ క్లినిక్స్ తీసుకొచ్చారు. గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం అందుబాటులోకి వస్తోంది. మేము గడపగడపకు వెళ్లినప్పుడు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నవారికి అందుతున్న వైద్యం చూస్తే సంతోషంగా ఉంది. వైఎస్సార్ కంటివెలుగు, సంపూర్ణ పోషణ వంటివి ఉన్న ఊరిలోనే లభిస్తున్నాయి. బద్వేల్, పోరుమామిళ్లలో రెండు సీహెచ్‌సీలున్నాయి ఇటీవలే అప్‌గ్రేడ్ అయ్యాయి. వీటిలో ఎక్సరే యూనిట్లు, ఆర్థోపెడిక్ సర్జన్లను నియమించాలి. ఒక మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్‌ను కేటాయించాలి.

– డాక్టర్ సుధ, ఎమ్మెల్యే, బద్వేల్

సమగ్ర సర్వేతో పేదలకు మేలు



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సమగ్ర సర్వేతో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారికి విముక్తి లభిస్తుంది. ఒకప్పుడు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ రావడానికి సంవత్సరాలు పట్టేది. ఇప్పుడు లంచం లేకుండానే రోజుల వ్యవధిలో ఇస్తున్నారు. సమగ్ర సర్వేతో ఎన్నో కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తాయి.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ విప్

కడప స్టీల్ ప్లాంట్‌కు 3,703.92 ఎకరాల సేకరణ



సాక్షి, అమరావతి: కడప స్టీల్ ప్లాంట్ కోసం 3,703.92 ఎకరాల భూమిని సేకరించినట్లు పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి అమర్నాథ్ శాసనమండలిలో ఆదివారం తెలిపారు. ఇందులో 488 మంది రైతులు తమ భూములు ఇచ్చారని, వారికి రూ. 42.03 కోట్లు భూ పరిహారంగా చెల్లించినట్లు వివరించారు. మరో రూ.5.38 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు.

సచివాలయాల ద్వారా 6.10 కోట్ల సేవలు..



గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రాష్ట్ర ప్రజలు ఇప్పటివరకు 6.1 కోట్ల సేవలను పొందారని ఉపముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) ముత్యాలనాయుడు తెలిపారు. మండలి ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఒక ప్రశ్నకు జవాబుగా ఆయన స్పందిస్తూ.. సచివాలయాల ద్వారా ప్రజలకు 583 రకాల ప్రభుత్వ సేవలు వారి సొంత గ్రామాల్లో, వార్డుల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు.

ఇంటి వద్దే ఆరోగ్య సేవలు అందించడమే 'ఫ్యామిలీ డాక్టర్' లక్ష్యం..

ప్రజల ఇంటి వద్దే ఆరోగ్య సేవలను అందించడం ఫ్యామిలీ డాక్టర్ విధానం లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ విడదల రజని.. మండలిలో ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

ఆప్కాబ్, డీసీసీబీలకు ఒకే సర్వీస్ రూల్స్

- త్వరలో రాష్ట్రస్థాయి పాలసీ రూపకల్పన
- డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిల సమావేశంలో మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి: ఆప్కాబ్, డీసీసీబీలకు ఒకే సర్వీస్ రూల్స్ వర్తించేలా పాలసీ రూపొందించనున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఆయన ఆదివారం సచివాలయంలోని తన చాంబర్‌లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పర్సన్ ఇన్‌చార్జిలతో సమావేశమై సహకార రంగంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులను ప్రత్యేక బ్రాండింగ్‌తో ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆప్కాబ్, సెంట్రల్ బ్యాంకులు బాగా పనిచేస్తున్నాయన్నారు. అదేస్థాయిలో పీఏసీఎస్‌లు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు కృషిచేయాలని సూచించారు. రైతులకు రుణాలివ్వడంలో మొదటి ప్రాధాన్యతను ఇస్తూ, ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు బహిరంగ మార్కెట్లో ఇతర వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవాలని చెప్పారు. ఖాతాదారుల సంఖ్యతోపాటు డిపాజిట్లను పెంచుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సహకార బ్యాంకులు రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని కోరారు. రైతులు రుణాలను పొందేందుకు, తిరిగి చెల్లించేందుకు పూర్తి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఎం.ఝాన్సీరాణి, ఎండీ డాక్టర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, వివిధ జిల్లాల డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రాజీనామా చేసి పోటీకి వస్తే సత్తా చూపిస్తాం

అచ్చెన్నాయుడికి మంత్రి సీదిరి అప్పలరాజు సవాల్



సాక్షి, అమరావతి: నోటి దురుసు ప్రదర్శించిన టీడీపీ నేత అచ్చెన్నాయుడికి మంత్రి సీదిరి అప్పలరాజు సవాల్ విసిరారు. ఆదివారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ఓటమితో అధికార పార్టీ నాయకులకు మైండ్‌లు పనిచేయడం లేదని, ఏమి మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి సీదిరి అప్పలరాజు స్పందిస్తూ.. 'అచ్చెన్నాయుడికి దమ్ముంటే టెక్కలిలో రాజీనామా చేసి మళ్లీ పోటీకి సిద్ధమవ్వాలి. నేనూ రాజీనామా చేస్తాను. ఎన్నికల్లో మా సత్తా ఏమిటో చూపిస్తాం. ఆయన వస్తాడో, చంద్రబాబు వస్తాడో, ఆయన కొడుకు లోకేశ్ వస్తాడో మీ ఇష్టం' అంటూ సవాల్ చేశారు. దీనిపై టీడీపీ సభ్యుల నుంచి అరుపులు, కేకలు తప్ప నిర్దిష్ట సమాధానం రాలేదు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పేదల సొంతింటి కల కోసం రూ.12,000 కోట్లతో ప్రైవేటు భూములు కొన్న ఏకైక ప్రభుత్వం ఇది
- 30.65 లక్షల లబ్ధిదారులకు రూ.31,831.96 కోట్ల లబ్ధి కలిగించాం : ధర్మాన
- రబీ పంటల కొనుగోలుకు సిద్ధం : కారుమూరి



సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో ఎక్కడాలేని విధంగా పేదలందరికీ ఇళ్ల లక్ష్యంగా 30,65,315 మందికి ఇళ్ల పట్టాలను అందజేశామని, ఇందుకోసం సుమారు రూ.12,000 కోట్లతో ప్రైవేటు భూమిని కొనుగోలు చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. గతంలో కేవలం ప్రభుత్వ భూములను మాత్రమే ఇచ్చేవారని.. కానీ, సీఎం వైఎస్ జగన్ అందరికీ ఇళ్ల లక్ష్యంలో భాగంగా ప్రైవేటు భూములను కొనుగోలు చేసి పేదవారి కలను నిజం చేసినట్లు తెలిపారు. ఇళ్ల పట్టాల కోసం మొత్తం 73,498.528 ఎకరాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇళ్ల పట్టాల పంపిణీపై శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ధర్మాన బదులిస్తూ.. సుమారు రూ.31,831.96 కోట్ల విలువైన భూమిని పేదలకు ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాక.. ఒక ఊరు మాదిరిగా అన్ని మౌలిక వసతులతో జగనన్న కాలనీలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

పండిన ప్రతి గింజనూ కొంటాం

ఇక ఖరీఫ్‌లో రాష్ట్రంలో పండిన ప్రతీ గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇందుకోసం ఈ నెలాఖరు వరకు ఆర్‌బీకేల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. 2022–22 ఖరీఫ్‌లో 6,10,925 మంది రైతుల నుంచి ఇప్పటివరకు 33.49 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుపై పరిమితి విధించలేదన్నారు. త్వరలోనే రబీ పంట రానుండటంతో ఈ పంట కొనుగోలుకూ ప్రణాళిక సిద్ధంచేస్తున్నట్లు తెలిపారు.

రెండు బిల్లులకు ఆమోదం

మరోవైపు.. ఆదివారం శాసనమండలి రెండు బిల్లులకు ఆమోదం తెలిపింది. వ్యాట్ చట్టంలోని సవరణల కోసం ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ను ప్రవేశపెట్టిన బిల్లుకు మండలి ఆమోదం తెలిపింది. అలాగే, పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రవేశపెట్టిన పారా వెటర్నరీ అనుబంధ కౌన్సిల్ బిల్లు–2023కు సభ ఆమోదం తెలిపింది. పలువురు సభ్యులు ప్రత్యేక ప్రస్తావన కింద పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చిన అనంతరం మండలిని సోమవారం ఉ.10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు.

'మండలి'లో టీడీపీ మళ్లీ రచ్చ


- ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిక్లరేషన్లు ఇచ్చే అంశంపై వాయిదా తీర్మానం
- ఈసీ పరిధిలోని అంశం ఇక్కడ చర్చిస్తే ఏం ప్రయోజనమన్న చైర్మన్
- పోడియంలోకి వెళ్లి ఆందోళనకు దిగిన టీడీపీ ఎమ్మెల్సీలు



సాక్షి, అమరావతి : శాసనమండలిలో టీడీపీ సభ్యులు ఆదివారం కూడా రచ్చరచ్చ చేశారు. సభ మొదలుకాగానే.. 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిక్లరేషన్ ఇచ్చే విషయం'పై టీడీపీ ఎమ్మెల్సీలు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు మండలి చైర్మన్ మోషేన్‌రాజు ప్రకటించారు. దీంతో టీడీపీ సభ్యులు చర్చ జరగాల్సిందేనంటూ చైర్మన్ పోడియం వద్దకెళ్లి నినాదాలు చేశారు. ఎన్నికల్లో గెలిచినవారికి డిక్లరేషన్ ఇచ్చే అంశం పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలో ఉంటుందని, ఆ అంశం ఇక్కడ చర్చకు జరపడంవల్ల ఏం ప్రయోజనం ఉంటుందని చైర్మన్ అన్నారు. ఏదో అంశంపై గొడవ చేయాలన్నదే టీడీపీ ఎమ్మెల్సీల ఉద్దేశంగా కనిపిస్తోందని ఉమ్మారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. 2011లో అప్పుడు కడప లోక్‌సభకు పోటీచేసిన జగన్‌మోహన్‌రెడ్డి గెలిచిన తర్వాత డిక్లరేషన్ ఫారం ఆలస్యంగా ఇచ్చారని.. ఈసీ పరిధిలో అంశాన్ని తీసుకొచ్చి సభలో రాజకీయం చేయాలని చూస్తున్నారని తప్పుబట్టారు. చైర్మన్ పదేపదే వారిస్తున్నా, టీడీపీ సభ్యులు చైర్మన్ పోడియం పైకి కూడా వెళ్లి ఆందోళన కొనసాగించడంతో సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మోషేన్‌రాజు ప్రకటించారు.

ఇస్లాం వెలుగు

విలువల వికాసమే ఉపవాసాల ఉద్దేశ్యం



అల్లాహ్ ఈ సృష్టిని ఉనికిలోకి తెచ్చినప్పుడే దానికి కొన్ని ప్రత్యేకతలను ప్రసాదించాడు. భూమి నలు మూలలను మక్కా, మదీనా, బైతుల్ మఖ్దిస్ లాంటి పవిత్ర స్థలాలతో పునీతం గావించాడు. రోజుల్లో శుక్రవారానికి, రాత్రుల్లో షబేఖద్ర్‌కు, గ్రంథాల్లో పవిత్ర ఖురానుకు, నెలల్లో రమజాన్ నెలకు, రమజాన్‌లో రోజాలకు ప్రత్యేకతను ప్రసాదించాడు. ఇదేనెలలో పవిత్ర గ్రంథాన్ని అవతరింపజేశాడు. అందుకే రమజాన్ నెల నిస్సందేహంగా మిగతా నెలలన్నిటికంటే అగ్రగామిగా నిలిచింది.

ఇదేవిధంగా, విశ్వాసుల కోసం ప్రత్యేకంగా పవిత్ర రమజాన్ రుతువును ఉనికిలోకి తెచ్చాడు. బుద్ధిమంతులు, తెలివైనవాళ్ళు ఆయా రుతువు (సీజన్) ల ద్వారా లబ్ధిపొందుతారు. మిగతా కాలమంతా చీకూచింత లేకుండా హాయిగా గడిపేస్తారు. ఇదేవిధంగా విశ్వాసులకు రమజాన్ రుతువు భయభక్తుల రుతువు. ఎవరైతే ఈ రుతువు ద్వారా లబ్ధి పొందుతారో వారే మిగతా పదకొండు నెలల కాలం దైవాదేశపాలనలో విలువలతో కూడిన జీవితం గడపగలుగుతారు. ఒక వ్యాపారి మంచి వ్యాపార సీజన్‌లో, ఒకరైతు వ్యవసాయ తరుణంలో ఏమరుపాటుకు లోనై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా నష్టపోతాడో అలాగే విశ్వాసులు కూడా రమజాన్ రుతువును నిర్లక్ష్యం చేస్తే తీవ్రంగా నష్టపోతారు. ఇహపరాల వైఫల్యం మూటగట్టుకుంటారు. నిజానికి ఇది కాస్తంత శ్రమ చేసి అనంతమైన లాభం పొందే తరుణం. ఇంతమంచి శుభతరుణాన్ని పొంది, దానిద్వారా ప్రయోజనం పొందలేనివారు నిజంగానే దురదృష్టవంతులని చెప్పాలి. ఎవరైతే రమజాన్ నెలను పొంది, ఉపవాసాలు పాటించలేదో, పాపక్షమాపణకు ప్రయత్నించలేదో అలాంటి వారిపై దేవుని శాపం విరుచుకు పడుతుందని ప్రవక్త మహనీయులు హెచ్చరించారు. (ముస్తదక్ అల్ హాకిం 7256) అందుకని రమజాన్‌ను గౌరవించాలి. నియమానుసారం ఆరాధనలు చేయాలి. రోజూ ఐదు పూటల నమాజుతో పాటు, రాత్రి 'తరావీహ్'(ఖియాముల్లైల్) ఆచరించాలి. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని భక్తితో పారాయణ చెయ్యాలి. దాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యాలి. ఉన్నంతలోనే వీలైనంత ఎక్కువగా దానధర్మాలు చెయ్యాలి. పిసినారితనం వహించకూడదు. దయాగుణంతో వ్యవహరించాలి.

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం:, 'ముహమ్మద్ ప్రవక్త (స) సహజంగానే మొదటినుండి దానధర్మాలు అధికంగా చేసేవారు. అయితే రమజాన్ నెలలో మరీ ఎక్కువగా చేసేవారు. అంటే, ఇతర రోజులు, ఇతర నెలలతో పోల్చుకుంటే రమజాన్‌లో దానధర్మాలు, సత్కార్యాలు అధికంగా చెయ్యాలని దీనిద్వారా మనకు తెలుస్తోంది.

రమజాన్ వచ్చిందంటే చాలు.. ప్రవక్త వారి ముఖ కవళికలు మారిపొయ్యేవి. ఆరాధనలు అధికమయ్యేవి. అభ్యర్థన, వేడుకోలు, దుఆలలో వినయ వినమ్రతలు ఉట్టిపడేవి.

హదీసులో ఇలా ఉంది: 'రమజాన్ నెలలో దేవుడు సింహాసనం మోసే దైవదూతలతో, మీరు మీ సేవలు, ఆరాధనలు అన్నీ ఆపేసి ఉపవాసం పాటిస్తున్న వారి దుఆలకు ఆమీన్ పలకండి.' అని ఆదేశిస్తాడు. కనుక రమజాన్ ప్రాముఖ్యతను అర్థం చేసుకొని ప్రధాన ఆరాధన అయిన ఉపవాసం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. నఫిల్ లు ఆచరించాలి. తరావీహ్ చెయ్యాలి. దాంతోపాటు దానధర్మాలు అధికంగా చెయ్యాలి. ఉన్నంతలోనే పేదసాదలను ఆదుకోవాలి. పేద బంధువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. సమాజంలో లేమికి గురైన వారిని ఆదరించాలి. వారి కష్టనష్టాలను విచారించాలి. సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి. మొత్తం మీద జీవితాన్ని నిండు మానవీయ విలువలతో గడిపేలా తీర్చిదిద్దడమే రమజాన్ ఉపవాసాల పరమోద్దేశ్యం.


- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్
(23, గురువారం నుంచి రమజాన్ మాసం ఆరంభం)

అమృత బిందువులు

- ఒక్కొక్కసారి కొన్ని అనర్థాల వల్ల నవ్వులు అనే పూలు మాయమౌతాయి. కొన్ని అపార్థాల వల్ల కావాల్సిన వాళ్ళే ఎండిపోయిన ఆకుల్లా వీడిపోతారు. అయినా సరే నిరుత్సాహపడకూడదు. ఏదో రోజు ఆ అనర్థాలు, అపార్థాలు అనే అడ్డుతెరలు తొలగిపోతాయి.
- ఏ నమ్మకంతో నువ్వు ఉదయాన్నే లేస్తావని అలారం పెట్టుకుంటున్నావో, అదే నమ్మకంతో ఏదో ఒక రోజు నీ జీవితం నువ్వు కోరుకున్న విధంగా మారుతుంది అని గట్టిగా నమ్ము. అలా జరగాలంటే నీకు కావాల్సిందల్లా ఓర్పు, సహనం.
- కాలం పెట్టిన సహన పరీక్షలో నువ్వు నెగ్గాలి. ఎందుకంటే మంచి విషయాలు అంత తేలికగా అర్థం కావు. కాబట్టి నీ కర్తవ్యాన్ని పూర్తి చేసి, సహనానికి ఆశ్రయం ఇవ్వు. బద్ధకానికి కాదు.
- నువ్వు త్వరగా లేచినంత మాత్రాన సూర్యుడు ముందుగా ఉదయించడు. దానికి సమయం రావాలి. మనకు సహనం ఉండాలి.

బౌద్ధవాణి

గమ్యం ఉన్న ప్రయాణం



ప్రతి ధర్మం ఏదో ఒక గమ్యాన్ని సూచిస్తుంది. ఆ గమ్యం మనల్ని సురక్షిత ప్రాంతానికి తీసుకుపోవచ్చు. చిక్కుల లోకానికీ చేర్చవచ్చు. ఆకాశాన్ని అందించవచ్చు. పాతాళానికి పల్టీ కొట్టించవచ్చు. కాబట్టి సరైన మార్గాన్ని ఎంచుకోవడం ఎంత ముఖ్యమో, సరైన మార్గదర్శిని ఎంచుకోవడం అంతే ముఖ్యం.

మన జీవితంలో గమ్యాన్ని చేరడానికి ఒకే ఒక్క తిన్నని రహదారి అంటూ ఏదీ ఉండదు. రకరకాల ప్రదేశాల్ని దాటుకుంటూ పోవాలి. ఒక దారి నుండి మరో దారికి మళ్ళాలి. అలాగే ఒక వాహనం దిగి మరో వాహనం ఎక్కాలి. ఇన్ని రకాల ప్రయాణాలు చివరికి మనల్ని గమ్యానికి చేరుస్తాయి.

ఒకసారి బుద్ధుడు రాజగృహ నగరం దగ్గరలో ఉన్న వేణు వనంలో ఉన్నాడు. అక్కడికి ఒకే ప్రాంతానికి చెందిన కొందరు భిక్షువులు వచ్చారు. అప్పుడు బుద్ధుడు వారితో...

''భిక్షువులారా! తాను ఏకాంతంగా ఉంటూ, ఏకాంతాన్ని గురించి, తాను సంతృప్తి చెంది సంతృప్తిని గురించి, తాను ప్రయత్నిస్తూ ప్రయత్నాన్ని గురించి మీకు చెప్పేవారు ఎవరైనా ఉన్నారా?'' అని అడిగారు. అప్పుడు వారు– ''భగవాన్! ఉన్నారు. పుణ్యుడు అనే భిక్షువు'' అని చెప్పారు. వారు పుణ్యుని గురించి అలా చెప్పడం సారిపుత్రుడు విన్నాడు. బౌద్ధ సంఘంలో బుద్ధుని తరువాత స్థానం సారిపుత్రునిదే! బుద్ధుడే స్వయంగా అతణ్ణి ''ధర్మసేనాని'' అని పిలుస్తాడు. ఆ సారిపుత్రుడు స్వయంగా పుణ్యుణ్ణి దర్శించాలనుకున్నాడు.

ఆ సమయంలో పుణ్యుడు శ్రావస్తి నగరం సమీపంలో ఉన్న అంధక వనం లో ఉన్నాడు. బుద్ధుడు కూడా శ్రావస్తిలోని జేతవనానికి రావడంతో సారిపుత్రుడు బుద్ధుని వెంటే వచ్చి, పుణ్యుణ్ణి కలిశాడు. వారి మధ్య గొప్ప ధార్మిక సంభాషణ జరిగింది.

బుద్ధుడు బౌద్ధులకు అంతిమ లక్ష్యంగా చెప్పిన నిర్వాణం గురించి చర్చ వచ్చింది. బ్రహ్మ చర్యాన్ని పాటించేది శీల శుద్ధి కోసమా? చిత్త శుద్ధి కోసమా? దృష్టి శుద్ధి కోసమా? అని అడిగాడు సారిపుత్రుడు. ప్రతి దానికి ''కాదు'' ''కాదు'' అని పలికాడు పుణ్యుడు.

''మరి''? అడిగాడు సారిపుత్రుడు.

''ఒక వ్యక్తి కోసల నుండి సాకేతకు పోవలసి వచ్చింది. అది చాలా దూరం. ఆ రెండు నగరాల మధ్య ఏడు మజిలీలు ఉన్నాయి. కోసలలో గుర్రపు బండిపై బయలుదేరిన వ్యక్తి కొంతసేపటికి మొదటి మజిలీ దగ్గర ఆగి, అక్కడ మరో గుర్రపు బండి ఎక్కుతాడు. అతను అలా ఏడు మజిలీలలో గుర్రాల మీద, బండ్ల మీద, ఇతర ప్రయాణ సాధనాల మీద ప్రయాణం చేసి, చివరికి ఏడో మజిలీ ముగిశాక సాకేత నగరానికి చేరతాడు.

అతని ఈ ప్రయాణం ఒకే ఒక్క గుర్రపు బండి వల్ల పూర్తయిందా? లేదు కదా! అలాగని ఆ ఒక్క గుర్రపు బండి లేకుండానూ పూర్తి కాదు కదా! ఈ ఏడు మజిలీల మధ్య ఏడు ప్రయాణ సాధనాలు ఉన్నాయి. అవన్నీ గమ్యానికి చేరడానికి సహాయపడ్డవే. ప్రతిదీ గమ్యాన్ని చేర్చకపోయినా, గమ్యం చేరడంలో ప్రతిదీ ఒక భాగమే.

అలాగే... తథాగత బుద్ధుడు చెప్పిన నిర్వాణ పథాన్ని అందుకోవడానికి ఆ గమ్యం చేరడానికి బ్రహ్మచర్యం, శీలవిశుద్ధి, చిత్త విశుద్ధి, దృష్టి విశుద్ధి, సంశయ వితరణ విశుద్ధి, మార్గ విశుద్ధి, జ్ఞాన విశుద్ధి అన్నీ సాధనాలే!'' అని చెప్పాడు.

ఇంత తేలికగా చక్కని ఉపమానం ద్వారా తేటపరచిన పుణ్యుని ప్రతిభకు సారిపుత్రుడు సంతోషపడ్డాడు.

- బొర్రా గోవర్ధన్

మంచి మాట

జీవన స్పృహ

స్పృహ అనేది ప్రాణం ఉన్న ప్రతిమనిషికీ ఉండాల్సిన వాటిల్లో అతిముఖ్యమైంది. స్పృహ ఉండాలన్న స్పృహ కూడా లేని వాళ్లు ఉన్నారు. మనిషి ఏ పరిస్థితిలోనూ ఏ రకమైన మత్తుకూ లోనుకాకూడదు. ఏ రకమైన మత్తుకూ మనిషి చిత్తై పోకూడదు. కొన్ని సందర్భాల్లో మనిషిని నిస్పృహ ఆవరిస్తూ ఉంటుంది. దానికి కొనసాగింపుగా నిస్తేజం పట్టి పీడిస్తూ మనిషిని అదిమేస్తూ ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లోంచి మనిషి తెప్పరిల్లి తేరుకోగలగాలి. అందుకు స్పృహ అనేది తప్పకుండా ఉండాలి. స్పృహతో నిస్తేజాన్ని నిశ్వాసిస్తూ ఉత్తేజాన్ని ఉచ్ఛ్వాసిస్తూ ఉండాలి; సత్తేజంతో ఉండాలి.

మనిషిలో లేదా మనిషికి తప్పకుండా ఉండాల్సింది స్పృహ. స్పృహ అన్నది లేకుండా పోతే మనిషి తన నుంచి తాను తప్పిపోతాడు; మనిషి తనకు తాను కాకుండా పోతాడు. ఒక మనిషి తన జీవనోపాధిని కోల్పోవచ్చు, తన ఆస్తుల్ని కోల్పోవచ్చు, తనవి అన్నవాటిని అన్నిటిని ఒక మనిషి కోల్పోవచ్చు కానీ స్పృహను మాత్రం కోల్పోకూడదు. దేన్ని అయినా వదులుకోవచ్చు కానీ స్పృహను వదులుకోకూడదు. మనిషికి ఏదైనా లేకుండా పోవచ్చు కానీ స్పృహ లేకుండా పోకూడదు. తనకు తాను ఉన్నంత వరకూ, తనలో రక్తం పారుతున్నంత వరకూ మనిషికి స్పృహ ఉండాలి. మనిషి రక్తంలో స్పృహ పారుతూ ఉండాలి. మనిషిలో రక్తంలా స్పృహ ప్రవహిస్తూ ఉండాలి. తనలో స్పృహ ప్రవహిస్తూ ఉంటేనే మనిషి జీవితంలోకి ప్రయాణం చేస్తూ ఉండగలడు.

స్పృహ మనిషికి స్వేచ్ఛను ఇస్తుంది. స్పృహ వల్ల మనిషికి బయటా, లోపలా చలనం కలుగుతుంది. ఆ చలనం గతికి, ప్రగతికి కారణం అవుతుంది. స్పృహ లేనప్పుడు మనిషికి ఏదీ అందదు, మనిషివల్ల ఏదీ జరగదు. స్పృహ లేకపోతే మనిషికి గతి, ప్రగతి ఉండవు.

'జీవితం నిన్ను బలపరిచేందుకు సిద్ధంగా ఉంది; అందుకు ముందు నువ్వు జీవితానికి తలుపు తెరిచి ఉంచాలి' అని జర్మన్ తాత్వికుడు ఎక్‌హార్ట్ టోల్ తెలియజెప్పారు. స్పృహ ఉన్నప్పుడు మాత్రమే మనం జీవితానికి తలుపు తెరిచి ఉంచగలం. లేదా మనకు ఉన్న స్పృహ మాత్రమే జీవితానికి తలుపు తెరిచి ఉంచగలదు. మత్తు జీవితాన్ని మూసేస్తుంది. మన మత్తును మనం వదిలించుకోవాలి. మనల్ని మన జీవితం బలపరచాలంటే మనకు స్పృహ కావాలి. ఎక్‌హార్ట్ టోల్ స్పృహ విషయంలో ఇంకా ఇలా స్పష్టతను ఇచ్చారు, 'మనకు కలిగే ఆలోచనను స్పృహ అని అనుకోవడం తప్పు. ఆలోచన, స్పృహ పర్యాయపదాలు కావు. ఆలోచన అనేది స్పృహలోని ఒక చిన్న క్రియారూపం మాత్రమే. స్పృహ లేకుండా ఆలోచన ఉనికిలో ఉండదు; కానీ స్పృహకు ఆలోచన అవసరం ఉండదు'. మనం స్పృహ తోనే జీవనం చెయ్యాలి. మనకు ముందు కొందరికైనా సామాజిక స్పృహ ఉండి ఉండబట్టే ఇవాళ సమాజం ఉంది. సంగీతం, సాహిత్యం, ఇతర కళలపై స్పృహ ఉన్న కొందరివల్ల అవి చలామణిలో ఉన్నాయి. విద్య, వృత్తులు, పరిశోధనలు వంటివాటిపై మనకు పూర్వం ఉన్నవాళ్లకు స్పృహ ఉండబట్టే మనం మనుగడ చెయ్యగలుగుతున్నాం.

స్పృహలేని మనిషి ఊపిరితో ఉన్న రాయి . మనం స్పృహతో మనుగడ చేద్దాం. రాళ్లల్లా కాదు మనుషులమై బతుకుదాం.

- శ్రీకాంత్ జయంతి



సినిమా

సంక్రాంతి బరిలో?



మహేశ్ బాబు

హీరో మహేశ్ బాబు నటిస్తున్న తాజా చిత్రం సంక్రాంతికి బాక్సాఫీస్ బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయనే టాక్ టాలీవుడ్‌లో లేటెస్ట్‌గా వినిపిస్తోంది. 'అతడు', 'ఖలేజా' తర్వాత మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో పూజాహెగ్డే హీరోయిన్. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. మహేశ్‌బాబు, మలయాళ నటుడు జయరామ్‌లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు తెలిసింది. కాగా ఈ సినిమాకి 'అడవిలో అర్జునుడు', 'ఆమె కథ', 'అమ్మ కథ' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. అయితే ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 22న ఈ మూవీ టైటిల్‌ను అధికారికంగా రిలీజ్ చేయాలనే యోచనలో ఉన్నారట మేకర్స్. అలాగే ఈ మూవీని గతంలో దసరా సందర్భంగా రిలీజ్ చేయాలనుకున్నారు. అయితే తాజాగా సంక్రాంతికి రిలీజ్ చేసే ఆలోచనలో ఉందట యూనిట్. కాగా ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

సెప్టెంబరులో స్టార్ట్



రామ్‌చరణ్

హీరో రామ్‌చరణ్, 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబరులో స్టార్ట్ కానుంది. ''రంగస్థలం' సినిమాలో నేను చేసిన చిట్టిబాబు పాత్రని మించి ఈ సినిమాలో నా క్యారెక్టరైజేషన్ ఉంటుంది. ఈ సినిమా షూటింగ్‌ను సెప్టెంబరులో స్టార్ట్ చేస్తాం'' అంటూ ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో రామ్‌చరణ్ అన్నారు. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం మృణాళ్ ఠాకూర్ పేరు ప్రచారంలోకి వచ్చింది. కాగా ప్రస్తుతం శంకర్ దర్శకత్వం వహిస్తున్న సినిమాతో రామ్‌చరణ్ బిజీగా ఉన్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానుందని ఫిల్మ్‌నగర్ టాక్.

అప్పుడు కన్నీళ్లొచ్చాయి
- కృష్ణవంశీ



కాలిపు మధు, కృష్ణ వంశీ, రాహుల్ సిప్లిగంజ్

''రంగమార్తాండ' సినిమా ప్రీమియర్ చూసిన తర్వాత ఒక చిన్నారి నా వద్దకు వచ్చి, 'నేను మా అమ్మానాన్నలను బాగా చూసుకుంటాను' అని చెప్పడం విశేషం. ప్రతిఒక్కరూ తమ తల్లితండ్రులతో కలిసి ఈ సినిమాను చూడాలి'' అని డైరెక్టర్ కృష్ణవంశీ అన్నారు. ప్రకాష్ రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో రాహుల్ సిప్లిగంజ్, శివాత్మిక జంటగా నటించిన చిత్రం 'రంగమార్తాండ'. హౌస్‌ఫుల్ మూవీస్, రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై కాలిపు మధు, ఎస్. వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఉగాది కానుకగా ఈ నెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో చిత్ర దర్శకుడు కృష్ణవంశీ మాట్లాడుతూ–''రంగమార్తాండ' సినిమాకి ప్రకాష్ రాజ్, బ్రహ్మానందం, రమ్యకృష్ణల అద్భుతమైన నటన, ఇళయరాజాగారి సంగీతం, 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారి సాహిత్యం.. ఇలా అన్నీ అద్భుతంగా కుదిరాయి. రమ్యకృష్ణ కళ్లు చాలా పవర్‌ఫుల్‌గా ఉంటాయి. దీంతో ఎలాంటి పెద్ద డైలాగులు లేకుండా కళ్లతోనే నటించాలని చెప్పినప్పుడు తను సరేనంది. ఈ మూవీ క్లైమాక్స్‌లో రమ్యకృష్ణపై సన్నివేశాలు తీసేటప్పుడు చాలా బాధపడ్డాను. దాదాపు 36 గంటల పాటు ఈ సీన్స్ తీశాను. అప్పుడు నాకు సెంటిమెంట్ అడ్డొచ్చింది.. చిత్రీకరిస్తుంటే కంట్లో నుంచి నాకు నీళ్లు వస్తూనే ఉన్నాయి'' అన్నారు. ''కృష్ణవంశీగారి దర్శకత్వంలో 'రంగమార్తాండ' వంటి మంచి సినిమా చేయడం నా అదృష్టం'' అన్నారు సింగర్, నటుడు రాహుల్ సిప్లిగంజ్.

యాక్షన్ ఎంటర్‌టైనర్ షురూ



విశ్వక్ సేన్, మీనాక్షీ చౌదరి

విశ్వక్ సేన్ హీరోగా కొత్త సినిమా (వీఎస్10 వర్కింగ్ టైటిల్) షురూ అయింది. ఈ చిత్రం ద్వారా రవితేజ ముళ్లపూడి దర్శకునిగా పరిచయమవుతున్నారు. మీనాక్షీ చౌదరి హీరోయిన్. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ సినిమా ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి రచయిత, దర్శకుడు వక్కంతం వంశీ... రచయిత, దర్శకుడు మచ్చ రవి కెమెరా స్విచ్చాన్ చేయగా, రామ్ తాళ్లూరి సతీమణి రజనీ క్లాప్ ఇచ్చారు. రవితేజ ముళ్లపూడి తొలి షాట్‌కి దర్శకత్వం వహించగా, రామ్ తాళ్లూరి స్క్రిప్ట్‌ను డైరెక్టర్‌కి అందించారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''రామ్ తాళ్లూరిగారు నాకు ఇష్టమైన నిర్మాత. ఇది నా పదో చిత్రం. కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఏప్రిల్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు. ''నాకు అవకాశం ఇచ్చిన విశ్వక్ సేన్, రామ్ తాళ్లూరిగార్లకు కృతజ్ఞతలు'' అన్నారు రవితేజ ముళ్లపూడి. ''ఈ సినిమా ప్రేక్షకులు, విశ్వక్‌గారి అభిమానుల అంచనాలకు తగ్గకుండా ఉంటుంది'' అన్నారు రామ్ తాళ్లూరి. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మనోజ్ కాటసాని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: సత్యం రాజేష్, విద్యాసాగర్. జె.

నాందిలా ఉగ్రంని హిట్ చేయాలి
- 'అల్లరి' నరేష్



అల్లరి నరేష్, మీర్నా మీనన్

''ఉగ్రం' సినిమాని ఎక్కడా రాజీ పడకుండా నిర్మించిన సాహు, హరీష్‌గార్లకు థ్యాంక్స్. నా కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో రూపొందిన చిత్రమిది. వేసవిలో మీ ముందుకు వస్తోంది. విజయ్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'నాంది' మూవీని హిట్ చేసినట్టు 'ఉగ్రం'ని కూడా పెద్ద హిట్ చేయాలి'' అని హీరో 'అల్లరి' నరేష్ అన్నారు. 'నాంది' ఫేమ్ విజయ్ కనకమేడల దర్శకత్వంలో 'అల్లరి' నరేష్, మీర్నా మీనన్ జంటగా రూపొందిన చిత్రం 'ఉగ్రం'. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ మూవీ వేసవిలో విడుదల కానుంది. శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'దేవేరి..' అంటూ సాగే పాటను హైదరాబాద్‌లో విడుదల చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. విజయ్ కనకమేడల మాట్లాడుతూ– ''నరేష్‌గారి కెరీర్‌లో 'ఉగ్రం' మరో వైవిధ్యమైన సినిమా అవుతుంది. శ్రీచరణ్ అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చారు'' అన్నారు. ఈ వేడుకలో మీర్నా మీనన్, శ్రీచరణ్ పాకాల, సాహు గారపాటి, హరీష్ పెద్ది తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్.

అలా ముందుకెళ్లడమే!
- జాన్వీకపూర్



''సినిమా నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించినందుకు చాలా సంతోషంగా ఉంది. నటిగా నా కెరీర్ ప్రారంభంలోనే ఇండస్ట్రీ, ప్రేక్షకుల నుంచి నాకు ఇంత మంచి గుర్తింపు లభిస్తున్నది నా తల్లిదండ్రుల వల్లేనని(బోనీకపూర్, శ్రీదేవి) నాకు తెలుసు. వీరి వారసత్వాన్ని కొనసాగించడానికి నా వంతుగా చాలా కష్టపడుతున్నాను'' అంటున్నారు హీరోయిన్ జాన్వీకపూర్. ఢిల్లీలో ఇటీవల జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న జాన్వీకపూర్ మాట్లాడుతూ– ''ఆడియన్స్ అటెన్షన్‌ను అందురూ కోరుకుంటారు. ఓ నటిగా, సెలబ్రిటీగా నేనూ కోరుకుంటాను. కానీ, వారు నా వర్క్ గురించి మాట్లాడుకుంటున్నప్పుడు నాకు చాలా ఆనందంగా ఉంటుంది. జిమ్‌కు నేను ఎలాంటి దుస్తులు ధరించి వెళ్లాలనే విషయంపై కొందరు చర్చించుకోవడం సరికాదు. అయినా పబ్లిక్ లైఫ్‌లో ఉన్నప్పుడు మన గురించి పలురకాల అభిప్రాయాలు వినిపిస్తుంటాయి. వాటి గురించి అతిగా ఆలోచించుకోవాల్సిన అవసరం లేదు. మన పని మనం చేసుకుంటూ ముందుకు వెళ్లడమే'' అన్నారు. అలాగే ఎన్టీఆర్ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్న విషయం గురించి జాన్వీ మాట్లాడుతూ– ''ఎన్టీఆర్‌గారితో స్క్రీన్ షేర్ చేసుకోవాలన్న నా కల నిజమైంది. సెట్స్‌లోకి ఎప్పుడెప్పుడు వెళ్దామా? అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు.

ఉగాదికి థ్రిల్



కాజల్

హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఈ ఉగాదికి ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచేందుకు సిద్ధమయ్యారు. కళ్యాణ్ దర్శకత్వంలో కాజల్ అగర్వాల్, రాధికా శరత్ కుమార్, యోగిబాబు ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'ఘోస్టి'. ఈ నెల 17న విడుదలైన ఈ చిత్రాన్ని 'కోస్టి' పేరుతో గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ నెల 22న తెలుగులో విడుదల చేస్తోంది. ''హారర్ కామెడీగా రూపొందిన చిత్రం 'కోస్టి'. ఇందులో తండ్రి, కుమార్తె మధ్య అనుబంధంతో పాటు థ్రిల్ అంశాలు కూడా ఉన్నాయి. ఆడియన్స్ ఉలిక్కిపడే సన్నివేశాలు చాలా ఉన్నాయి. ఇన్‌స్పెక్టర్ ఆరతి పాత్రలో కాజల్ బాగా నటించారు. గ్యాంగ్‌స్టర్ దాస్‌గా దర్శకుడు కేఎస్ రవికుమార్ చేశారు. సామ్ సీఎస్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ఉగాదికి తెలుగు ప్రేక్షకులకు మంచి వినోదం అందించే చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది.


మాఫియా నేపథ్యంలో...



ఇమ్మోర్టల్, పూజ, కట్ల డాండీ

కట్ల ఇమ్మోర్టల్, కట్ల డాండి హీరోలుగా, పూజ నాగేశ్వర్ హీరోయిన్‌గా కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. సంపత్ కుమార్ దర్శకత్వంలో ఎస్ఆర్‌కే ప్రొడక్షన్స్‌పై శ్రీనివాస రెడ్డి కర్రి నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నటి కవిత కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు సుమన్ క్లాప్ కొట్టగా, స్వామి నాయుడు గౌరవ దర్శకత్వం వహించారు. ''మాఫియా నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం ఇది'' అన్నారు సంపత్ కుమార్. ఈ చిత్రానికి కెమెరా, సంగీతం, స్క్రీన్‌ప్లే: కె.రాజేంద్ర ప్రసాద్.

విదేశాలకు కాంతార



రిషబ్‌శెట్టి

భారతీయ ప్రేక్షకులను ఆకట్టుకున్న 'కాంతార' చిత్రం ఇప్పుడు విదేశీ ఆడియన్స్‌ని అలరించేందుకు సిద్ధం అవుతోంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'కాంతార'. సప్తమి గౌడ హీరోయిన్. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది సెప్టెంబరు 30న కన్నడలో విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత తెలుగు, తమిళం, హిందీ.. ఇలా ఇతర భాషల్లో కూడా రిలీజ్ చేశారు. సుమారు 20కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం దాదాపు 450 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ విశ్లేషకుల లెక్కలు చెబుతున్నాయి. తాజాగా ఈ మూవీని విదేశాల్లో కూడా రిలీజ్ చేయాలని చిత్రయూనిట్ నిర్ణయించుకుంది. స్పానిష్, ఇటాలియన్ భాషల్లో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయని, థియేటర్స్‌లోనే విడుదల చేస్తామని చిత్రబృందం వెల్లడించింది.

స్పోర్ట్స్



షై హోప్ సెంచరీ: విండీస్ విజయం

దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్ 48 పరుగుల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి వన్డే వర్షం కారణంగా రద్దయింది. ఈస్ట్ లండన్‌లో జరిగిన రెండో వన్డేలో కెప్టెన్ షై హోప్ (115 బంతుల్లో 128 నాటౌట్; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేశాడు. దాంతో తొలుత విండీస్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 338 పరుగులు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా 41.4 ఓవర్లలో 287 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బవూమా (118 బంతుల్లో 144 ; 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) వీరోచిత సెంచరీ వృథా అయింది.



కివీస్ బౌలర్ల విజృంభణ... ఫాలోఆన్‌లో శ్రీలంక


న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ శ్రీలంక పరాజయం దిశగా పయనిస్తోంది. 416 పరుగులతో వెనుకబడి ఫాలోఆన్ ఆడుతున్న శ్రీలంక మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. లంక మరో 303 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 580/4కు జవాబుగా తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక 164 పరుగులకు ఆలౌటైంది. హెన్రీ (3/44), బ్రేస్‌వెల్ (3/50) లంకను దెబ్బ తీశారు.

ఆసీస్ పేస్‌కు భారత్ బోల్తా



గిల్ రోహిత్ సూర్య రాహుల్

రెండు రోజులుగా కురిసిన వర్షాలతో మ్యాచ్ జరుగుతుందా లేదా అనే సందేహం... తీరా మ్యాచ్ సమయానికి వరుణుడు కూడా కరుణించడంతో ... నిర్ణీత సమయానికే ఆట ప్రారంభం... ఇక పరుగుల విందు ఖాయమని అభిమానులు ఆశగా ఎదురుచూస్తుండగా... పిచ్‌పై ఉన్న తేమను సద్వినియోగం చేసుకున్న ఆసీస్ పేస్ బౌలర్లు మిచెల్ స్టార్క్, సీన్ అబాట్, నాథన్ ఎలిస్ నిప్పులు చెరిగే బంతులతో భారత బ్యాటర్లను బెంబేలెత్తించారు. స్టార్క్ స్వింగ్ బౌలింగ్‌కు భారత స్టార్ బ్యాటర్లు గిల్, రోహిత్, రాహుల్, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా ఇలా వచ్చి అలా వెళ్లారు. దాంతో టీమిండియా 117 పరుగులకే కుప్పకూలింది. అనంతరం ఆసీస్ ఓపెనర్లు మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. భారత బ్యాటర్లు చేతులెత్తేసిన పిచ్‌పై ఆసీస్ ఓపెనర్లు అదరగొట్టి 11 ఓవర్లలోనే తమ జట్టుకు విజయాన్ని అందించారు.



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ స్టార్క్ (5/53)

- రెండో వన్డేలో టీమిండియా పరాజయం
- 10 వికెట్లతో ఆస్ట్రేలియా ఘనవిజయం
- 5 వికెట్లతో మెరిసిన స్టార్క్
- అబాట్‌కు 3, ఎలిస్‌కు 2 వికెట్లు
- 117 పరుగులకే కుప్పకూలిన భారత్
- 11 ఓవర్లలోనే ఆసీస్ లక్ష్య ఛేదన
- బుధవారం చెన్నైలో మూడో వన్డే

234 రెండో వన్డేలో ఆసీస్ విజయం పూర్తయిన సమయానికి మిగిలి ఉన్న బంతులు. మిగిలి ఉన్న బంతుల పరంగా వన్డేల్లో భారత్‌కిదే అతిపెద్ద ఓటమి.

2 స్వదేశంలో భారత్ ఓ వన్డేలో 10 వికెట్ల తేడాతో ఓడిపోవడం ఇది రెండోసారి మాత్రమే. 2020లో ముంబైలో ఆసీస్ చేతిలోనే భారత్ తొలిసారి 10 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది.

2 స్వదేశంలో భారత జట్టు మొత్తం 10 వికెట్లను పేసర్లకే కోల్పోవడం ఇది రెండోసారి. 2009లో గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ పేస్ బౌలర్లు (బొలింగర్ 5, మిచెల్ జాన్సన్ 3, వాట్సన్ 2 వికెట్లు) ఈ ఘనత సాధించారు.


సాక్షి, విశాఖపట్నం: సిరీస్‌లో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 26 ఓవర్లలో కేవలం 117 పరుగులకే ఆలౌటైంది. ఆసీస్ పేసర్లు మిచెల్ స్టార్క్ (5/53), సీన్ అబాట్ (3/23), నాథన్ ఎలిస్ (2/13) తమ స్వింగ్ బౌలింగ్‌తో భారత్‌ను దెబ్బ కొట్టారు. భారత ఇన్నింగ్స్‌లో కోహ్లి (35 బంతుల్లో 31; 4 ఫోర్లు) టాప్ స్కోరర్‌కాగా... రోహిత్ శర్మ (15 బంతుల్లో 13; 2 ఫోర్లు), రవీంద్ర జడేజా (39 బంతుల్లో 16; 1 ఫోర్), అక్షర్ పటేల్ (29 బంతుల్లో 29 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మాత్రమే రెండంకెల స్కోరును దాటారు. అనంతరం ఆస్ట్రేలియా ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. 11 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 121 పరుగులు సాధించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (30 బంతుల్లో 51 నాటౌట్; 10 ఫోర్లు), మిచెల్ మార్ష్ (36 బంతుల్లో 66 నాటౌట్; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) అలరించారు. స్టార్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ప్రస్తుతం రెండు జట్లు 1–1తో సమంగా ఉండగా... సిరీస్‌లోని చివరిదైన మూడో వన్డే ఈనెల 22న చెన్నైలో జరుగుతుంది.

సూర్యకుమార్ మళ్లీ విఫలం...

బ్యాటింగ్‌కు స్వర్గధామంగా ఉన్న విశాఖ పిచ్‌పై భారత బ్యాటర్లు తడబడ్డారు. పిచ్‌పై ఉన్న తేమను ఆసీస్ పేసర్ స్టార్క్ సద్వినియోగం చేసుకున్నాడు. స్వింగ్‌తోపాటు కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడంతో భారత బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. స్టార్క్ బౌలింగ్‌లో గిల్, రోహిత్ వికెట్లకు దూరంగా వెళ్తున్న బంతులను ఆడి అవుటయ్యారు. సూర్యకుమార్ యాదవ్ వరుసగా రెండో వన్డేలోనూ స్టార్క్ బౌలింగ్‌లో తొలి బంతికే ఎల్బీడబ్ల్యూగా అవుటయ్యాడు. ఆ తర్వాత రాహుల్, హార్దిక్, కోహ్లి, జడేజా కూడా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయారు. అబాట్ వేసిన ఇన్నింగ్స్ పదో ఓవర్లో హార్దిక్ పాండ్యా (1) షాట్ ఆడతా... స్టీవ్ స్మిత్ స్లిప్‌లో తన కుడి వైపునకు గాల్లో అమాంతం డైవ్ చేస్తూ తీసుకున్న క్యాచ్ హైలైట్‌గా నిలిచింది.

ధనాధన్ ఆట...

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్‌కు ఓపెనర్లు హెడ్, మార్ష్ శుభారంభం ఇచ్చారు. వీరిద్దరు భారత బౌలర్లపై ఎదురుదాడి చేశారు. ముఖ్యంగా మార్ష్ చెలరేగిపోయాడు. షమీ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో మార్ష్ 2 సిక్స్‌లు, 1 ఫోర్ కొట్టగా...



మెరుపు ఇన్నింగ్స్ ఆడిన మిచెల్ మార్ష్, హెడ్

సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో హెడ్ వరుసగా నాలుగు ఫోర్లు బాదాడు. అనంతరం హార్దిక్ వేసిన ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్లో మార్ష్ 3 సిక్స్‌లతో అలరించాడు. దాంతో ఆసీస్ 8 ఓవర్లలో 90 పరుగులు సాధించింది. ఆ తర్వాతా ఇదే జోరు కొనసాగించి ఆసీస్ 11 ఓవర్లలో లక్ష్యాన్ని అందుకుంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) స్మిత్ (బి) స్టార్క్ 13; శుబ్‌మన్ గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 0; విరాట్ కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) ఎలిస్ 31; సూర్యకుమార్ యాదవ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) స్టార్క్ 0; కేఎల్ రాహుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) స్టార్క్ 9; హార్దిక్ పాండ్యా (సి) స్మిత్ (బి) అబాట్ 1; రవీంద్ర జడేజా (సి) క్యారీ (బి) ఎలిస్ 16; అక్షర్ పటేల్ (నాటౌట్) 29; కుల్దీప్ యాదవ్ (సి) హెడ్ (బి) అబాట్ 4; షమీ (సి) క్యారీ (బి) అబాట్ 0; సిరాజ్ (బి) స్టార్క్ 0; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం** (26 ఓవర్లలో ఆలౌట్) 117. **వికెట్ల పతనం:** 1–3, 2–32, 3–32, 4–48, 5–49, 6–71, 7–91, 8–103, 9–103, 10–117. **బౌలింగ్:** మిచెల్ స్టార్క్ 8–1–53–5, కామెరాన్ గ్రీన్ 5–0–20–0, సీన్ అబాట్ 6–0–23–3, నాథన్ ఎలిస్ 5–0–13–2, ఆడమ్ జంపా 2–0–6–0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: ట్రావిస్ హెడ్ (నాటౌట్) 51; మిచెల్ మార్ష్ (నాటౌట్) 66; ఎక్స్‌ట్రాలు 4, **మొత్తం** (11 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 121. **బౌలింగ్:** షమీ 3–0–29–0, సిరాజ్ 3–0–37–0, అక్షర్ పటేల్ 3–0–25–0, హార్దిక్ పాండ్యా 1–0–18–0, కుల్దీప్ యాదవ్ 1–0–12–0.

బోపన్న కొత్త చరిత్ర...

- ఏటీపీ మాస్టర్స్ టైటిల్ నెగ్గిన పెద్ద వయస్కుడిగా రికార్డు
- ఎబ్డెన్‌తో కలిసి ఇండియన్ వెల్స్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ హస్తగతం
- ఫైనల్లో టాప్ సీడ్ జోడీపై గెలుపు
- రూ. 3 కోట్ల 60 లక్షల ప్రైజ్‌మనీ సొంతం



విన్నర్స్ ట్రోఫీతో బోపన్న–ఎబ్డెన్ జోడీ

కాలిఫోర్నియా: నాలుగు పదుల వయసు దాటినా తనలో సత్తా తగ్గలేదని భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న మరోసారి నిరూపించుకున్నాడు. ఇండియన్ వెల్స్ ఓపెన్ ఏటీపీ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో తన భాగస్వామి మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి బోపన్న పురుషుల డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–3, 2–6, 10–8తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ వెస్లీ కూల్‌హాఫ్ (నెదర్లాండ్స్)–నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జోడీని ఓడించింది. ఈ గెలుపుతో 43 ఏళ్ల బోపన్న ఏటీపీ మాస్టర్స్ సిరీస్ టైటిల్ నెగ్గిన పెద్ద వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. డానియల్ నెస్టర్ (కెనడా) పేరిట ఉన్న రికార్డును బోపన్న బద్దలు కొట్టాడు. 2015లో నెస్టర్ 42 ఏళ్ల వయసులో సిన్సినాటి మాస్టర్స్ సిరీస్ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు.

గంటా 24 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో బోపన్న ద్వయం తొమ్మిది ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. విజేతగా నిలిచిన బోపన్న–ఎబ్డెన్ జోడీకి 4,36,730 డాలర్ల (రూ. 3 కోట్ల 60 లక్షలు) ప్రైజ్‌మనీ, 1000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ వెస్లీ కూల్‌హాఫ్–నీల్ స్కుప్‌స్కీ జంటకు 2,31,660 డాలర్ల (రూ. 1 కోటీ 91 లక్షలు) ప్రైజ్‌మనీ, 600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

5 బోపన్న కెరీర్‌లో ఇది ఐదో మాస్టర్స్ సిరీస్ టైటిల్. గతంలో అతను మోంటెకార్లో (2017లో), మాడ్రిడ్ (2015లో), పారిస్ ఓపెన్ (2012, 2011లో) మాస్టర్స్ సిరీస్ టైటిల్స్ సాధించాడు. మరో ఐదు మాస్టర్స్ సిరీస్ టోర్నీలలో రన్నరప్‌గా నిలిచాడు.

24 బోపన్న కెరీర్‌లో ఇది 24వ డబుల్స్ టైటిల్. ఈ ఏడాది రెండోది. ఈ సీజన్‌లో ఎబ్డెన్‌తోనే కలిసి బోపన్న దోహా ఓపెన్‌లో విజేతగా నిలిచాడు.

"ఈ విజయం ఎంతో ప్రత్యేకం. ఇండియన్ వెల్స్ టోర్నీకి టెన్నిస్ స్వర్గధామం అని పేరు ఉంది. ఎన్నో ఏళ్లుగా నేను ఈ టోర్నీలో ఆడుతున్నాను. విజేతలెందరినో చూశాను. ఈసారి నేను చాంపియన్‌గా నిలిచినందుకు ఆనందంగా ఉంది. –రోహన్ బోపన్న

ప్రిక్వార్టర్ ఫైనల్లో నిఖత్



న్యూఢిల్లీ: ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు తమ ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారు. ఆదివారం బరిలోకి దిగిన ఇద్దరు భారత బాక్సర్లు నిఖత్ జరీన్ (50 కేజీలు), మనీషా మౌన్ (57 కేజీలు) తమ ప్రత్యర్థులపై ఏకపక్ష విజయాలు నమోదు చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన తెలంగాణకు చెందిన నిఖత్ జరీన్ రెండో రౌండ్ బౌట్‌లో 5–0తో ఆఫ్రికా చాంపియన్ బూఆలమ్ రుమేసా (అల్జీరియా)ను ఓడించగా... మనీషా 5–0తో రహీమి టీనా (ఆస్ట్రేలియా)పై గెలిచింది.

అక్షదీప్ సింగ్‌కు స్వర్ణం



నోమి (జపాన్): ఆసియా 20 కిలోమీటర్ల రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ అక్షదీప్ సింగ్ 1 గంట 20 నిమిషాల 57 సెకన్లలో గమ్యానికి చేరి స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఓపెన్ కేటగిరీలో పోటీపడిన భారత అథ్లెట్లు వికాష్ సింగ్, పరమ్‌జీత్ ఈ ఏడాది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు, పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందారు. ప్రపంచ చాంపియన్‌షిప్, పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయం 1 గంట 20 నిమిషాల 10 సెకన్లను వికాష్ (1గం:20ని :05 సెకన్లు), పరమ్‌జీత్ (1గం: 20:08 సెకన్లు) అందుకున్నారు. నిబంధనల ప్రకారం ఓపెన్ కేటగిరీలో పోటీపడిన వారి సమయాన్ని పతకాల కోసం పరిగణనలోకి తీసుకోరు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో 195 ఎస్ఎంఎస్, ఎస్‌టీవో పోస్టులు

న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఏఎస్ఆర్‌బీ).. దేశవ్యాప్తంగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలు, వివిధ వ్యవసాయ, పశు, మత్స్య పరిశోధనా కేంద్రాల్లో సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్(ఎస్ఎంఎస్), సీనియర్ టెక్నికల్ ఆఫీసర్(ఎస్‌టీవో)పోస్టుల భర్తీతోపాటు జాతీయ అర్హత పరీక్ష(నెట్)–2023 నిర్వహణకు సంబంధించి ప్రకటనను విడుదలచేసింది. » మొత్తం పోస్టుల సంఖ్య: 195

» పోస్టుల వివరాలు: సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్(ఎస్ఎంఎస్)–163, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్(ఎస్‌టీవో)–32.
» అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 10.04.2023 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. నెట్‌కు సంబంధించి 01.01.2023 నాటికి అభ్యర్థి 21 ఏళ్ల నిండి ఉండాలి. దీనికి గరిష్ఠ వయోపరిమితి లేదు.
» వేతనం:నెలకు ఎస్ఎంఎస్, ఎస్‌టీవో పోస్టులకు రూ.56,100 నుంచి రూ.1,77,500 ఉంటుంది.
» నెట్, ఎస్ఎంఎస్, ఎస్‌టీవో–2023 ఉత్తీర్ణత మార్కులు: యూఆర్ అభ్యర్థులకు 75.0(50%), ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ 67.5(45%), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు 60.0(40%).
» ఎంపిక విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 22.03.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.04.2023.
» ఆన్‌లైన్ పరీక్ష తేది: 26.04.2023 నుంచి 30.04.2023 వరకు
» వెబ్‌సైట్: www.asrb.org.in

ఐఐఎస్సీ, బెంగళూరులో బీఎస్సీ(రీసెర్చ్) కోర్సులో ప్రవేశాలు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ(రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు: బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఇన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మ్యాథ్స్, ఫిజిక్స్.
» అర్హత: 60శాతం మార్కులతో 2022లో 10+2/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా) తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పరీక్షకు హాజరయ్యేవారు కూడా అర్హులే.
» ఎంపిక విధానం: కేవీపీవై–2021/జేఈఈ మెయిన్–2023/జేఈఈ అడ్వాన్స్‌డ్–2023/నీట్(యూజీ)–2023/ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2023 స్కోరు ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.05.2023.
» వెబ్‌సైట్: www.iisc.ac.in

నిట్ వరంగల్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్.. తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్(కెమికల్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్/మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. » ప్రాజెక్ట్ కాల వ్యవధి:3 ఏళ్లు
» వేతనం: నెలకు రూ.31,000 నుంచి రూ.35,000 చెల్లిస్తారు.
» దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: pvsuresh@nitw.ac.in
» దరఖాస్తులకు చివరితేది: 27.03.2023.
» వెబ్‌సైట్: www.nitw.ac.in

నిట్ వరంగల్‌లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోలు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్.. తాత్కాలిక ప్రాతిపదికన పోస్ట్ డాక్టోరల్ ఫెలోల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: పీహెచ్‌డీ(అయానిక్ లిక్విడ్ సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్/ఎనర్జీ స్టోరేజ్ డివైజెస్).
» ప్రాజెక్ట్ వ్యవధి: 2 ఏళ్లు.
» వేతనం: నెలకు రూ.70,000 చెల్లిస్తారు.
» దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: manohar@nitw.ac.in
» దరఖాస్తులకు చివరితేది: 20.03.2023.
» వెబ్‌సైట్: www.nitw.ac.in

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్.. తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ అసిస్టెంట్–ఎ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 03
» అర్హత: పీజీ(సోషల్ సైన్సెస్)తో పాటు రూరల్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఏరియాలో రెండేళ్ల అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు రూ.22,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.03.2023.
» వెబ్‌సైట్: www.nirdpr.in

కేంద్ర ప్రభుత్వ కొలువుల స్వాగతం

» 5,369 పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్
» గ్రూప్–సి, గ్రూప్–డి, మల్టీ టాస్కింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» డిగ్రీ, ఇంటర్, పదో తరగతి అర్హతతో దరఖాస్తుకు అవకాశం
» రాత పరీక్ష, స్కిల్ టెస్ట్‌లలో మెరిట్ ఆధారంగా నియామకాలు

కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో.. ఉద్యోగ అవకాశం స్వాగతం పలుకుతోంది! జాతీయ స్థాయిలో.. అతి పెద్ద నియామక సంస్థగా పేరొందిన.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్సీ).. 5,369 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–సి, గ్రూప్–డి, మల్టీ టాస్కింగ్ పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్సీ జాబ్ నోటిఫికేషన్, ఉద్యోగాల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం వివరాలు..

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. ప్రతి ఏటా సీహెచ్ఎస్ఎల్, సీజీఎల్ వంటి పరీక్షలను నిర్వహిస్తున్న సంస్థ. అందుకే ఎస్ఎస్సీ నోటిఫికేషన్ల కోసం ఉద్యోగార్థులు ఎదురు చూస్తుంటారు. ఇలాంటి వారికి మరో చక్కటి అవకాశం.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఫేజ్ – 11 – 2023 సెలక్షన్ పోస్ట్స్ నియామక నోటిఫికేషన్.

మొత్తం పోస్టులు 5,369

ఎస్ఎస్సీ తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం 5,369 పోస్టుల భర్తీ చేపట్టనుంది. రీజియన్ల వారీగా ఈ పోస్టుల భర్తీ చేపట్టనుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన సదరన్ రీజియన్‌లో 270 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది 2,065 పోస్టులకే ఫేజ్–10– సెలక్షన్ పోస్టుల భర్తీ చేపట్టిన ఎస్ఎస్సీ.. ఈ ఏడాది మాత్రం ఫేజ్–11 ద్వారా 5,369 పోస్టులను భర్తీ చేయనుంది.

అడ్మిన్ టు టెక్నికల్

ఎస్ఎస్సీ ఆయా విభాగాల్లో అడ్మినిస్ట్రేషన్ మొదలు టెక్నికల్, నర్సింగ్, రీసెర్చ్, లీగల్, మెడికల్ అనుబంధ పోస్టులను భర్తీ చేయనుంది. డిగ్రీ అర్హతతో.. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, ఫెర్టిలైజర్ ఇన్‌స్పెక్టర్, చార్జ్‌మెన్(ఐటీ), సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్, రీసెర్చ్ అసోసియేట్ తదితర పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి మార్చి 27, 2023 నాటికి బ్యాచిలర్ డిగ్రీ, ఇంటర్మీడియెట్, పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- ఇంటర్మీడియెట్ అర్హతతో.. టైపిస్ట్, లైబ్రేరియన్, టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్, సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్ తదితర పోస్టులను భర్తీ చేయనుంది.
- పదో తరగతి అర్హతగా.. ఆయా శాఖల్లో అటెండెంట్ పోస్టులను భర్తీ చేయనుంది.
- వయసు: ఆయా పోస్టులను అనుసరించి 2023 జనవరి 1 నాటికి 18–25 ఏళ్లు, 18–27 ఏళ్లు, 18–30 ఏళ్ల మధ్యలో ఉండాలి.

తొలి దశలో రాత పరీక్ష

- పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా తొలి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు.

ఈ రాత పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. వివరాలు..

విభాగం ఎ– జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులకు; విభాగం బి– జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు–50 మార్కులకు ;విభాగం సి–క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–50 మార్కులకు; విభాగం డి ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటుంది.

పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ అర్హతగా పేర్కొన్న అన్ని పోస్టులకు ఈ విభాగాల్లో ఇదే విధానంలో పరీక్ష ఉంటుంది. ఆయా అర్హతలకు అనుగుణంగా ప్రశ్నల క్లిష్టత స్థాయి ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం ఒక గంట. ప్రతి తప్పు సమాధానానికి 1/2 మార్కు నెగెటివ్ మార్కింగ్ నిబంధనను అమలు చేస్తున్నారు.

రెండో దశ స్కిల్ టెస్ట్

- రాత పరీక్షతోపాటు కొన్ని పోస్టులకు రెండో దశలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ స్కిల్ టెస్ట్‌లో భాగంగా టైపింగ్, డేటాఎంట్రీ, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ విభాగాల్లో అభ్యర్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తారు.
- రాత పరీక్షలో పొందిన మెరిట్ ఆధారంగా..ఒక్కో పోస్ట్‌కు 20మందిని స్కిల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.

అర్హతను బట్టి.. క్లిష్టత స్థాయి

ఎస్ఎస్సీ నియామక రాత పరీక్షలో పేర్కొన్న విభాగాలు, అంశాలు అన్ని పోస్టులలోనూ ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న పోస్ట్‌కు పేర్కొన్న అర్హత స్థాయిని బట్టి ప్రశ్నల క్లిష్టత స్థాయి ఉంటుంది. పదో తరగతి అర్హత పోస్టులకు, ఇంటర్ అర్హత పోస్టులకు, డిగ్రీ అర్హత పోస్టులకు వేర్వేరు ప్రశ్నలు ఎదురవుతాయి.

ఆకర్షణీయ వేతనాలు

ఎస్ఎస్సీ ఫేజ్–11 సెలక్షన్ పోస్ట్ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి నియామకాలు ఖరారు చేసుకుంటే.. ఆకర్షణీయ వేతనంతో కెరీర్ ప్రారంభించే అవకాశం ఉంటుంది. తాజా నోటిఫికేషన్‌లో.. ఆయా పోస్టులను అనుసరించి పే లెవల్–1 నుంచి పే లెవల్–7 వరకు వేతన శ్రేణిని పేర్కొన్నారు. పే లెవల్–1 ఉద్యోగాలకు రూ.18,000– రూ.56,900; పే లెవల్–2 ఉద్యోగాలకు రూ.19,900 – రూ.63,200; పే లెవల్–3 ఉద్యోగాలకు రూ.21,700–రూ.69,100; పే లెవల్–4 ఉద్యోగాలకు రూ.25,500 –రూ.81,100; పే లెవల్–5 ఉద్యోగాలకు రూ.29,200 – రూ.92,300; పే లెవల్–6 ఉద్యోగాలకు రూ.35,400–రూ.1,12,400; పే లెవల్–7 ఉద్యోగాలకు రూ.44,900–రూ.1,42,400గా వేతన శ్రేణులుగా ఉన్నాయి.

విజయం సాధించేలా..!

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే పోస్టులకు లక్షల సంఖ్యలో పోటీ ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు అందుబాటులో ఉన్న సమయంలో నిర్దిష్ట వ్యూహంతో పటిష్ఠ ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. ముందుగా సిలబస్‌ను పరిశీలించాలి. దాని ఆధారంగా ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

ఈ విభాగంలో రాణించాలంటే.. గుర్తులు, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిలేషన్ షిప్, క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, సిమాటిక్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వెన్ డయాగ్రమ్స్, డ్రాయింగ్ ఇన్ఫరెన్సెస్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ముఖ్యాంశాలపై అవగాహన పెంచుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

అర్థమెటిక్‌తోపాటు ప్యూర్ మ్యాథ్స్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. నంబర్ సిస్టమ్స్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, పర్సంటేజెస్, రేషియోస్, అల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, లీనియర్ ఈక్వేషన్స్, టాంజెంట్స్ వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగానికి సంబంధించి వ్యాకరణంపై పట్టు సాధించాలి. పార్ట్స్ ఆఫ్ స్పీచ్ మొదలు ప్యాసేజ్ కాంప్రహెన్షన్ వరకూ.. అన్ని రకాల గ్రామర్ అంశాలను అభ్యసనం చేయాలి. ముఖ్యంగా యాక్టివ్ అండ్ పాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, సినానిమ్స్, యాంటానిమ్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్లపై పట్టు సాధించాలి.



పునశ్చరణ, నమూనా పరీక్షలు

ప్రిపరేషన్ క్రమంలో అభ్యర్థులు నిరంతరం రివిజన్ కొనసాగించేలా ప్లాన్ చేసుకోవాలి. అదే విధంగా ఒక టాపిక్ చదవడం పూర్తయ్యాక నమూనా పరీక్షలు, మాక్ టెస్ట్‌లకు హాజరవ్వాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విషయంలో అర్థమెటిక్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ఇందుకోసం పదో తరగతి స్థాయిలోని గణిత పుస్తకాలతో తమ ప్రిపరేషన్ ప్రారంభించాలి. వాటి ద్వారా ముందుగా కాన్సెప్ట్‌లపై అవగాహన ఏర్పరచుకుని అప్లికేషన్ దృక్పథంతో ప్రాక్టీస్ చేయాలి.

ప్రీవియస్ పేపర్ల ఆధారంగా

సీహెచ్ఎస్ఎల్, సీజీఎల్ గత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం ద్వారా పరీక్షల్లో ఎస్ఎస్సీ అడిగే ప్రశ్నల తీరుపై అవగాహన వస్తుంది. పోస్టులకు దరఖాస్తు సమయంలోనే స్కిల్ టెస్ట్ విషయంలో స్పష్టత ఏర్పరచుకుని వాటికి సంబంధించి కూడా సన్నద్ధత పొందేలా అడుగులు వేయాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మార్చి 27, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: ఏప్రిల్ 3–5
- పరీక్ష: జూన్ లేదా జూలైలో
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, చీరాల, కడప, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి, తిరుపతి, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్
- వెబ్‌సైట్: https://ssc.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)			
దేశీ సూచీలు			
సెన్సెక్స్ ▲	355	57,990	
నిఫ్టీ ▲	114	17,100	
విదేశీ సూచీలు			
నాస్‌డాక్	11,631	▼	87
డోజోన్స్	31,862	▼	385
ఎఫ్‌టీఎస్ఈ 100	7,335	▼	75
డాక్స్	14,768	▼	199
షాంఘై	3,251	▲	24
నికాయ్	27,334	▲	323

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్



అమ్మ ఆకాంక్షలకు చట్టరూపం

మహిళలకు జీవనకాలం పెరిగింది. సంరక్షణ బాధ్యతలు దీర్ఘకాలం పాటు నిర్వహించాల్సి వస్తోంది. ఒంటరి మహిళలు లేదా వితంతువులకూ బాధ్యతలు ఉంటాయి. ఉన్నట్టుండి అమ్మకు ఏదైనా జరగరానిది జరిగితే, ఆమె ఆకాంక్షల మేరకు పిల్లలకు ఆస్తుల బదిలీ ఎలా..? పిల్లల సంరక్షణ ఎలా..? తాను జీవించి ఉండగానే తీవ్ర అనారోగ్యం బారిన పడితే ఆమె సంరక్షణ ఎవరు చూడాలి..? ఆమె తరఫున ఎవరు నిర్ణయాలు తీసుకోవాలి..? ఇక్కడే ఎస్టేట్ ప్లానింగ్ కీలకంగా పనిచేస్తుంది. ముఖ్యంగా మహిళలు కోరుకున్నట్టు, వారి ఇష్టం మేరకు, ఆకాంక్షల మేరకు ఆస్తుల బదిలీ సహా ఎన్నో అంశాలకు చట్టబద్ధమైన రక్షణతో ఎస్టేట్ ప్లానింగ్ హామీ ఇస్తుంది. ఈ ఎస్టేట్ ప్లానింగ్ అంటే ఏమిటి? ఎలా పనిచేస్తుందన్నది? ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.

•••

ఎస్టేట్ ప్లానింగ్ డాక్యుమెంట్‌లో ఆస్తులు, అప్పులు ఇలా సమగ్ర వివరాలు ఉంటాయి. స్టాక్స్ లేదా మ్యూచువల్ ఫండ్స్, రియల్ ఎస్టేట్, పీపీఎఫ్, లైఫ్ ఇన్సూరెన్స్ ఇలా సమగ్ర ఆస్తులు, బాధ్యతలు (చెల్లించాల్సిన రుణాలు) అన్నీ వస్తాయి. వారసుల మధ్య వివాదాలను ఇది నివారిస్తుంది. మహిళ కోరినట్టుగా ఆస్తుల పంపిణీ, పన్ను చెల్లింపులతోపాటు, అప్పులను కూడా తీరుస్తుంది. పిల్లలకు అంతగా సామర్థ్యాలు లేవని భావించినప్పుడు, అవసరమైన సందర్భాల్లో ఆర్థిక, వైద్య అవసరాలను చూసేందుకు నమ్మకమైన ఒక వ్యక్తిని కూడా నియమించుకోవచ్చు. ఎస్టేట్ ప్లానింగ్ మహిళలను ఆర్థికంగానే కాకుండా బాధ్యతల పరంగా స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. తమకు ప్రియమైన వారు ఇబ్బంది పడకుండా దీర్ఘకాలం పాటు సంరక్షణ బాధ్యతలను కోరిన విధంగా నిర్వహిస్తుంది. మహిళలకు తమ పిల్లల సంరక్షణకు సంబంధించి ప్రత్యేకమైన లక్ష్యాలతోపాటు.. ఆందోళన కూడా ఉంటుంది. పిల్లల ఎదుగుదలలో వారు ఎంతో కీలక పాత్ర పోషిస్తారు. పిల్లల భవిష్యత్తుకు సంబంధించి వారి మనసులో ఎన్నో ఆలోచనలు ఉంటాయి. పిల్లల భవిష్యత్తు ప్రాధాన్యతలను నిర్ణయించే అమ్మలూ ఉన్నారు. ఒకవేళ తాము అకాల మరణానికి గురైతే పిల్లలు ఆర్థికంగా భద్రంగా ఉండేలా ఎస్టేట్ ప్లానింగ్ భరోసానిస్తుంది. ఒంటరి మహిళ లేదా వితంతు మహిళ విల్లులో గార్డియన్ పేరు రాస్తే సరిపోతుంది. అదే ఎస్టేట్ ప్లాన్ అయితే అర్హత లేని వ్యక్తి సంరక్షకుడిగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

- ఎస్టేట్ ప్లానింగ్‌తో కుటుంబానికి పూర్తి రక్షణ
- ఆస్తులు, అప్పుల బాధ్యతలకు స్పష్టమైన రూపం
- విల్లు కంటే విస్తృతమైనది
- ఒంటరి, వితంతు మహిళలకు అనుకూలం
- వివాదాలు, పన్నులు, వ్యయాలను నివారించొచ్చు

మహిళలకు ప్రయోజనం

ఒంటరి మహిళలకు ఎస్టేట్ ప్లానింగ్ ఎంతో సాయంగా ఉంటుంది. ఎందుకంటే వారి సంరక్షణ బాధ్యతలతోపాటు, వారి తదనంతరం అన్ని అప్పులు తీర్చేసి, మిగిలిన ఆస్తులను వారు కోరిన మేరకు వారికి ఎంతో ఇష్టమైన వారికి సాఫీగా పంపిణీ అవుతాయి. రెండు రకాల ప్రయోజనాలకు ఇది భరోసా ఇస్తుంది. అందుకే ఇక్కడ మహిళలను ప్రధానాంశంగా తీసుకోవడం జరిగింది. అంతేకాదు, ఎస్టేట్ ప్లానింగ్ రూపొందించడం వల్ల మహిళలకు అన్ని అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. అన్ని ఆస్తులు, అప్పులు, అవసరాలపై స్పష్టత వస్తుంది. ఒక విధంగా అన్ని వైపులా ఆమెకు, ఆమె కుటుంబానికి రక్షణనిస్తుంది.

ఆకాంక్షలు నెరవేరేందుకు..

మహిళలు తమ పేరిట ఉన్న ఆస్తులను కాపాడుకునేందుకు, వాటి సక్రమ బదిలీకి, సరైన వారసులకు తాము కోరుకున్నట్టుగా బదిలీ చేసుకునేందుకు ఎస్టేట్ ప్లాన్ వీలు కల్పిస్తుంది. వారసులు తేల్చుకోలేకపోతే ఆస్తులపై ప్రయోజనం ఎవరు పొందాలో కూడా ఓ పట్టాన తేలదు. దీంతో కోర్టు కేసులు, ఎన్నో ఏళ్ల కాల హరణం, విపరీతమైన ఖర్చులకు దారితీస్తుంది. మన దేశంలో వారసత్వ చట్టాలు పురుషులకే మొగ్గు చూపిస్తున్నాయి. మరణించిన మహిళ ఆస్తులు ఆమె భర్త తరఫు వారికే వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఎస్టేట్ ప్లానింగ్ ఎంతో అవసరం. ఇది లేకపోతే ఆమె ఆకాంక్షలకు భిన్నంగా ఆస్తుల పంపకాలు జరగొచ్చు. అందుకని వివాహిత మహిళలు అయినా, వితంతువులు అయినా, పెళ్లి కాని మహిళలు అయినా అందరికీ ఎస్టేట్ ప్లానింగ్ అవసరం. అప్పుడే వారు కోరుకున్నట్టుగా, కోరుకున్న వారికి ఆస్తులు బదిలీ అవుతాయి.

వీలునామా - ఎస్టేట్ ప్లానింగ్

ఎస్టేట్ ప్లానింగ్ అంటే వీలునామా అనుకునేరు. వీలునామా, ఎస్టేట్ ప్లానింగ్ వేర్వేరు. అలాగే, ఎస్టేట్ ప్లానింగ్ అంటే ధనవంతులకు, వీలునామా (విల్లు) సామాన్యులకు అనుకునే వారూ ఉన్నారు. కానీ, ఇవి ఫలానా వారికే అని ఏమీ లేదు. వీటి మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. ఎస్టేట్ అంటే.. ఒక వ్యక్తికి సంబంధించి అన్ని ఆస్తులు, అప్పులు. ఆస్తులు అంటే బ్యాంకు ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్, బాండ్లు, షేర్లు, బీమా పాలసీలు, పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, కాపీ రైట్లు, రియల్ ఎస్టేట్, ఆర్ట్‌లు, కళాఖండాలు, వాహనాలు, ఆభరణాలు ఇలా విలువైనవన్నీ వస్తాయి. బాధ్యతలు అంటే వ్యక్తిగత రుణాలు, మార్ట్‌గేజ్ రుణాలు, క్రెడిట్ కార్డులు, పన్నులు వస్తాయి. ఉదాహరణకు.. ఏ అనే వ్యక్తికి కొన్ని పెట్టుబడులు, రూ.కోటి విలువైన ప్రాపర్టీ ఉంది. అలాగే, బీ అనే వ్యక్తి పేరిట ఆర్థిక పెట్టుబడులు, పలు చోట్ల ప్రాపర్టీలు, వ్యాపారాల్లో వాటాలు మొత్తం మీద రూ.500 కోట్ల విలువ చేసేవి ఉన్నాయి. ఇక్కడ ఏ, బీ ఇద్దరికీ ఎస్టేట్ ప్లానింగ్ ఉపయోగపడుతుంది.

•••

ఎస్టేట్ ప్లానింగ్ అనేది రాసిన వ్యక్తి మరణం తర్వాత వారి పేరిట ఉన్న సంపదను బదిలీ చేయడానికే పరిమితం కాదు. జీవించిన ఉన్న సమయంలోనూ వాటిని రక్షించడం, కాపాడుకోవడం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలను నిర్వహించలేని పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో కూడా ఎస్టేట్ ప్లానింగ్‌లో ఉంటుంది. విల్లు అనేది సంపదను ఎవరికి, ఎలా పంచాలో సూచించే చట్టబద్ధమైన పత్రం. మరణానంతరం కోరుకున్న విధంగా ఆస్తులను బదిలీ చేసేందుకు ఈ పత్రం ఉపయోగపడుతుంది. విల్లులోని అంశాలను అమలు చేసే బాధ్యతను ఎవరు నిర్వహించాలో కూడా సూచించొచ్చు. విల్లుతో పోలిస్తే ఎస్టేట్ ప్లానింగ్ మరింత విస్తృతంగా ఉంటుంది. విల్లు ఒక్కటే సాధనం అయితే, ఎస్టేట్ ప్లానింగ్ ఒకటికి మించిన సాధనాలతో ఉంటుంది.

ఉద్దేశాలు



ఊహించని రిస్క్‌లు ఎదురైతే సంపదకు రక్షణ కవచంలా ఎస్టేట్ ప్లానింగ్ సాయపడుతుంది. మైనర్లు, ప్రత్యేక అవసరాల పిల్లలు ఉంటే, ఆర్థిక విషయాల గురించి ఏ మాత్రం అవగాహన లేని కుటుంబ సభ్యులు ఉంటే వారికి సంబంధించిన నిర్ణయాలకు ఎస్టేట్ ప్లానింగ్ హామీ ఇస్తుంది. మహిళ నిర్ణయాలు తీసుకోలేని స్థితికి వెళితే, ఆ బాధ్యతలు నిర్వహించే యంత్రాంగం ఏర్పాటు, కుటుంబ వివాదాలను పరిష్కరించే సమాచార వాహకం ఏర్పాటు ఇలా ఎన్నో అంశాలకు ఎస్టేట్ ప్లానింగ్ వేదిక కాగలదు. తీవ్ర అనారోగ్యం బారిన పడినప్పుడు, ఆసుపత్రుల్లో విషమ పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆమె తరఫున ఎవరు నిర్ణయం తీసుకోవాలో ఎస్టేట్ ప్లానింగ్ స్పష్టం చేస్తుంది. ఎస్టేట్ ప్లానింగ్‌తో ఉన్న ప్రయోజనం వారసత్వ పన్ను తప్పించుకోవచ్చు. అయితే, ప్రస్తుతం మన దేశంలో వారసత్వ పన్ను లేదు. కానీ, అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో ఉంది. తాము ప్రేమించే వారు విదేశాల్లోనూ ఉండి, తమ తర్వాత వారికి కూడా ఆస్తుల బదలాయింపు కోరుకుంటే అప్పుడు ఎస్టేట్ ప్లానింగ్ మెరుగైనది. విదేశాల్లో ఆస్తులు ఉన్నవారికి కూడా ఎస్టేట్ ప్లానింగ్ అవసరం. చివరి వీలునామా, ప్రైవేటు ఫ్యామిలీ ట్రస్ట్, పవర్ ఆఫ్ అటార్నీ, గిఫ్ట్ డీడ్స్, అడ్వాన్స్‌డ్ మెడికల్ డైరెక్టివ్, లైఫ్ ఇన్సూరెన్స్, ఫ్యామిలీ చార్టర్‌లు ఎస్టేట్ ప్లానింగ్‌లో ఉంటాయి. పరిధి చాలా విస్తృతం కనుక నిపుణుల సాయంతో దీన్ని రూపొందించుకోవడం అవసరం.

పన్నుల భారం



ఆస్తులపై పన్నుల భారాన్ని ఎస్టేట్ ప్లానింగ్ తప్పిస్తుంది. అంతేకాదు, ఒకరి మరణానంతరం ఎస్టేట్ ప్లానింగ్‌లో పేర్కొన్న మాదిరి ఆస్తులను పింపిణీ చేసుకున్నప్పుడు వాటిపై వ్యయాలు కూడా తగ్గుతాయి. ఉదాహరణకు ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఆస్తులపై పన్ను తగ్గుతుంది. విచారణ లేకుండానే (చట్టపరమైన ప్రక్రియ) లబ్ధిదారులు ఆస్తులు పొందగలరు. ఎస్టేట్ ప్లానింగ్‌లో సూచనల మేరకు ఆస్తులను వేగంగా బదిలీ చేయవచ్చు.



తమ ఆస్తులు తమ తదనంతరం ఎవరికి చెందాలో విల్లులో రాసుకోవచ్చు. విల్లు లేకుండా మరణిస్తే.. అనుభవించే హక్కులు మారొచ్చు. ఉదాహరణకు హిందూ పురుషుడు విల్లు లేకుండా మరణిస్తే అతడి పేరిట ఉన్న సంపదను అతడి తల్లి, భార్య, పిల్లలు ఇలా మూడు సమాన వాటాలుగా పొందొచ్చని చట్టం చెబుతోంది. కానీ,

ప్రయోజనాలు.. పరిమితులు.. వ్యత్యాసాలు


విల్లు రాస్తే సంబంధిత వ్యక్తి కోరుకున్న విధంగా ఆస్తుల బదిలీకి అవకాశం ఏర్పడుతుంది. విల్లు వ్యక్తి మరణానంతరమే అమల్లోకి వస్తుంది. అంతే కాదు, ఈ విల్లును వారసులు సవాల్ చేయవచ్చు. ఎస్టేట్ ప్లానింగ్ సమగ్ర రూపంతో ఉంటుంది. మరణానంతరమే కాకుండా జీవించిన కాలంలోనూ లక్ష్యాలకు రూపం ఇస్తుంది. ఎస్టేట్ ప్లానింగ్ మీ సంపదకు, మీ వారసులు లేదా మీకు ఇష్టమైన వారి ఆర్థిక భద్రతకు ఎక్కువ రక్షణనిస్తుంది. కేవలం చట్టబద్ధమైన డాక్యుమెంట్లకే పరిమితం కాకుండా, అన్ని రకాల బాధ్యతలు, సంరక్షణ, సంపద బదిలీ యంత్రాంగం ఏర్పాటు ఇందులో ఉంటాయి. కనుక విల్లుతో పోలిస్తే ఎస్టేట్ ప్లానింగ్ అదనపు ఖర్చు భరించాల్సిందే. ఎస్టేట్ ప్లానింగ్ మహిళల కోసమనే కాదు. పురుషులకూ, ఇంటి బాధ్యతలు చూసే, ఆస్తులు, బాధ్యతలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే డాక్యుమెంట్ అవుతుంది.

పీఎన్‌బీ మెట్‌లైఫ్ సస్టెయినబుల్ ఈక్విటీ ఫండ్



పీఎన్‌బీ మెట్‌లైఫ్ 'సస్టెయినబుల్ ఈక్విటీ ఫండ్'ను విడుదల చేసింది. ఇది పీఎన్ బీ మెట్‌లైఫ్ గోల్ ఎన్సూరింగ్ మల్టిప్లయర్ ప్లాన్‌లో భాగం. ఈఎస్‌జీ సూత్రాల మేరకు నడుస్తున్న కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. పీఎన్‌బీ మెట్‌లైఫ్ గోల్ ఎన్సూరింగ్ మల్టిప్లయర్ ప్లాన్ (యులిప్)లో చేరే వారు ఈ పథకాన్ని పెట్టుబడుల కోసం ఎంపిక చేసుకోవచ్చు. పాలసీదారులకు దీర్ఘకాలంలో మంచి విలువ సమకూర్చాలన్న తమ అంకిత భావానికి సస్టెయినబుల్ ఈక్విటీ ఫండ్ నిదర్శనమని పీఎన్‌బీ మెట్‌లైఫ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

మిరే అసెట్ నుంచి నిఫ్టీ ఈటీఎఫ్..



మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా నిఫ్టీ 100 'లో వోలటిలిటీ' 30 ఈటీఎఫ్ పేరిట న్యూ ఫండ్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇది మార్చి 21తో ముగుస్తుంది. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణ లావాదేవీల నిర్వహణకు మార్చి 27 నుంచి ఇది అందుబాటులో ఉంటుంది. భారీ మార్కెట్ క్యాప్ సెగ్మెంట్‌లో తక్కువ ఒడిదుడుకులకు లోనయ్యే స్టాక్స్ ప్రాతిపదికగా ఈ ఫండ్ పెట్టుబడులు ఉంటాయి. ఇటు యాక్టివ్, అటు ప్యాసివ్ పెట్టుబడి ధోరణుల కలబోతగా ఉండే ఈ తరహా స్మార్ట్ బీటా ఈటీఎఫ్‌లు ఇటీవలి కాలంలో ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. ఇతర సూచీలు, విస్తృత మార్కెట్‌తో పోలిస్తే వీటి క్షీణత స్థాయి తక్కువగా ఉంటుందని సంస్థ తెలిపింది. తమ పోర్ట్‌ఫోలియోలో ఒడిదుడుకులు, క్షీణత రిస్కును తగ్గించుకుని, దీర్ఘకాలంలో తక్కువ రిస్కులతో మెరుగైన రాబడులు అందుకోవాలని కోరుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువైనదని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
20-3-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
19-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

స్టాక్స్ వ్యూ

బ్లూస్టార్ | యూఎల్‌జేకే రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,444 టార్గెట్: రూ. 1,825

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ఇంజినీరింగ్ దిగ్గజం బ్లూస్టార్ లిమిటెడ్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో వార్షికంగా అమ్మకాలు 19 శాతం ఎగసి రూ. 1,788 కోట్లను అధిగమించాయి. నిర్వహణ లాభం(ఇబిటా) మరింత అధికంగా 22 శాతం జంప్‌చేసి రూ. 105 కోట్లకు చేరింది. త్రైమాసికవారీగా(క్యూ2) చూసినా ఇది 16 శాతం వృద్ధి. మార్జిన్లు 0.43 శాతం బలపడ్డాయి. వెరసి క్యూ3లో మార్జిన్లు 5.86 శాతాన్ని తాకాయి. వెరసి నికర లాభం త్రైమాసికవారీగా 39 శాతం దూసుకెళ్లి రూ. 58 కోట్లను అధిగమించింది. విభాగాలవారీగా సైతం కంపెనీ అమ్మకాలు జోరు చూపాయి. ఎలక్ట్రో మెకానికల్ ప్రాజెక్ట్స్(ఈఎంపీ), వాణిజ్య ఎయిర్‌కండిషనింగ్ సిస్టమ్స్ మెరుగైన పనితీరు ప్రదర్శించింది. వార్షికంగా ఆదాయం 21 శాతం పుంజుకుని రూ. 1,000 కోట్లకు చేరింది. యూనిటరీ ప్రాడక్టుల



విభాగం టర్నోవర్ 15 శాతం బలపడి రూ. 702 కోట్లను తాకింది. అయితే ప్రొఫెషనల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ సిస్టమ్స్ మరింత అధికంగా 29 శాతం పురోగమించి రూ. 86 కోట్లను దాటింది. కంపెనీ భారీ విస్తరణ ప్రణాళికలు అమలు చేస్తోంది. ముడివ్యయాల భారం తగ్గే అవకాశముంది. ఈ ఏడాది వేసవి సీజన్ ముందుగానే ప్రారంభంకావడం కంపెనీ అమ్మకాలు పుంజుకునేందుకు దోహదం చేయనుంది. రానున్న త్రైమాసికాలలోనూ ఇదే స్థాయి వృద్ధి కొనసాగించే వీలుంది. వచ్చే ఏడాది(2023-24) రూ. 36.5 షేరువారీ ఆర్జన(ఈపీఎస్) సాధించగలదని అంచనా.

ఓఎన్‌జీసీ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 153 టార్గెట్: రూ. 200

ఎందుకంటే: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం ఓఎన్‌జీసీ ఈ ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నిర్వహణ లాభం(ఇబిటా) వార్షికంగా 28 శాతం జంప్‌చేసి రూ. 20,410 కోట్లను తాకింది. త్రైమాసికవారీగా సైతం 9 శాతం ఇది అధికం. విండ్‌ఫాల్ ట్యాక్స్ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్న తదుపరి ముడిచమురు బ్యారల్‌కు 76.7 డాలర్ల ధరను అందుకుంది. ఈ కాలంలో అంచనాలకు అనుగుణంగా 4.7 మిలియన్ మెట్రిక్ టన్నులు(ఎంఎంటీ) చమురు విక్రయాలు, 4.2 బిలియన్ క్యూబిక్ మీటర్లు(బీసీఎం) గ్యాస్ అమ్మకాలు సాధించింది. కేజీ బేసిన్ నుంచి మే లేదా జూన్‌లో తొలిసారిగా చమురు ఉత్పత్తిని సాధించనుంది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం (2023-24)లో 1.9 ఎంఎంటీ ముడిచమురు, 2.8 బీసీఎం గ్యాస్‌ను ఉత్పత్తి చేయగలదని అంచనా. ఆపై ఏడాది(2024-25) 2.2 ఎంఎంటీ ముడి చమురు, 3.8 బీసీఎం గ్యాస్‌ను వెలికి తీసే వీలున్నట్లు కంపెనీ అంచనా వేసింది. ఈ బాటలో గరిష్టంగా రోజుకి 45,000 బ్యారళ్ల చమురును, 12 ఎంఎంఎస్‌సీఎండీ గ్యాస్‌ను ఉత్పత్తి చేయగలమని భావిస్తోంది. చమురు ధరల్లో క్షీణత కారణంగా 2022 జులైలో నమోదైన రూ. 23,250 గరిష్టం నుంచి విండ్‌ఫాల్ పన్ను ఈ ఫిబ్రవరికల్లా ఎంటీకి రూ. 5,050కు దిగివచ్చింది. అయితే సమీప భవిష్యత్‌లో విండ్‌ఫాల్ పన్ను విధింపు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. కంపెనీ వృద్ధికి ఇతర ఇంధన పీఎస్‌యూలు హెచ్‌పీసీఎల్, ఎంఆర్‌పీఎల్, పీఎల్ఎన్‌జీలలో పెట్టుబడులు సైతం సహకరించే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

యూబీఎస్ చేతికి క్రెడిట్ సుసీ

డీల్ విలువ 2 బిలియన్ డాలర్లు



జ్యూరిక్: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న క్రెడిట్ సుసీను కొనుగోలు చేసేందుకు స్విట్జర్లాండ్ బ్యాంకింగ్ దిగ్గజం యూబీఎస్ గ్రూప్ అంగీకరించినట్లు తెలుస్తోంది. స్విస్ ప్రభుత్వ దన్నుతో 2 బిలియన్ డాలర్ల(రూ. 16,500 కోట్లు)కు ఒప్పందం కుదిరినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. షేర్ల జారీ ద్వారా కుదిరిన డీల్ ప్రకారం క్రెడిట్ సుసీ విలువ 8 బిలియన్ డాలర్లుగా తెలియజేసింది. క్రెడిట్ సుసీ షేరు శుక్రవారం ముగింపు ధరతో పోలిస్తే నాలుగో వంతు ధరలో యూబీఎస్ కొనుగోలు చేయనుంది. గత వారం నాలుగు యూఎస్ బ్యాంకులు వైఫల్యం చెందిన నేపథ్యంలో క్రెడిట్ సుసీ షేరు, బాండ్లకు షాక్ తగిలింది. స్విస్ కేంద్ర బ్యాంకు లిక్విడిటీ మద్దతునిచ్చినప్పటికీ మార్కెట్లో క్రెడిట్ సుసీ షేరు పతనమైంది. తాజాగా క్రెడిట్ సుసీను టేకోవర్ చేసేందుకు స్విస్ ప్రభుత్వం నుంచి రిస్కులకుగాను 6 బిలియన్ డాలర్ల గ్యారంటీని యూబీఎస్ కోరినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

నాకు నెలకు లక్ష కావాలి..?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నేను మరో 10-15 ఏళ్లలో ఇల్లు కొనుగోలు చేయాలని అనుకుంటున్నాను. రూ.2.5-3 కోట్ల బడ్జెట్‌లో ఇల్లు కొనాలన్నది నా ఆలోచన. గృహ రుణం తీసుకునే విషయంలో నా వంతు డౌన్ పేమెంట్‌ను సమకూర్చుకోవాలి కదా. వచ్చే 10-15 ఏళ్లలో గృహ రుణం డౌన్ పేమెంట్‌ను సమకూర్చుకునేందుకు ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి? టాటా స్మాల్ క్యాప్ లేదా, మిరే అస్సెట్ మిడ్‌క్యాప్ ఫండ్ లేదా పీజీఐఎం ఇండియా మిడ్‌క్యాప్ ఫండ్ పథకాలు నా డౌన్ పేమెంట్‌కు అనుకూలమైనా..? – ఆదిత్య బి

10-15 ఏళ్లలో ఇల్లు కొనుగోలు చేద్దామన్న నిర్ణయం సరైన దారిలోనే ఉంది. మీ పెట్టుబడులు వృద్ధి చెందడానికి సరిపడా సమయం మీ చేతుల్లో ఉంది. ఈ కాలంలో ఈక్విటీ పథకాల నుంచి సహేతుక రాబడులు వస్తాయని ఆశించొచ్చు. తద్వారా గృహ కొనుగోలుకు కావాల్సిన డౌన్ పేమెంట్‌ను సమకూర్చుకోవచ్చు. మీరు దృష్టిలో ఉంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. కొనుగోలు చేద్దామనుకుంటున్న ఇంటి బడ్జెట్ రూ.2.5-3 కోట్లు అని చెప్పారు కదా. ఇది నేటి ధరల ఆధారంగా అంచనా వేశారా? అయితే ద్రవ్యోల్బణ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోక తప్పదు. అప్పుడు 10-15 ఏళ్ల తర్వాత ఇల్లు కొనుగోలుకు అసలు ఎంత అవుతుందన్న వాస్తవ అంచనాకు రావడానికి ఉంటుంది. ఆ తర్వాత నెలవారీ సిప్ మొత్తాన్ని రెండు ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీరు ఒకటి నుంచి రెండు వరకు మిడ్, స్మాల్‌క్యాప్ పథకాలను కూడా ఎంపిక చేసుకోవచ్చు. కాకపోతే మిడ్, స్మాల్‌క్యాప్ అన్నవి మొత్తం పోర్ట్‌ఫోలియోలో 25-30 శాతం మించి ఉండకూడదు. మీ పోర్ట్‌ఫోలియోలో ఏ పథకాలు ఉండాలన్నది మీ రిస్క్ తీసుకునే సామర్థ్యం, ఈక్విటీ పెట్టుబడుల్లో మీకున్న అనుభవం కీలకంగా మారతాయి. ఇల్లు కొనుగోలు చేయడం అన్నది ఆర్థికంగా అతిపెద్ద నిర్ణయం. కనుక చాలా జాగ్రత్తగా దీన్ని పరిగణనలోకి తీసుకోవాలి. చాలా కేసుల్లో నివాసం ఉండేట్టు అయితే రుణంపై ఇల్లు కొనుగోలు చేయడం న్యాయమే అవుతుంది. గృహ రుణంపై పన్ను ప్రయోజనాలు ఉన్నాయి. పైగా ఇది దీర్ఘకాలం పాటు కొనసాగే రుణ బాధ్యత. అలాగే, గృహ రుణానికి మీరు చెల్లించే ఈఎంఐ అన్నది నెలవారీ నికరంగా చేతికి అందుకునే మొత్తంలో మూడింట ఒక వంతు మించకుండా చూసుకోండి. పెట్టుబడి కోణంలో అయితే రుణంపై ఇల్లు కొనుగోలు చేయడం మంచి నిర్ణయం కాబోదు. ఎందుకంటే రియల్ ఎస్టేట్‌లో లిక్విడిటీ తక్కువ. కొనుగోలు, విక్రయం వేగంగా సాధ్యపడదు. డబ్బులు కావాలంటే వెంటనే అడిగిన రేటుకు విక్రయించాల్సి వస్తుంది. అధిక విలువ కలిగిన ఇంటిని అమ్మడం అంత సులభమైన విషయం కాదు.

నా వయసు 59 ఏళ్లు. వచ్చే నెలలో పదవీ విరమణ తీసుకోబుతున్నాను. రిటైర్మెంట్ తర్వాత నా వద్ద రూ.కోటి నిధి ఉంటుంది. నెలవారీ ఖర్చులు రూ.లక్ష వరకు ఉంటాయి. కనుక నా వద్ద ఉండే రూ.కోటిని నెలనెలా రూ.లక్ష వచ్చేలా ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలో సూచించగలరు. – భానుప్రకాశ్

మీరు రూ.కోటి పెట్టుబడిపై ప్రతి నెలా రూ.లక్ష ఆదాయం కోరుకుంటున్నారు. అంటే వార్షిక రాబడి 12 శాతం ఉండాలి. ఈ స్థాయి రాబడి అన్నది ఈక్విటీలలో, అదీ దీర్ఘకాలంలోనే (ఏడేళ్లకు మించి) సాధ్యపడతాయి. ఏటా ఇదే స్థాయిలో ఈక్విటీలు కూడా రాబడులు ఇస్తాయని గ్యారంటీ ఉండదు. అలాగే, ఒక ఏడాదిలో వచ్చిన రాబడులన్నింటినీ వినియోగించుకోకూడదు. మీ పెట్టుబడి నిధి ద్రవ్యోల్బణ ప్రభావం (5-6 శాతం) మేర ఏటా వృద్ధి చెందుతూ ఉండాలి. అప్పుడే కావాల్సినంత మొత్తం సమకూర్చుకోగలరు. ఉదాహరణకు మీ రూ.కోటి నిధి.. ఐదు, ఏడేళ్ల తర్వాత కూడా అక్కడే ఉంటే.. ద్రవ్యోల్బణం ప్రభావం వల్ల అప్పటికి నెలవారీగా రూ.లక్ష ఆదాయం సరిపోదు. పెరిగే ధరలకు అనుగుణంగా మీకు మరింత మొత్తం ఆదాయం వచ్చేంత నిధి ఉండాలి. కనుక మీ పెట్టుబడిపై వచ్చే రాబడిలో కొంత మొత్తాన్ని అక్కడే వృద్ధి చెందేందుకు వీలుగా ఉంచేయాలి. మీ విషయంలో మీరు ఆశించే రాబడి రేటు ఎక్కువగా ఉంది. దాన్ని తగ్గించుకోండి. మీరు కోరుకున్నట్టు ప్రతి నెలా రూ.లక్ష చొప్పున ఉపసంహరించుకుంటూ వెళితే.. మీ వద్దనున్న పొదుపు నిధి కూడా తగ్గిపోతుంది. ద్రవ్యోల్బణం అధిగమించి నిధి వృద్ధి చెందాలంటే.. పెట్టుబడి నుంచి రాబడి 6 శాతానికి మించి ఉపసంహరించుకోకూడదు. అంటే



రూ.కోటి నిధిపై ఏటా రూ.6 లక్షల వరకే ఉపసంహరించుకోవాలి. పెట్టుబడి నిధిలో మూడింట ఒక వంతును ఈక్విటీలకు కేటాయించుకోవాలి. మిగిలిన రెండు భాగాలకు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలకు (డెట్) కేటాయించుకోవాలి. ప్రభుత్వ హామీ ఉన్న సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), పోస్ట్ ఆఫీస్ నెలవారీ ఆదాయ పథకం (పీవోఎంఐఎస్), ప్రధాన మంత్రి వయవందన యోజన (పీఎం వీవీవై) పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వీటిల్లో పీఎం వీవీవై, ఎస్‌సీఎస్ఎస్ 8 శాతం రాబడిని ఆఫర్ చేస్తున్నాయి. ఇందులో పీఎం వీవీవై ఈ ఏడాది మార్చితో ముగియనుంది. ఈ పథకాలకు కేటాయించుకోగా మిగిలే మొత్తాన్ని అధిక నాణ్యత కలిగిన షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి.

తెలంగాణ

మిల్లెట్ మ్యాన్ పీవీ సతీష్ మృతి

జహీరాబాద్, సాక్షి, హైదరాబాద్: నలభై ఏళ్ల క్రితం డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్)ని స్థాపించి, పాత పంటలు, సంప్రదాయ పంటలు, చిరుధాన్యాల సంరక్షణను ఉద్యమంలా చేపట్టి తెలంగాణ మిల్లెట్ మ్యాన్‌గా పేరుగాంచిన పీవీ సతీష్(77) ఆదివారం మృతిచెందారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దేశవ్యాప్తంగా మిల్లెట్ పునరుద్ధరణకు ఆయన శ్రమించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం పస్తాపూర్ కేంద్రంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారు. మహిళా రైతులతో కలిసి పాత పంటల పరిరక్షణ కోసం 1983 నుంచి కృషి చేస్తూనే, వారితోనే సంప్రదాయ పంటలు, వాటి ఆవశ్యకత గురించి కమ్యూనిటీ రేడియోను ప్రారంభించారు. వారు స్థాపించిన సొసైటీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా యునైటెడ్ నేషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలలో ఈక్వేటర్ ప్రైజ్‌ను గెలుచుకుంది.

ఈడీ విచారణకు కవిత హాజరుపై వీడని ఉత్కంఠ

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ అంశంలో ఈడీ విచారణకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరుపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నెల 16న జరగాల్సిన ఈడీ విచారణకు కవిత వెళ్లని సంగతి తెలిసిందే. అయినా కూడా 20న విచారణకు హాజరు కావాలంటూ ఈడీ సమన్లు ఇచ్చింది. ఈ క్రమంలో సోమవారం కవిత ఈడీ విచారణకు హాజరవుతారా? లేక మొన్నటిలా న్యాయవాదిని తన ప్రతినిధిగా పంపుతారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

గుడ్ మార్నింగ్..

ఇదొక్క అందమైన మార్నింగ్!

ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. 'సాక్షి' దిన పత్రిక ఆవిర్భవించింది. 'సత్యమేవ జయతే..' అంటూ నిఖార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే **sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి** అన్న లింకును క్లిక్ చేయండి.

సాక్షి ఆదివారం అనుబంధం పుస్తకం పేరు?

ఈరోజు ప్రశ్న
ఎ) ఫ్యామిలీ డే బి) ఫన్‌డే
సి) సన్‌డే డి) వీకెండ్ డే

చుక్కల భూములపై రైతులకు పూర్తి హక్కులు

12 ఏళ్లుగా ఇనామ్ భూముల్ని అనుభవిస్తున్న వారికి హక్కులు

- పట్టణ భూములకూ పట్టాదార్ పాస్ పుస్తకాలు
- మూడు రెవెన్యూ బిల్లులకు ఆమోద ముద్ర వేసిన అసెంబ్లీ



సాక్షి, అమరావతి: దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న చుక్కల భూములపై సంబంధిత రైతులకు పూర్తిస్థాయి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అదేవిధంగా కనీసం 12 ఏళ్లపాటు ఇనాం భూముల్ని అనుభవిస్తున్న వారికి ఆయా భూములపై సర్వహక్కులు లభించనున్నాయి. కాగా, అద్దె లేదా లీజుదారులు క్లెయిమ్ చేయని ఇనాం భూములు ప్రభుత్వ పరం కానున్నాయి. గ్రామీణ ప్రాంత భూములకు జారీచేసే పట్టాదార్ పాస్ పుస్తకాలను ఇకనుంచి పట్టణ ప్రాంత భూములకు జారీ చేయనున్నారు. ఈ మేరకు ఉద్దేశించిన ఏపీ చుక్కల భూములు (పునఃపరిష్కార రిజిస్టర్ ఆధునికీకరణ) సవరణ బిల్లు, ఆంధ్ర ప్రాంత ఇనామ్‌ల (రద్దు, రైత్వారీలోనికి మార్పిడి) సవరణ బిల్లులకు అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది. ఈ మూడు బిల్లులను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదివారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టగా.. వీటిపై పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు.

వక్ఫ్ భూముల్ని లీజుకిస్తే ముస్లింలకు మేలు

గుంటూరు నగరంలోని వక్ఫ్ బోర్డు భూములను నామమాత్రపు ధరలకు లీజుకిస్తే నిరుపేద ముస్లింలకు మేలు కలుగుతుందని గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే ముస్తఫా కోరారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన అధికారులు ఆ భూములు ఎవరి స్వాధీనంలో ఉన్నాయో సర్టిఫై చేస్తున్నారని, ఈ విధానంలో మార్పు రావాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. తిరుపతిలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న 60వేల మందికి హక్కులు కల్పించాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కోరారు. పలు మఠాలకు చెందిన భూముల్లో ఏళ్ల తరబడి వేలాది మంది ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారని వారికి కూడా హక్కులు కల్పించాలన్నారు.

రాయలసీమలో ఎంతో మందికి లబ్ధి

వ్యక్తిగత ఇనామ్ భూములను రెగ్యులరైజ్ చేయడంతో రాయలసీమలో వేలాది మందికి లబ్ధి చేకూరుతుందని రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేవదాయ, సర్వీస్ ఈనామ్ భూముల రెగ్యులరైజేషన్‌లో తగిన జాగ్రత్తలు పాటించాలని, దేవాలయాలకే తగిన హక్కులు కల్పించాలని సూచించారు. డీకేటీ భూముల విషయంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక రకమైన విధానం, ఇక్కడ మరో విధానం అమలులో ఉందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆయా రాష్ట్రాల్లో అనివార్య, అత్యవసర పరిస్థితుల్లో ఆ భూములు అమ్ముకోవడానికి వీలుందన్నారు. మన దగ్గర కూడా అదే రీతిలో ఆలోచన చేస్తే వేలాది మందికి మేలు జరుగుతుందన్నారు. నాలుగేళ్లలో రెవెన్యూలో ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిందని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సమగ్ర భూసర్వే గ్రామీణ ప్రాంతాల్లో నిజమైన యజమానులకు, పత్రాలు లేని వారికి పూర్తి హక్కులు కల్పిస్తోందన్నారు. చుక్కల భూములపై చేసే చట్టం వేలాది మందికి గొప్ప వరమన్నారు. ఏళ్ల తరబడి స్వాధీనంలో ఈ చుక్కల భూములను అమ్ముకోవడానికి వీల్లేకుండా ఉందని, 12 ఏళ్ల పూర్తి స్థాయిలో రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉంటే క్షేత్ర స్థాయిలో విచారణ చేసి పూర్తిస్థాయి హక్కులు కల్పించే ఈ చట్టం చాలా గొప్పదని, వీటిపై అధికారులకు కూడా అవగాహన కల్పించాలన్నారు.

గ్రామ స్థాయిలోనే రిజిస్ట్రేషన్లు: మంత్రి ధర్మాన

అవినీతికి ఆస్కారం లేని రీతిలో గ్రామస్థాయిలోనే రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించబోతున్నామని మంత్రి ధర్మాన ప్రసాదరావు వెల్లడించారు. మ్యుటేషన్ కోసం కూడా గ్రామం విడిచి వెళ్లనవసరం లేకుండా చేస్తామన్నారు. కొత్తగా తీసుకొచ్చిన మూడు బిల్లులపై రెవెన్యూ యంత్రాంగానికి అవగాహన కల్పిస్తామన్నారు. ఇప్పటికే రెవెన్యూ శాఖలో తీసుకొచ్చిన సంస్కరణలపై అవగాహన కల్పించేందుకు మూడు ప్రాంతీయ సదస్సులు నిర్వహించామన్నారు.

'స్కిల్' సూత్రధారి బాబే

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాన సూత్రధారులను శిక్షించి తీరుతామన్నారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌పై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ రెండో రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా టీడీపీ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ అంశంపై బుగ్గన మాట్లాడారు. 'ఏపీఎస్ఎస్‌డీసీకి ప్రైవేట్ వ్యక్తి గంటా సుబ్బారావు ఎండీగా నియమించడంతోపాటు సీమెన్స్ కంపెనీ పేరిట వాటా నిధులు ఒక్క రూపాయి కూడా వెచ్చించకుండానే ప్రభుత్వ వాటాగా రూ.371 కోట్లు విడుదల చేయడం వెనుక పెద్ద కథే నడిచింది. ఇంత పెద్ద ప్రాజెక్టును పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసి తరువాత నిర్ణయం తీసుకోవాలని ఆర్థిక శాఖ కార్యదర్శి ప్రతిపాదించినా పట్టించుకోలేదు. ఎంఓయూ, లైసెన్స్ ఒప్పంద పత్రంలో సీమెన్స్ కంపెనీ ఎండీ సౌమ్యాద్రి శేఖర్‌బోస్‌గా పేర్కొన్నారు. సంతకాలు చేసేటప్పుడు మాత్రం ఎండీ పేరును సుమన్‌బోస్‌గా చూపారు. ఈ ఒప్పందంతో తమకు ఏమాత్రం సంబంధం లేదని, షెల్ కంపెనీలు, ఫేక్ ఇన్‌వాయిస్‌లతో మోసాలకు పాల్పడ్డారని జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ ప్రకటించింది. ఇదే విషయాన్ని న్యాయస్థానానికి కూడా నివేదించింది. ఈ అక్రమాలపై సీఐడీ దర్యాప్తు చేస్తోంది. జీఎస్టీ విభాగంతోపాటు ఇన్‌కమ్ ట్యాక్స్, ఈడీ కూడా కుంభకోణంపై దృష్టి సారించాయి' అని బుగ్గన పేర్కొన్నారు. గత సర్కారు నైపుణ్యాభివృద్ధి ముసుగులో స్కామ్‌లకు పాల్పడగా తమ ప్రభుత్వం యువత భవిష్యత్ కోసం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోందని బుగ్గన తెలిపారు. 'రాష్ట్రవ్యాప్తంగా 192 స్కిల్ హబ్‌లను నెలకొల్పాం. ఉపాధి కల్పన కోసం పరిశ్రమలతో అనుసంధానం, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, వైఫై, సీసీటీవీలు, బయోమెట్రిక్ హాజరు సదుపాయాలతో నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం. ఇప్పటికే 21 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు చేపట్టాం. సంవత్సరానికి 50 వేల మందికి పైగా యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం' అని బుగ్గన వెల్లడించారు.

ముందే హెచ్చరించినా బేఖాతర్

– ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



చంద్రబాబు హయాంలో అన్నీ స్కామ్‌లే. యువతను నైపుణ్యాలతో తీర్చిదిద్దుతామంటూ ప్రజాధనం దోచేశారు. నిరుద్యోగ భృతి రూ.వెయ్యి ఇస్తామని యువతను మోసగించారు. గంటా సుబ్బారావుకు నాలుగు పోస్టులిచ్చారు. బాత్ రూమ్ సైజు కార్యాలయంలో 34 షెల్ కంపెనీల ద్వారా రూ.371.25 కోట్లు కాజేశారు. డబ్బులు ఎలా విడుదల చేయాలి? ఎలా ఖర్చు చేయాలనే వివరాలు ఎంఓయూలో లేవు. ఆర్థిక శాఖ కొర్రీలను కూడా పట్టించుకోలేదు. ఏసీబీ, సీమెన్స్ అంతర్గత సర్వే, జీఎస్టీ అధికారులు నాలుగుసార్లు హెచ్చరించినా చంద్రబాబు లెక్క చేయలేదు. దేశంలో చంద్రబాబు తెచ్చుకున్నన్ని స్టేలు ఇంకెవరూ పొందలేదు. చిత్తశుద్ధి ఉంటే స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో నిందితులు స్టే తెచ్చుకోకుండా విచారణకు సిద్ధపడాలి.

90% గ్రాంట్ ఎందుకిస్తుంది?



చంద్రబాబు ఏ విధంగా రాష్ట్రాన్ని, ఖజానాను కొల్లగొట్టారో తెలుసుకోవాలంటే స్కాంను పరిశీలిస్తే చాలు. అధికారంలోకి వచ్చిన నెల రోజులకే స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతిపాదన తెచ్చారు. టేబుల్ అజెండాగా కేబినెట్‌లో ప్రవేశపెట్టి రూ.3,356 కోట్ల ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. లెటర్ నెంబర్, డేటా లేకుండానే నిధులు విడుదల చేశారు. సీమెన్స్ కంపెనీ కాకుండా ఇతరులు డీపీఆర్ ఇచ్చారు. ఇతరులు డీపీఆర్ ఎలా తయారు చేస్తారు? ఒక కంపెనీకి ప్రభుత్వం రూ.3 వేల కోట్లు ఖర్చు పెడుతుందా? అసలు 90 శాతం గ్రాంట్‌ను ఓ ప్రైవేటు కంపెనీ ఎందుకిస్తుంది? స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో రూ.వందల కోట్ల దుర్వినియోగంపై నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్ నిలదీసినా ఎల్లో మీడియా ఒక్క ముక్క కూడా రాయలేదు. రెండు టోకెన్లు హైదరాబాద్ వెళ్లాయనే కోడ్ భాషను ఛేదించాలని కోరుతున్నా.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

చంద్రబాబువి పగటి కలలు

- ప్రభుత్వ సలహాదారు సజ్జల



సాక్షి, అమరావతి: ప్రజలు గద్దెనెక్కించినట్లుగా చంద్రబాబు పగటి కలలు కంటున్నారని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఆయన మాట్లాడిన ప్రతి మాటలోనూ అధికార కాంక్ష కనిపిస్తోందన్నారు. 'పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో ధైర్యం వచ్చిందని భావిస్తే వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ ఒంటరిగా పోటీ చేస్తానని చెప్పగలరా? అంత బలముంటే భయమెందుకు?' అని బాబుకు సవాల్ విసిరారు. దత్తపుత్రుడు లేకుండా అడుగు బయటకు వేయలేనని చంద్రబాబు భావించడం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన చరిత్ర బాబుకు లేదని స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించడం లేదన్నది వాస్తవమని పునరుద్ఘాటించారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయం వద్ద సజ్జల ఆదివారం మీడియాతో మాట్లాడారు.

అవసాన దశలో ఆత్మసంతృప్తి..

చంద్రబాబు ఏరోజైతే అసెంబ్లీకి రానని ప్రకటించారో ఇక ఎన్నడూ రాలేరని అప్పుడే అందరికీ అర్థమైంది. ఆయన అక్కసు, కడుపుమంట చల్లార్చుకునేందుకు మాట్లాడిన మాటలకు మేం విలువ ఇవ్వడం లేదు. అవసాన దశలో భ్రమల్లో ఉంటూ ఆత్మసంతృప్తి పొందితే పొందనివ్వండి. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో అవకతవకలకు పాల్పడ్డారు. వ్యవస్థలను మేనేజ్ చేసి వైరస్‌లా చొరబడటం బాబుకు అలవాటు. అధికారులు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉంది. 8వ రౌండ్లో టీడీపీవి కాని ఓట్లను ఆ పార్టీకి కలిపేశారని అభ్యంతరాలు వచ్చాయి. పరిశీలిస్తే 6 ఓట్లు దాంట్లో బయటపడ్డాయని రిటర్నింగ్ అధికారి కూడా ఒప్పుకున్నారు. అవకతవకలను ఆధారాలతో రుజువు చేశాం.

మాది ధర్మయుద్ధం

ప్రజాస్వామ్యయుతంగా పోరాడటం, విన్నవించుకోవడం, ధర్మయుద్ధం చేయడం వైఎస్సార్‌సీపీ విధానం. కుప్పంలో మేం కొట్టిన దెబ్బ నుంచి చంద్రబాబు ఇప్పటికీ కోలుకోలేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులివెందులలో విజయం సాధించామంటూ శునకానందం పొందుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మూడు జిల్లాలకు సంబంధించినదైతే ఒక్క పులివెందులదే అని ఎలా చెబుతారు? ఇది శునకానందం కాకపోతే మరేంటి?

వేసవిలో దాహార్తికి చెక్

సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం	ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ	రూ.5 కోట్లతో బోర్లు, చేతిపంపులు, పైప్‌లైన్ల మరమ్మతులు	ఇప్పటికే 70 శాతం చెరువుల్లో పూర్తి స్థాయిలో తాగునీరు



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు తాగునీటి ఎద్దడిని అధిగమించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా ఇప్పటికే తాగునీటి చెరువులను నీటితో నింపగా, బోర్లు, పైప్‌లైన్లు, చేతిపంపులకు మరమ్మతులు చేపట్టనున్నారు.

ఏలూరు: వేసవిలో తాగునీటి సమస్య అధికంగా మెట్ట ప్రాంతంలో తలెత్తే అవకాశం ఉండనుండటంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఏలూరు జిల్లాలోని అన్ని మండలాల్లో ఆయా గ్రామాల పరిధిలో ముందుగా తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత, పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. అలాగే మూతపడిన ఆర్వో ప్లాంట్‌లను తెరిపించి తాగునీటిని అందించాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 122 బోర్లకు మరమ్మతులు చేసి దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా గ్రామాల్లో మూగ జీవాలకు సైతం తాగునీరు అందుబాటులో ఉంచేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయనున్నారు. 269 మంచినీటి చెరువులకు గాను ఇప్పటికే 228 చెరువులను నీటితో నింపారు. అదేవిధంగా నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉండే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోనున్నారు.

తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాం

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకండా ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఉన్న తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపాం. రానున్న రోజుల్లో తాగునీటి కొరత సమస్యలు తలెత్తకండా చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ

ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశాం. జిల్లాలో ఉన్న మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపేలా చర్యలు తీసుకున్నాం. తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

పశ్చిమగోదావరి జిల్లాలో..

పశ్చిమగోదావరి జిల్లాలో 20 తాగునీటి చెరువులను ఇప్పటికే పూర్తి స్థాయిలో నీటిని నింపారు. ఆయా చెరువులకు అనుబంధంగా ఉన్న ట్యాంకులను పరిశుభ్రపరిచి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర విపత్తుల శాఖ సూచనలు మేరకు ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండటంతో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నగరపాలక, పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మంచినీటి వనరులను వేసవిలో పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా పంచాయతీ, గ్రామీణ నీటిసరఫరా, నీటిపారుదల, జిల్లా పరిషత్, మున్సిపల్ శాఖలు, అదేవిధంగా వ్యవసాయశాఖ, విద్యుత్ శాఖ, డ్వామా శాఖల సమన్వయంతో ఎటువంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. దీనిలో భాగంగా రెండు జిల్లాల్లో రూ.5 కోట్ల నిధులను కేటాయించి, తాగునీటి సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోనున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943